: నెం
143

అపరాధ పరిశోధన

రు. 5·50 సెప్టెంబర్ '83



Blank Page

సంపుటి: 37
సంచిక: 2

ఫోన్: నెం
64843

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 66 రూపాయలు.
హోమ్ డెలివరీ (పత్రిక మరియు సప్లిమెంట్) 10 రూపాయలు.

సెప్టెంబరు, 1983

"Rattukolu Subba Reddy Home Library, [illegible]

మేనేజింగ్ ఎడిటర్ :
[illegible] దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్ :
డి. రవికుమార్

సీనియర్ ఎడిటర్స్ :
వి. ఎస్. చెన్నూరి
ఏ. పీ. మోహన్రావ్
ఆర్. ప్రభాకర్
బొమ్మిడి అచ్చారావు

మీ ఉత్తరాలు

ఆగస్టు నెల అపసలో బి. రాజేశ్వగారి 'దొంగల వేట', ప్రసాద్ వర్మగారి 'ఈ వ్యవస్థ వర్ధిల్లాలి', ఈ రెండు కథలు పత్రికకు హైలెట్. కథలకు మల్లిక్‌గారి బొమ్మలు బాగుంటు న్నాయి. జోక్స్ కూడా ప్రచురించండి.

—ఆళ్ళ లక్ష్మీరమణమూర్తి, అనకాపల్లి.

ఈ నెల మా సపత్రికలో 'ఈ వ్యవస్థ వర్ధిల్లాలి' 'నల్లపిల్ల', 'మూడు ప్రశ్నలు' కథలు చాల బాగున్నవి. 'సాగరలోయ' సీరియల్ మంచి సస్పెన్స్‌లో ముంచెత్తుతోంది. ఇలాంటి మంచి సీరియల్ అందించిన మీకు, రచయితకు నా కృతజ్ఞతలు.

—అన్నపూర్ణ స్టూడియో, కొత్తపల్లి.

పొత్తూరు రాజేంద్రప్రసాద్ వర్మగారి 'ఈ వ్యవస్థ వర్ధిల్లాలి' మరియు బొమ్మిడి అచ్చారావుగారి 'మూడు ప్రశ్నలు' కథలు నాకు చాల నచ్చినవి. పత్రికకు ఈ రెండు కథలు హైలైట్స్ అనడంలో అతిశయోక్తి ఏమాత్రంలేదు. అటువంటి వెరైటీ కథలను ఎన్నిక చేయడం ఎడిటర్స్ యొక్క ప్రతిభను తెలుపుతుంది.

—జి. వెంకటి, నిజామాబాదు.

ముఖచిత్రాలు ఆకర్షణీయంగా ఉన్నవి. సప్లిమెంట్‌లో 'లిలీ', 'వనమాలికలు' వెరైటీ నవలలు. సికిందర్‌గారి విషసర్పం మందంగా సాగుతోంది. అపసలో సింహం గర్జించాలి, బ్యాంకు దొంగలు, దొంగలవేట, శవాలను మాయం చేస్తాం కథలు ప్రశంస నీయమైనవి. 'సాగరలోయ'లో రాజేష్ బృందం ఎదుర్కొంటున్న ప్రమాదాలు చదువరులకే గగుర్పాటు కలిగిస్తున్నవి. పాపం, రాజేష్ బృందానికి ఇకనైన విముక్తి కలిగించమని బొమ్మిడి అచ్చారావుగారికి నా మనవి.

—జె. నరసింహప్రసాద్, శ్రీకాళహస్తి.

ఈ నెలలో...

కథలు (మాస పత్రిక)

4. రాత్రి పగలు—జొన్నలగడ్డ రామలక్ష్మి
25. బ్యాంకు దోపిడి —కాశీభట్ల భానుమూర్తి
38. దుబాయ్ వ్యాపారులు— ప్రతాప రవిశంకర్
48. రాంగ్ నంబర్—బి. రాజేశ్వరి
70. ఎముకల మూట— వసుంధర
89. దొంగను చూచి బెదరకు—కె. వి. రమణ
101. కన్నెపిల్ల కోరిక—కె. బి. ఎస్. కుమార్
121. సాక్షి—మల్లిక్
133. విషవాయువు—అజీజ్
163. కాల్ గర్ల్—యం. డి. చైతన్య
176. సాగర లోయ (సీరియల్)—బొమ్మిడి అచ్చారావు

నవలలు (సప్లిమెంట్)

3. స్కెలిటన్ గ్రూప్—వసుంధర
45. పడగవిప్పిన తాచుపాము—బొమ్మిడి అచ్చారావు
83. బందిపోటు నాయకుడు— బొమ్మిడిఅచ్చారావు
121. మరపురాని మగువ— టెంపోరావ్
157. వెర్రివాడి తెలివి—బి. రాజేశ్వరి
199. విషసర్పాలు (సీరియల్)—సికిందర్

ఇవిగాక — క్రైమ్‌లో తమాషాలు, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, మీ తీర్పు ఏమిటి, అపరాధ పరిశోధన పోటీ, మరెన్నో ఆకర్షణలు!!!

రాత్రి పగలు

జొన్నలగడ్డ రామలక్ష్మి

అతను తరుముతున్నాడు.

నేను పరుగెడుతున్నాను.

వేగంగా పరుగుపెట్టడం నాకు అలవాటే! కానీ ఒక మగవాడితో సమంగా పరుగు పందెంలో ఎక్కడ పోటీ పడగలను?

అందులోనూ అతడిది కాంక్ష.... ఆ కాంక్ష అతడికి

బలాన్నిస్తోంది.

నాది భయం. నా భయం నా బలాన్ని హరిస్తోంది.

అతను నన్ను సమీపిస్తున్నాడు.

నేను మళ్ళీ వేగం పుంజుకుంటున్నాను.

ఎలాంటి దురదృష్టకర పరిస్థితి?

ఇంట్లో అమ్మా నేను మాత్రం వున్నాం. అమ్మకు వంట్లో బాగాలేదు.

అప్పుడు వచ్చింది టెలిగ్రాం.

స్వాతి నాన్నగారికి ప్రమాదంగా వున్నదట.

స్వాతీ వాళ్ళు మా పక్కింట్లో వుంటున్నారు. పది రోజుల క్రితం స్వాతినాన్నగారికి ఆరోగ్యం బాగుండక నెల్లూరు తీసుకెళ్ళారు.

ఇప్పుడు టెలిగ్రాం అక్కణ్ణించే వచ్చింది.

స్వాతి ఇంట్లో లేదు. అసలు స్వాతి కూడా ఊరు వెళ్ళవలసింది. పరీక్షలని వుండిపోయింది. ఊళ్ళో ఆమె చిన్నాన్నగారున్నారు. తనొక్కర్తీ వుండలేదని, మా ఇంట్లో వుంచటానికి మొహమాటపడి స్వాతిని వాళ్ళ చిన్నాన్నగారింట్లో వుండమన్నారు.

మరి టెలిగ్రాం యిక్కడికెందు కిచ్చారో? బహుశా అలవాటులో పొరపాటై వుంటుంది. మేమా మాత్రం కబురు చేరవేయమా అని కూడా అనుకుని వుంటారు.

టెలిగ్రాం సంగతి అమ్మకు చెప్పాను.

"అయ్యో వెంటనే వెళ్ళి కబురు చెప్పిరా అమ్మా!" అంది అమ్మ.

స్వాతి ఇంటికి వెళ్ళాలంటే మా యింటి నుంచి ఇరవై నిముషాలు పడుతుంది. కొన్ని నిర్మానుష్య ప్రాంతాలు కూడా దాటాలి.

అతి రాత్రి పదకొండు గంటల సమయం. పరీక్షలు కాబట్టి నేనూ మెలకువగా వుండి చదువుకుంటున్నాను కాబట్టి గానీ లేకపోతే ఈ పాటికి మంచి నిద్రమత్తులో వుండి వుండవలసినదాన్ని. అయినా అంత నిద్రమత్తునూ వదేలించగల టెలిగ్రాం అది.

ఆ టెలిగ్రాములోని విషయం నాకింకేమీ స్ఫురింపచేయ లేదు—వార్త స్వాతికి వెంటనే అందజేయాలన్న ఆదుర్దా తప్ప!

ఇంట్లో బయల్దేరి నేను మొదటి సందు తిరిగినప్పుడు ఎవరో నన్ననుసరిస్తున్న సూచన నాకు కలిగింది. కానీ అదసలు పట్టించుకోలేదు నేను. స్వాతికి త్వరగా కబురు అందజేయడంకోసం నేను పరుగులాంటి నడకతో వెడుతున్నాను.

ఇంకో సందులోకి వచ్చాను.

అది నిర్జన ప్రాంతం.

సరిగ్గా అక్కడే....

నన్ననుసరిస్తున్న వ్యక్తి చటుక్కున వెనకనుంచి ముందుకు వచ్చి చేయిపట్టుకున్నాడు.

ఉలిక్కిపడి అతడివంక చూశాను.

ముఖం ఎప్పుడో చూపినట్లే వుంది. సుమారు పాతికేళ్ళ యువకుడు.

అది వెన్నెలరాత్రి.

నా వయస్సు పద్దెనిమిది. అతని చూపుల అర్థం నాకు తెలుసు. అతడి చేతివేడి నా అనుభవానికి కొత్త అయినా ఊహకు కొత్తకాదు.

అందుకే అతణ్ణి ఇలా విదిలించుకుని అలా ఒక్క తోపు తోసి పరుగు లంకించుకున్నాను. నిజానికి వెనక్కు

తిరిగితే మా యిల్లు దగ్గర. అయినా స్వాతికి టెలిగ్రాం యివ్వడంకోసం ముందుకే వెళ్ళాలనుకున్నాను.

అతడు లేచేలోగా చాలాదూరమే వెళ్ళగలిగాను.

కానీ అతడి వేగం నన్ను మించినది....

అడుగుల చప్పుడు నా వెనుకే వినిపిస్తూ నాకు దగ్గరవుతోంది. చప్పుడు దగ్గరవుతున్నకొద్దీ నా గుండె చప్పుడు పెరిగిపోతోంది.

ఉన్నట్లుండి తెగించాను.

అడుగుల చప్పుడు బాగా దగ్గర కాగానే ఒక్కసారిగా సడెన్ బ్రేకు వేసినట్లు ఆగిపోయి అతడివంక తిరిగాను.

అతడిది ఊహించలేదు ఆయాసంతో రొప్పుతున్నాడు! మళ్ళీ సర్వశక్తులూ క్రోడీకరించుకుని ఒక్కతోపు తోశాను.

అతను పడిపోయాడు.

నేను మళ్ళీ పరుగు ప్రారంభించాను.

"అమ్మా!" అన్న కేక వినిపించింది.

ఆ గొంతు అతడిదే!

ఏమయిందతడికి? నేను తోయగానే ఏదైనా రాతిమీద పడ్డాడా? లేక నేను తోయడంలో అతడి నడ్డి విరిగిందా? లేక ఏ పామైనా....

అయినా నేను వెనక్కు తిరగలేదు.

అతడు నన్ను తరిమే స్థితిలో వుండివుండకపోవచ్చు. నన్నాపడంకోసం అతడిలా ట్రిక్ చేస్తూ వుండవచ్చు. నేనతడి గురించి ఆలోచించదల్చుకోలేదు.

స్వాతి....స్వాతికి టెలిగ్రాం....

2

నేను మళ్ళీ పరుగెడుతున్నాను.

అప్పుడు నాకో వనిత ఎదురయింది. ఆమెకు సుమారు

నలభై సంవత్సరా లుంటాయి. లావుగా, పొట్టిగా వుంది. ఆమెను కాస్త దూరాన్నుంచి చూస్తూనే నేను నా పరుగు ఆపాను.

ఆమెను చూడ్డం వల్ల నాలో కాస్త ధైర్యమూ వచ్చింది.

ఇద్దరం ఒకరి కొకరం ఎదురుగా నడుస్తున్నాం. కలుసు కుందుకు ఎంతోసేపు పట్టలేదు. ఆమె నన్ను చూసి ఆగి పలకరింపుగా నవ్వింది. ఆ నవ్వు ఇంపుగా వుంది.

నేను మాట్లాడలేదు కానీ ముందడుగు ఆపాను.

"ఎక్కడికమ్మా?" అన్నదామె.

చెప్పాను.

"అలా హడావుడి పడిపోతున్నావేమిటి?"

కారణం చెప్పాను.

"ముఖంలో ఆ భయమేమిటి?"

అందుకూ కారణం చెప్పాను.

"అయ్యో—చిట్టితల్లీ—నాలుగడుగులు అటుపక్కగా వెళ్ళామంటే మా యిల్లు వస్తుంది. నీకు మా అబ్బాయినీ సాయంగా ఇచ్చి పంపుతాను. ఏ భయం లేకుండా వెళ్లొచ్చు" అన్నదామె.

వాళ్ళింటికి చేరుకునేందుకు అయిదు నిముషాలు పట్టింది.

ఆమెలో ఏదో ఆకర్షణ వుంది. లేకపోతే అలా చెప్ప గానే నేను కూడా వెళ్ళేరకం కాదు. బహుశా అతను నన్ను తరమడం కూడా ఓ కారణ మయుండవచ్చును.

అదో చిన్న డాబాయిల్లు.

లోపల్నుంచి ఏవో పాటలు....సన్నగా గజ్జెల చప్పుడు కూడా....

ఉన్నట్లుండి నాకు గుర్తుకు వచ్చింది.

నేనెక్కడికి వచ్చాను?

ఈ ఊరిలో పుట్టి పెరిగినదాన్ని. ఊరి గురించి నాకు బాగా తెలుసు.

ఆ సందుకు మంచిపేరు లేదు.

మగాళ్ళ కక్కడ ఆకర్షణ....

ఆ సందులో ప్రవేశించిన ఆడదానికి గౌరవం ఉండదు.

అప్రయత్నంగా ఆమె వంక చూశాను.

"లోపలకు రామ్మా" అందావిడ.

నే నలాగే నిలబడిపోయాను. నాలో మళ్ళి కొత్త భయం.

తెలివి తక్కువగా నేనీ సందులో ప్రవేశించానేమిటి?

ఈ నడివయస్సు స్త్రీ ఎవరు? ఈమె నన్నిక్కడకు ఎందుకు తీసుకొచ్చింది?

"లోపలకు రామ్మా" అందావిడ.

"మీ అబ్బాయినీ, అమ్మాయినీ పిలవండి—ఈ టెలిగ్రాం అర్జంటుగా నా స్నేహితురాలికి అందజేయాలి—" అన్నాను.

"దానికి నువ్వు వెళ్ళడమెందుకూ?" అన్నదామె—"కాస్త లోపలకు వచ్చి కూర్చో. మావాడు వెళ్ళి ఇచ్చేసి వస్తాడు. ఓ క్షణం విశ్రాంతి తీసుకుందువుగాని."

నేనేదో అనేలోగా ఆ యింటి తలుపులు తెరుచుకున్నాయి. ఓ మనిషి బయటకు వచ్చాడు.

"వాడే మా అబ్బాయి" అన్నదామె.

వాడు మనిషిలా లేడు. రాక్షసుడిలా వున్నాడు.

"బాబూ పాప కాసేపిక్కడ విశ్రాంతి తీసుకుంటుంది. నువ్వు వెళ్ళి ఆమె చెప్పిన అడ్రసుకు ఆమె ఇచ్చిన టెలిగ్రాం అందజేసిరా" అందామె.

"అలాగేనమ్మా" అన్నాడు వాడు.

"నేనూ వెడతాను. నాకు విశ్రాంతి అవసరం లేదు" అన్నాను.

అప్పుడా రాక్షసుడు నా చేయి బలంగా పట్టుకున్నాడు—"నువ్విక్కడే వుండాలి" అన్నాడు.

"చూడమ్మా"—అన్నదామె—"ఒకాయన కొత్తపిట్ట కోసం అదే పనిగా మనసుపడిపోతూంటే నేనీ రాత్రివేళ వీధిన పడ్డాను. అదృష్టవశాత్తూ నువ్వు దొరికావు. నిన్నెలా వదులుకుంటానూ? బుద్ధిగా వుంటే ఆ టెలిగ్రాం నీ స్నేహితురాలికి అందుతుంది. లేని పక్షంలో అదీ లేదు."

మళ్ళీ చిక్కుల్లో పడ్డాను.

వాడు నా చేతిని బలంగా పట్టుకున్నాడు. నేను విదిలించుకుంటానన్న అనుమానం వాడికి ముందే వున్నట్లుంది.

"పాపను లోపలకు తీసుకుని వెళ్ళి టెలిగ్రాం తీసుకో బాబూ" అన్నదామె.

"అలాగేనమ్మా!" అన్నాడు వాడు.

నాకిప్పుడు ఆమె మాట కటువుగానూ, వాడి మాట సౌమ్యంగానూ వున్నట్లనిపించింది.

"ఏం చేయాలి?" ఒకటే ఆలోచన.

వాడు నన్ను మోటుగా లాగాడు. నేను బుద్ధిగా లోపలకు నడిచాను.

"టెలిగ్రాం ఇలా ఇయ్యి" అన్నాడు వాడు. అదివాడి చేతిలో పెట్టాను. వాడది చొక్కా జేబులోకి తోసేశాడు.

వాడి వెనుకే ఆమె లోపలకు వచ్చేసింది.

వాడు బయటకు వెళ్ళాడు.

ఆమె నన్ను సమీపించి "చూడమ్మా—ఈ యింట్లో నీకే ప్రమాదమూ వుండదు" అంది.

"ప్రమాదమంతా ఇక్కడే వుంది" అన్నాను.

"ప్రమాదమేమిటి? ఇక్కడ సుఖం వుంది" అన్నదామె.

"నాకు సుఖం వద్దు."

ఆమె నవ్వి "అయితే పెళ్ళిచేసుకోవా?" అంది.

"పెళ్ళివేరు—ఇది వేరు" అన్నాను.

"అన్నీ ఒక్కటే. నువ్వింకా అమాయకురాలివి. నీకు వివరంగా చెబుతాను విను" అన్నదామె.

"పూర్వం కుంతీదేవి సూర్యుడిపై మనసుపడి మంత్రం జపిస్తే అతడు వచ్చి ఆమెకు బిడ్డను ప్రసాదించాడట. అయినా ఆమె కన్యత్వం చెడకుండా వరమిచ్చాడట.

"నీ కన్యత్వం చెడదని వరమివ్వలేను కానీ—నీకు తల్లి వయ్యే ప్రమాదం లేకుండా సలహా చెప్పగలను" అన్నదామె.

"నాకే సలహాలూ వద్దు" అన్నాను.

ఆమెది పశుబలం. ఆ పశుబలంతో ఆమె నన్నో గది లోకి తోసి తలుపులు వేసింది.

నాకు దుఃఖం వచ్చేస్తోంది. అంత దుఃఖంలోనూ ఏదో కొత్త అనుభూతి కలుగుతోంది. గదిలో ఏమున్నదీ చూశాను.

గోడలకు శృంగార పటాలు. ఛీ అని సిగ్గుపడే విధంగా వున్నాయవి.

గదిలో ఓ మంచం. మంచంమీద తెల్లటి దుప్పటి. గదంతా మల్లెల పరిమళం.

మంచానికి పక్కగా ఓ కుర్చీ. ఆ కుర్చీలో ఓ యువకుడు కూర్చుని వున్నాడు. అతడి వీపు నావైపు తిరిగి వున్నది. అతడి చేతిలో విస్కీ బాటిల్!

అతడు కుర్చీలో వెనక్కు జారగిలబడి ఏదో ఆలోచిస్తున్నవాడిలాగున్నాడు.

ఇప్పుడు నేను....అతడు....

వళ్ళంతా భయంతో కంపించింది.

ఛీ....ఎంత అసహ్యకరమైన పరిస్థితి?

తలుపు చప్పుడు అతను వినే వుండాలి. అయినా నేను వచ్చి అతడి ముందు నిలుస్తాననుకున్నాడేమో!

"ఇలా వచ్చి గ్లాసులో విస్కీ పొయ్యి" అన్నాడతను.

ఆ గొంతు పరిచయమైనదిగా నాకు అనిపించింది.

ఎక్కడ విన్నాను?

ఊహకు అందడంలేదు.

నేనింకా అలాగే నిలబడ్డాను.

"ఊఁ త్వరగా రా—"

నేను కదల్లేదు....

"ఏం...." అంటూ బూతు మాట మాట్లాడేడు.

నా వళ్ళు సిగ్గుతో చచ్చిపోయింది. ఎంత అసహ్యంగా మాట్లాడాడు? ఒక మగాడు అపరిచితురాలైన ఆడదానితో ఇంత సిగ్గులేకుండా మాట్లాడతాడా?

అతను చటుక్కున లేచి నిలబడ్డాడు.

"వెనక్కి తిరిగేలోగా ముందుకిరా—నే వెనక్కి తిరిగానంటే మనిషిని కాను" అన్నాడు.

గంభీరమైన ఆ కంఠం నాకు బాగా పరిచితం. కానీ ఎందుకో అతనెవరో స్ఫురణకు రావడంలేదు. ఏమైతే అయిందని తెగించి నేను అలాగే నిలబడి వుండిపోయాను.

అప్పుడతను చేతిలోని విస్కీ బాటిల్ ఎదురుగా వున్న బల్లమీద పెట్టి విసురుగా వెనక్కి తిరిగాడు.

అప్పుడు నేను అతన్ని చూశాను.

అతనూ నన్ను చూశాడు.

అతను మా ఇంగ్లీష్ లెక్చరర్ శ్యాంప్రసాద్!

ఇద్దరం ఒకళ్ళనొకళ్ళం తెల్లబోయి చూసుకున్నాం.

శ్యాంప్రసాద్‌కు కాలేజీలో మంచిపేరు లేదు. ఆయన్ను పెళ్ళాం వదిలేసిందనీ, చెడుతిరుగుళ్ళకు బాగా అలవాటు పడినవాడనీ అంతా అనుకుంటూంటారు. ముఖ్యంగా ఆడపిల్లలకు ఆయనతో మాట్లాడాలంటేనే భయం.

నా పని అయిపోయిందనే అనుకున్నాను.

అతను నావంకే రెప్పవాల్చకుండా చూస్తున్నాడు.

నేను ఒక్కక్షణం మాత్రమే అతడివంక చూడగలిగాను. ఆ తర్వాత చూపులు దించుకున్నాను.

"నువ్వు వీణవు కదూ?" అన్నాడు శ్యాంప్రసాద్.

నేను మాట్లాడలేదు. నా పేరు ఆయనకు బాగానే గుర్తున్నది.

"ఎలా వచ్చావిక్కడికి? వళ్ళు కొవ్వెక్కిందా?"

నేను మాట్లాడలేదు.

"మాట్లాడవేం?" గద్దించాడాయన.

అప్పుడు నా కుక్రోషంకూడా వచ్చింది. తప్పుచేసింది తను. పైగా నేనేదో తప్పుచేసినట్లు నన్ను గద్దిస్తాడేం?

నా గళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"మాట్లాడవేం?" మళ్ళీ గద్దించాడాయన.

ఏదో చెబుదామనుకున్నాను. ఏడుపువల్ల మాటరావడం లేదు. వెక్కివెక్కి ఏడ్వసాగాను.

అప్పుడాయన నన్ను సమీపించి "ఇలా రావడం నీకు ఎన్నోసారి?" అన్నాడు.

నేను నిలబడలేకపోయాను. కూర్చుని భోరున ఏడ్చేశాను.

ఆయన నన్ను ఏడ్వనిచ్చాడు. నా ఏడుపు పూర్తయ్యాక "ఇప్పుడు మాట్లాడు" అన్నాడు.

నేను నెమ్మదిగా నా కథ చెప్పాను. కథ చెప్పాక నాకు మళ్ళీ ఏడుపు వచ్చింది.

ఆయన జాలిగా నా వంక చూసి "నేను నిన్ను జాగ్రత్తగా బయటకు పంపిస్తాను. కంగారుపడకు" అన్నాడు.

నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. ఆయన నా కళ్ళలోని ఆశ్చర్యం చదివాడో ఏమో "అలా ఆశ్చర్యపడతావేం! నేనెలాంటి వాడినైనా నా స్టూడెంట్సుని వేశ్యలుగా మార్చలేను" అన్నాడు.

నేను మరింత ఆశ్చర్యపడ్డాను.

"చూడమ్మా నువ్వు నా కూతురిలాంటి దానివి. పొరపాటున మనమిద్దరం యిక్కడిలా ఈ విధంగా కలుసుకున్నాం. ఈ దృశ్యాన్ని నువ్వు విన్న మాటల్ని నీ మనసులోంచి చెరిపేసేయ్" అన్నాడాయన.

"థాంక్స్ మాష్టారూ" అన్నాను.

శ్యాంప్రసాద్ అన్నమాట నిలబెట్టుకున్నాడు. ఆయన నన్ను స్వయంగా వీధిలోకి తీసుకుని వచ్చి సందు చివర వరకూ వచ్చి దిగవిడిచి "జాగ్రత్తగా వెళ్ళమ్మా!" అన్నాడు.

"అలాగే మేస్టారూ" అంటూ ఆయనకు రెండుచేతులూ జోడించి నమస్కరించాను. జీవితంలో ఇంతటి కృతజ్ఞతా భావం నాకెప్పుడూ కలిగి వున్నట్లు లేదు.

"భయం లేదుగదా" అన్నాడు శ్యాంప్రసాద్.

"లేదండి. మీరు వెళ్ళండి" అన్నాను.

ఆయన బాగా తాగి వున్నాడు. ఏ కళనున్నాడో, ఏ ఆశయాలకు కట్టుబడ్డాడో కానీ నన్ను రక్షించాడు. తాగుడు మైకంలో వున్నప్పుడు మనిషి అసలు బుద్ధి బయటపడుతుందంటారు.

ఆడవాళ్ళకు సంబంధించినంతవరకూ ఆయన మహో మనీషి!

అయితే నేను నేనని తెలియనప్పుడు ఆయన నన్నుద్దేశించి అన్నమాటలు నేను మరిచిపోగలనా? ఆడువారిపట్ల ఆయన సంస్కారం అంతేనా?

3

మళ్ళీ నేను ఒంటరిగా రోడ్డుమీ దున్నాను.

ఇప్పుడేం చేయాలి? ఇంటిదారి పట్టాలా—లేక స్వాతి ఇంటికి వెళ్ళాలా?

ఎటు వెళ్ళినా ఒకటే దూరం నాకు.

సరిగ్గా మధ్యలో వున్నాను.

ఆ రాక్షసుడన్నాడు—టెలిగ్రాం స్వాతికి అందజేస్తానని! అందజేశాడో లేడో—వాళ్ళసలే మాయమనుషులు!

నేను మంచిపని చేయడానికి బయల్దేరాను. నాకే అపకారమూ జరుగదు. జరక్కూడదు. లేకపోతే ఈ ప్రపంచంలో మంచి అన్న పదానికి అర్ధమేమున్నది?

ధైర్యంచేసి ముందడుగే వేశాను.

ఇదేనా మనదేశపు సంస్కృతి!

స్వాతి ఇంటివైపు నడుస్తున్నాను. ఇంకా పది నిముషాలు నడవాలి.

సరిగ్గా అప్పుడు వెనకనుంచి ఎవరో నా చేయి పట్టుకుని లాగారు. వెనక్కు తిరిగాను.

అతను!

"హమ్మయ్య మొత్తానికి దొరికావు" అన్నాడు.

ఈసారి అతడి పట్టు బలంగా వున్నది. విదిలించుకుందామని ప్రయత్నించాను కానీ సాధ్యపడలేదు.

"నేను తెగించినవాణ్ణి—నడిరోడ్డుమీద అవమానపడకు.

దగ్గర్లోనే మా ఇల్లుంది. మర్యాదగా నాతోరా" అన్నాడతను.

నా దృష్టి అంతా అతడి పట్టుమీదే వుంది. ఏమాత్రమూ సడలడంలేదు.

"త్వరగారా" అన్నాడతను.

"ఎవర్నువ్వు?" అన్నాను.

"చాలా రోజులుగా నిన్ను చూస్తున్నాను. నువ్వంటే మనసయింది. అనుకోకుండా ఈ రోజు నువ్వు నాకిలా తగిలావు. ఈ అవకాశం వదులుకోలేను."

తప్పించుకుందుకు ప్రయత్నిస్తే బట్టలు వలిచేస్తానని బెదిరిస్తున్నాడు. అతన్నించి మర్యాదగా ఎలా తప్పించుకోవాలా అని ఆలోచిస్తున్నాను. ఆలోచిస్తూనే అతడితోపాటు నడుస్తున్నాను.

మళ్ళీ నాదారి మళ్ళుతోంది.

అయితే అదృష్టం నన్ను వదల్లేదు.

చటుక్కున పక్కసందులోంచి మామీద బ్యాటరీలైటు కాంతి పడింది. ఉలిక్కిపడేలోగా ఓ బీటు కానిస్టేబులు మా ముందు నిలబడ్డాడు.

"ఎవరు మీరు?" అన్నాడతను.

నా చేయి పట్టుకున్న యువకుడు నీళ్ళు నమిలాడు.

"భార్యా భర్తలు కారని తెలుస్తూనే వుంది. అన్నా చెల్లెలు కారని మీ వాటాలే చెబుతున్నాయి" అన్నాడు కానిస్టేబులు.

నాకో మంచి అవకాశం వచ్చిందనిపించింది. చటుక్కున ఓ అడుగు ముందుకు వేసి "అన్నయ్యా—నువ్వే నన్ను రక్షించాలి" అన్నాను.

"రక్షించడమేమిటి?" అన్నాడు కానిస్టేబులు.

"చాలా ప్రమాదంలో వున్నాను" అంటూ మూడు

ముక్కల్లో అతడికి నా చేయి పట్టుకున్న యువకుడి దురాగతం గురించి చెప్పాను.

"మే మిద్దరం ప్రేయసీ ప్రియులం. నువ్వు స్టేషనుకు నడిపిస్తావేమోనని భయపడి ఈ అమ్మాయిలా చెబుతోంది. మమ్మల్ని వదిలి నువ్వు వెళ్ళొచ్చు" అన్నాడు చేయి పట్టుకున్న యువకుడు.

కానిస్టేబులు తమాషాగా కన్నుగీటి ఆ యువకుడివంక చూశాడు. నావంక అభిమానంగా చూస్తూ "నిజంగా వెధవైతే ఇద్దర్నీ స్టేషనుకు తీసుకుపోయి రాత్రికి లాకప్‌లో వుంచుతాను. చెప్పు" అన్నాడు.

"చేసిన నిర్వాకం చాల్లే — పద పోదాం" అన్నాడా యువకుడు చనువుగా నా నడుంమీద తట్టి.

ఏమనాలో నాకు తోచలేదు. పోలీసు స్టేషను గురించి చాలా విన్నాను నేను. ఇప్పుడు మేమిద్దరం పోలీస్‌స్టేషన్లో వున్నామంటే ఈ విషయానికి చాలా పెద్ద ప్రచారం లభిస్తుంది. ఊరంతా నా బ్రతుకు అల్లరై పోతుంది.

నేనో వెర్రినవ్వు నవ్వి ఆ యువకుడి ననుసరించాను.

పోలీసు అలా కనుమరుగు కాగానే అతడు మళ్ళీ నా చేతిని ఉడుంపట్టు పట్టాడు. వీడిని వదిలించుకునే మార్గమేలా?

ఆలోచిస్తున్నాను. నాలుగడుగులు వేశామోలేదో వున్నట్లుండి.... దొంగ.... దొంగ అని పెద్దగా కేక వినపడింది.

అంతలోనే మమ్మల్ని గుద్దుకుంటూ ఓ మనిషి పరుగున వెళ్ళిపోయాడు. వాడి చేతిలోంచి ఓ మూట జారిపడింది. చాలా దగ్గర్లోనే జనం వస్తున్న సంద డవుతున్నది. మమ్మల్ని గుద్దినవాడు దొంగ అయుంటాడు. మేము పట్టు

ఉంటామని బెదిరిపోయాడో ఏమో—మళ్ళీ వెనక్కి చూడకుండా పారిపోయాడు.

ఈలోగా జనం మమ్మల్ని సమీపించారు.

ఉన్నట్లుండి నా బుర్రలో ఏదో మెరిసింది....

"దొంగ....దొంగ...." అని అరిచాను.

అంతసేపూ నా చేయి పట్టుకున్న యువకుడికి ఏం జరుగుతున్నదీ అర్థం కాలేదు. జనానికి మాత్రం అర్థమయింది.

అంతా అతడిమీద పడ్డారు.

ఆ యువకుడి గోడు ఎవ్వరూ వినిపించుకోవడంలేదు.

నేను నా కథ చెప్పాను. స్వాతి ఇంటికి బయల్దేరితే అతడు పరుగున రాగా నేనే ఇప్పుడతడి చేయి పట్టుకున్నానని చెప్పాను. అక్కడే వున్న మూట అందుకు సాక్ష్యంగా నిలిచింది.

ఒకరు మూటవిప్పి చూశారు.

మొత్తంమీద వస్తువులేమీ పోలేదని తెలిసింది.

అంతా ఆ యువకుడిమీద విరుచుకుపడ్డారు.

నాకా యువకుడిమీద ద్వేషమున్న మాట నిజమే! కానీ నేనే ఆ దారుణ హింసాకాండను చూడలేక పోయాను.

మనుష్యుల్లో ఎంతటి హింసాప్రవృత్తి!

అతడి ముక్కునుంచీ, నోటినుంచీ రక్తం కారుతున్నది. కాళ్ళూ చేతులూ స్వాధీనంలో వున్నట్లు లేవు.

తలపెట్టిన పాపానికది తగిన శిక్ష అవునోకాదో కానీ—శిక్షమాత్రం వెంటనే అనుభవించాడని చెప్పాలి.

ఎవరో పోలీసుల ప్రసక్తి తీసుకుని వచ్చారు.

"ఇప్పుడు పోలీసుల గొడవ తెచ్చామంటే—దొరికిన వస్తువులు వెనక్కి తీసుకుని వెళ్ళడం ఓ పెద్ద బెడద. వీణ్ణిలా వదిలిపెట్టడమే శ్రేయస్కరం" అన్నాడు ఓ పెద్ద

మనిషి.

అందరికీ అదే సబబుగా తోచింది.

నేను నా కథ చెప్పుకుని—కొంచెం స్వాతి ఇంటివరకూ ఎవరినైనా వచ్చి దిగబెట్టవలసిందిగా కోరాను.

ఒకాయన ముందుకు వచ్చాడు.

"ఆగండి — నేనూ వస్తాను" అంటూ ఒకావిడ ముందుకు వచ్చింది.

ఆవిడ ఆయన భార్య.

తన భర్తను నేనాకర్షించుకుంటానేమోనన్న భయంతో ఆమె అతడికి తోడుగా రావాలనుకుంది. అతడినుండి నాకేమీ భయంలేకుండా నాకు శ్రీరామరక్షగా వుంటుందని నాకు అనిపించింది.

వాళ్ళిద్దరూ నన్ను స్వాతి ఇంటివద్ద దిగబెట్టారు.

ఇంటి తలుపు తాళం వేసి వుంది.

నేనాశ్చర్యపడ్డాను. టైము చూసుకుంటే పన్నెండుంపావయింది.

స్వాతికి అప్పుడే టెలిగ్రాం అందేసి ప్రయాణమై పోయిందా? ప్రయాణమైపోయిన పక్షంలో ఆమె చిన్నాన్న ఏమయ్యాడు?

ఇంటికి తాళం ఎలా వచ్చింది?

క్షణాలమీద అంతా ప్రయాణమైపోయారా?

"నిన్ను మళ్ళీ ఇంటిదగ్గర దిగబెట్టాలా అమ్మా!" అంది కూడా వచ్చినావిడ. నేను తల అడ్డంగా ఊపాను.

పక్క సందులో మాలతి ఇల్లు వుంది. కంబైన్డు స్టడీస్ కని అక్కడికి వెడుతూ వుంటుంది స్వాతి. ఈ పరీక్షల సమయంలో ఆమె ఇల్లు వదిలి పోదు.

విషయమేమిటో మాలతి ఇంటికి వెళ్ళి తెలుసుకోవాలి.

నా అంగరక్షకులు వెళ్ళిపోయారు. నేను పక్కసందు లోని మాలతి ఇంటికి వెళ్ళాను.

వీధి గదిలో దీపం వెలుగుతోంది. గదిలోంచి మాటలు వినపడుతున్నాయి. అంటే కంబైన్డు స్టడీస్ జరుగుతున్నా యన్న మాట.

నేను గది గుమ్మంవరకూ వచ్చి ఆగిపోయాను. ఆ సంభాషణ నన్ను విభ్రాంతురాల్ని చేసింది.

గదిలో మాట్లాడుకుంటున్నది మాలతి, స్వాతి కాదు.

ఆ సంభాషణ వింటూంటే అసలేం జరిగిందో నాకు అర్థమైపోయింది.

4

సరిగ్గా ఇరవై నిముషాల క్రితం రాక్షసుడు స్వాతికి టెలిగ్రాం అందించాడు. అది అందుకోగానే స్వాతికి కాళ్లూ చేతులూ ఆడలేదు.

అనుకోకుండా ఏదో కార్యం వచ్చి ఆ రోజు ఉదయమే స్వాతి చిన్నాన్న కుటుంబమంతా ఊరికి వెళ్ళిపోయారు. తనకు పరీక్షలున్న కారణంగా స్వాతి వుండిపోయింది.

టెలిగ్రాం చూడగానే స్వాతి మాలతి ఇంటికి బయల్దే రింది.

సాధారణంగా పరీక్షల సమయంలో మాలతి వీధిగదిలో చదువుకుంటుంది. వీధిగదిలో దీపం వెలుగుతూంటే స్వాతి మాలతీ లోపల వున్నదనుకుని తలుపు తట్టింది.

తలుపు తెరుచుకుంది. మాలతి అన్న ప్రభాకరం ఆమెను చూసి ఆశ్చర్యపోయాడు.

స్వాతి టెలిగ్రాం చూపించింది.

"అయ్యో—పాపం" అన్నాడు ప్రభాకరం.

ప్రభాకరం నిరుద్యోగి. మాలతి కారణంగా స్వాతికి

అతడు బాగా పరిచయం. తీరిక సమయాల్లో అతడు సెక్సు నవల్సు బాగా చదువుతూంటాడు. ఇప్పుడూ అదే పని చేస్తున్నాడు.

స్వాతి అతడి మంచంమీద సగం తెరిచి వున్న సెక్సు నవలని చూపింది.

మంచం పక్కన వున్న రెండు నగ్న సినీతారలఫోటోలు చూపింది.

స్వాతి—ప్రభాకరం ఒకరంటే ఒకరు ఆకర్షితులవుతున్నారు. అయితే ఒకటి రెండు నిముషాలకు మించి వారు కలుసుకుని మాట్లాడడం జరుగలేదు.

బస్సుల్లోనూ, సినిమాథియేటర్ల రద్దీలోనూ వారు ఒకరి కొకరు చాలాసార్లు బాగా అంటుకుపోతూండేవారు.

ఏకాంతం ఏర్పాటు చేసుకోవాలని ఇద్దరు అనుకునేవారు.

అందుకు ఎన్నో ప్రయత్నాలు చేసి ప్రయోజనం లేకపోయింది. ఎందుకంటే ఇద్దరికీ రహస్యం కావాలి ఇద్దరూ భయస్థులు.

"మనం ఏకాంతం కోసం తపించి పోతున్నాం—చివరికి ఏకాంతం ఇలా వచ్చింది" అన్నాడు ప్రభాకరం.

స్వాతి మాట్లాడలేదు.

అతను చొరవచేస్తున్నాడు.

"మా నాన్నగారికి ఎలా వుందో ఏమో!"

"నువ్వు వెళ్ళి చేసేదేముంది? జరిగేదాన్ని ఆపగలవా?" అన్నాడు ప్రభాకరం.

స్వాతికి నిజమే ననిపించింది.

"ఇంత రాత్రిలో ఏం ప్రయాణమౌతావు? రేపటితో ఆఖరి పరీక్షకదా—అదయ్యాక వెళ్ళొచ్చు" అన్నాడు

ప్రభాకరం.

స్వాతికి అవుననిపించింది.

"ఇలాంటి అవకాశం మళ్ళీ మనకు రాదు" అన్నాడు ప్రభాకరం.

స్వాతి మాట్లాడలేదు.

5

నేను వెళ్ళేసరికి స్వాతి అంటున్నది "నేను వెళ్ళి చేసేదేముంది? జరిగేదాన్ని ఆపగలనా? అయినా ఇంతరాత్రివేళ ఒక్కర్తినీ ఏం ప్రయాణమవుతాను? ఇన్నాళ్ళూ ఆగి ఈ ఆఖరు పరీక్ష ఒక్కటీ మానేస్తే పడ్డ శ్రమంతా వృధా అవుతుంది. అదైనాకే వెళతాను. ఇలాంటి అవకాశం మనకు మళ్ళీ రాదు ..."

"నేనన్న మాటలే నువ్వూ అంటున్నావు...." అన్నాడు ప్రభాకరం.

"అవును. ఇప్పుడు నా కళ్ళకు నువ్వు తప్ప ఇంకెవరూ కనిపించడం లేదు. ఎవరేమైపోయినా సరే. నాకు నువ్వే కావాలి" అంది స్వాతి.

నేనిప్పుడేం చేయాలి?

ఎంతో శ్రమపడి స్వాతికోసం ఈ సమాచారం తీసుకుని వచ్చాను. ఉదయందాకా ఆగితే—తనకు ఆలస్యమైపోతుందని కంగారుపడ్డాను. తీరా చూస్తే స్వాతి ఆ టెలిగ్రాంకంటె తన ప్రియుడితో సమాగమానికే ప్రాధాన్యత నిస్తున్నది.

ఇప్పుడు నేనేం చేయాలి?

స్వాతి వేస్తున్న తప్పడడుగును ఆపాలా? అది తప్పటడుగేనని నిర్ధారించడమెలా?

తన తండ్రి ప్రాణాలు ప్రమాదంలో వున్నప్పుడుకూడా

ప్రభాకరం కావాలనుకున్నదామె. అంత బలమైన ప్రేమను నేను వారించనా!

మాలతి ఇంటికి దగ్గర్లో ఓ రిక్షావాడున్నాడు. వాడు మాకు బాగా తెలిసిన వాడు. నేను వాడింటికి వెళ్ళి వాణ్ని లేపి ఆ రిక్షాలో తిరుగు ప్రయాణమయ్యాను.

ప్రయాణంలో నా ఆలోచనలు పరిపరివిధాలా పోతున్నాయి.

ఒకడు చాలాసార్లు బజార్లో నన్ను చూసేవాడు. ఈ రాత్రి ప్రాణాలకు తెగించి నన్ను చెరచబోయాడు.

ఒకతె నన్ను వేశ్యగా మార్చాలనుకున్నది.

ఒక తాగుబోతు లెక్చరరు చేతికి చిక్కిన నన్ను తన ఆశయాలకోసం విడిచిపెట్టేశాడు.

తండ్రి ప్రాణాలు ప్రమాదంలో వున్నా స్వాతి ప్రియుడితో సమాగమానికి ప్రాధాన్యత నిచ్చింది.

అసలిదంతా ఏమిటి?

మనిషిలో ఇంత స్వార్థం వున్నదా? ఇటువంటి పాశవిక దృష్టి వున్నదా!

స్వాతి అటువంటిదని నేననుకోలేదు. దానికోసం నేను అనవసరంగా ఎంత శ్రమపడ్డాను?

* * *

నా ప్రశ్నలకు మర్నాడుదయమే జవాబు లభిస్తుందని నాకు తెలియదు.

స్వాతి ఉదయమే ఏడుస్తూ నావద్దకు వచ్చి తను ఇంక పరీక్ష రాయలేననీ తండ్రివద్దకు వెళ్ళిపోతున్నానని మాకు చెప్పింది.

నేను ఆశ్చర్యపడినప్పటికీ ఆమెనింకేమీ అడుగలేదు.

బజార్లో ఎప్పుడూ నన్ను చూస్తూండే కొందరు నాకు దూరందూరంగానే వున్నారు.

నడివీధిలో ఎక్కడ్నించి ఎక్కడకు వెళ్ళాలన్నా నాకు భయంగా లేదు.

లేదా ఏమిటంటే....

భగవంతుడీ సృష్టిలో రెండు విరుద్ధస్వభావాలు సృష్టించి రసవత్తరంగా తయారుచేశాడు. స్త్రీ పురుషుడు, ఆరోగ్యం-అనారోగ్యం, వెలుగు—చీకటి........

అలాగే నిన్నరాత్రి అనుభవాలకీ — ఈ రోజు పగలు మార్పుకీ లేదా........

అది రాత్రి ...ఇది పగలు..........

కనిపించని కట్టుడు పళ్ళు!

బ్యాంకు దోపిడి

కాశీభట్ల భానుమూర్తి

బస్సు దిగాడు విశ్వం. అటూ యిటూ చూసుకొంటూ నడిచి ఒక కిళ్ళీకొట్టు పక్కకి వచ్చి నిలుచున్నాడు.

నెమ్మదిగా జేబులోంచి పర్సు తీసి దానికున్న జిప్ లాగి చూశాడు. పది రూపాయల నోట్లు. ఐదురూపాయల నోట్లు దొంతరగా కనిపించింది.

అవన్నీ బయటికి తీసి లెక్కపెట్టాడు. మూడువందల నలభై రూపాయలు లెక్క తేలింది. మిగిలిన చిల్లర అంతా

కలిపి మరొక రెండు రూపాయ లుంటుంది.

ఆనందంతో సన్నగా విజిల్ వేశాడు విశ్వం. "చాలు. మళ్ళీ వారందాకా దొంగతనాల జోలికి పోనక్కరలేదు. దెబ్బకి దరిద్రం తీరింది" అనుకొన్నాడు.

పర్సుని పక్కనే వున్న తూములోకి విసిరేసాడు. డబ్బుని మరొక్కసారి లెక్కపెట్టుకొని జేబులో పెట్టుకో బోతుంటే విశ్వం చేతిని ఎవరో బలంగా పట్టుకొన్నారు.

కంగారుగా తలెత్తి చూపిన విశ్వంకి ఎదురుగా నవ్వుతూ నిలుచున్న రాజు కనిపించాడు.

తేలికపడిన మనస్సుతో రాజుచేతిని విడిపించుకొని, డబ్బుని భద్రంగా జేబులో పెట్టుకొన్నాడు.

"ఏం బ్రదర్! ఎంత గిట్టుబాటు యివాల" అని ప్రశ్నించాడు రాజు, విశ్వంను.

"మూడు వందలు గురుగారూ, మరి మీకెంత?" అని ఎదురు ప్రశ్నించాడు విశ్వం.

"అబ్బె, ఇవాల యింకా బోణీకాలేదు. కాని అదృష్ట మంటే అలా వుండాలి. ఈ వృత్తిలో నాకన్నా వెనుక ప్రవేశించి అప్పుడే నన్ను మించిపోయావు" అని ప్రశంసించాడు రాజు.

"అంతా మీ దయ గురుగారూ! ఆనాడు దిక్కూ మొక్కూ లేక ఆకలికి అలమటిస్తుంటే మీరేగనక నన్ను ఆదుకొని, నా బ్రతుక్కీ ఈ దారి చూపించకపోయినట్టయితే, ఈ పాటికి నేను అడుక్కు తింటూవుండేవాడిని" అన్నాడు విశ్వం కృతజ్ఞతగా.

అది నిజమే. దిక్కు మొక్కులేక, ఏ పని చేయాలో తెలీక అలమటించే విశ్వానికి రాజే దిక్కయి, తాను ఎంతో కాలం నుంచి చేస్తున్న చోరవృత్తిలో మెలకువలన్నీ

నేర్పాడు. జేబుల్లో డబ్బు ఎంత నేర్పుగా కొట్టేయాలో, దాన్ని దొరికించుకున్న వెంటనే ఎలా అక్కడనుంచి చెక్కెయాలో, దొరికిపోతే ఎలా ప్రవర్తించాలో, అన్ని థీయరీగా కాకుండా ప్రాక్టికల్‌గా చెప్పాడు. చేసి చూపించాడు.

రాజు శిక్షణలో విశ్వం మంచి జేబుదొంగగా తయారయ్యాడు. రాజిచ్చిన శిక్షణవల్ల నయితేనేమి, విశ్వం అదృష్టంవల్ల అయితేనేమి, యిప్పటివరకు పట్టుపడలేదు యెవరికీ. అందుకే రాజుని దేవుడికన్నా ఎక్కువగా పూజిస్తుంటాడు విశ్వం.

"నేను చేసిందేముంది, నీలో చురుకుతనం ఎక్కువ. ఇలా చెబితే అలా అల్లుకుపోతావు. అందుకే నీవు గురువును మించిన శిష్యుడివి అయ్యావు. సరే ఇదెప్పుడూ వుండేదే. రా అలా కాఫీ తాగి వద్దాం" అని ఆహ్వానించాడు రాజు.

ఇద్దరూ ఆ పక్కనే వున్న హోటలులో ప్రవేశించారు. ఒక మూల టేబిల్ చూసుకొని కూర్చొన్నారు. సర్వరుకి ఆర్డరిచ్చాక రాజు గొంతు సవరించుకొని యిలా చెప్పసాగాడు.

"చూడు విశ్వం. మనం చేస్తున్న ఈ దొంగతనాలు, అదే జేబుదొంగతనాలు వలన మనకి పెద్దగా లాభంలేదు. పైగా దొరికిపోతే తన్నులు తప్పవు. పోలీసు మామూళ్ళు అవీ పోను మనకు పట్టుమని నెలకి నాలుగువందలు కూడా మిగలటంలేదు. పోనీ మరేదైనా వృత్తిగాని, వ్యాపారంగాని చేద్దామా అని అంటే మనకి ఈ చోరీ వృత్తి తప్ప మరేంరాదు. అందుకని నేను చెప్పేదేమంటే—" అని ఆగాడు.

ఏమి చెబుతాడో అని విశ్వం ఆతృతగా రాజు మొహం వంక చూడసాగాడు.

అటూ ఇటూ చూసి గొంతు తగ్గించి, "అది బ్యాంకు దోపిడి....ఈ చిల్లర దొంగతనాలవల్ల డబ్బులు రాలక పోయినా దెబ్బలు తప్పటంలేదు. అందుకే మనం జాగ్ర త్తగా ప్లాను వేసుకొని ఏ బ్యాంకునైనా కొల్లగొడితే కొన్ని లక్షలు రాలతాయి. ఆ డబ్బు తీసుకొని ఏ బెంగుళూరో, బొంబాయో వెళ్ళిపోతే ఒక సంవత్సరానికి యిక్కడ అన్నీ సర్దుకొంటాయి. ఆ తరువాత మనం యిష్టం వచ్చిన చోట స్థిరపడి, ఆ డబ్బుని ఏ వడ్డీలకన్నా తిప్పుకొంటే మనకి కాలుమీద కాలు వేసుకొన్నా వెళ్ళిపోతుంది" అన్నారు రాజు.

"మీరు చెప్పింది బాగానే వుంది. ఏనుగు కుంభస్థలాన్ని కొట్టే పద్ధతిని నేనూ అంగీకరిస్తాను. కాని ఏ బ్యాంకు దోపిడీ కేసూ సక్సెస్ అయినట్టు నేను చదవలేదు. ప్రతి బ్యాంకు దోపిడీ చేసినవాణ్ణి ఆఖరికి ఏ డిటెక్టివ్‌వో పట్టు కొన్నట్టు. నేను ఎన్నో డిటెక్టివ్ పుస్తకాల్లో చదివాను" అన్నాడు విశ్వం.

"మనం జాగ్రత్తగా ప్లాను వేసుకొని, పళ్ళు దగ్గర పెట్టుకొని బ్యాంకుని కొల్లగొడితే ఏ డిటెక్టివ్ ఏమీ చేయ లేడు. నువ్వు పేపర్లో చూస్తున్నావుగా. బ్యాంకు దోపిడీ జరిగింది. ఇంత సొమ్ము పోయింది అనే వేస్తారుగాని, దొంగలు దొరికినట్టు వేయరు. అంటే ఆ దొంగతనాలన్నీ సక్సెస్ అయినట్టే కదా. కనుక బ్యాంకు దోపిడీ చేయటమే మన దరిద్రం తీరటానికి మార్గం.

నాకింకా శిష్యులున్నా నిన్నే ఎందుకు ఎన్నుకొన్నా నంటే నీలో చురుకుతనం వుంది. అదే నాక్కావలసింది" అన్నాడు రాజు.

"అయితే ఎప్పుడు చేద్దామంటారు" అన్నాడు విశ్వం

ఆత్రుతగా.

"ఎప్పుడో యెందుకు. ఇది అసలే రాకెట్ యుగం. మనం చేసే పని యెంత తొందరగా ముగిస్తే అంత మంచిది. కనుక రేపే అమావాస్య. రాత్రి ఒకటి దాటిం తరువాత చేద్దాం ఆ దొంగతనం. ఈ లోపల మనకి కావలసిన సరంజామా అంతా నేను సేకరించి రెడీ చేస్తాను." అని చుట్టూ చూసాడు. "ఏడి ఆర్డరు పట్టుకొని వెళ్ళి గంటయ్యింది. సర్వరు ఏడి" అన్నాడు రాజు.

కాసేపటికి సర్వరు వాళ్ళిచ్చిన ఆర్డరు ప్రకారం టిఫిను తెచ్చి అక్కడ పెట్టాడు. ఆలస్యానికి విసుక్కుంటూ టిఫిను తినటం ముగించి, కాఫీ త్రాగి బయటకి నడిచారు బిల్లు చెల్లించి.

2

మర్నాడు రాత్రి పదకొండు అయ్యేసరికి విశ్వం, రాజు వాళ్ళింటికి వచ్చాడు.

ఇద్దరూ కలసి రాజు తెచ్చిన సామాన్లు తనిఖీ చేసుకొన్నారు. ఒక పెద్ద బేగ్. అందులో చిన్న రంపం, సుత్తి, వివిధ రకాల తాళాల చెవులు, యింకా దొంగతనానికి అవసరమయిన వస్తువులు చాలా వున్నాయి.

ఇన్నాళ్ళూ వాళ్ళు చేసేది జేబుదొంగతనాలు కాబట్టి, వీటి అవసరం రాలేదు. కాని తప్పనిసరిగా ఇప్పుడు వీటిని సేకరించవలసి వచ్చింది.

అన్నీ లెక్క చూసుకొన్నాక టైము చూసుకొన్నాడు రాజు. పన్నెండు దాటి పది నిముషాలయింది. ఛీ ఎంతకీ టైము గడవదు అని విసుక్కొని, డ్రాయరు సొరుగులోంచి జూలై 'అపరాధ పరిశోధన' తీశాడు. అది పొద్దునే రామూ రెంట్ బుక్ స్టాల్లో కొన్నాడు. కాని ఈ దోపిడీ వస్తువులు

సేకరించే హడావుడిలోపడి అపన చదవటం కుదరలేదు. ముందు సప్లిమెంటు తీసిన వసుంధర రాసిన 'వేలిముద్రల మహిమ' చదివాడు.

"దీని తస్సాదియ్యా! విశ్వం. ఈ కథ చూడు వేలిముద్రల ద్వారా స్వామి చనిపోలేదని ఎంత బాగా రాసుందో. దీనినిబట్టి మనం కూడా వేలిముద్రలతో జాగ్రత్తగా వుండాలి" అన్నాడు రాజు.

విశ్వం టైము చూసి, "గురుగారూ టైము అయింది. మనం బయలుదేరుదామా" అన్నాడు.

"ఓ నడు నడు" అన్నాడు రాజు.

"ఇద్దరూ సామాన్లు మళ్ళీ బేగ్‌లో సర్దేసి, భుజాలకి తగిలించుకొని, ఇంటికి తాళం వేసి దేముణ్ణి తలుచుకొని బయలుదేరారు.

చుట్టూ చీకటి. అమావాస్య కనుక ఆ చీకటి మరీ చిక్కగా భయం గొలిపేలా వుంది.

ఇద్దరూ బ్యాంకి వెనక్కి చేరుకున్నారు. ఇద్దరి గుండెలు బిక్కు బిక్కుమంటున్నాయి. ఇద్దరికీ ఈ అనుభవము కొత్తే. జనం రద్దీగా వుండే బస్సుల్లోంచి డబ్బు కొట్టేసి పరిగెత్తటం అలవాటేగాని ఇలా చిక్కని చీకట్లో బ్యాంకుల వెనక గడిపే పరిస్థితి యిప్పటిదాకా ఎదు రవ్వలేదు.

బ్యాంకు వెనక కాంపౌండ్ వాల్ ఎత్తుగా వుంది. ముందు గూర్ఖాలేడు. టీ కెళ్ళాడేమో. అటూ ఇటూ చూసి రాజు గబగబా పైకి ఎగబ్రాకి అంచు అందుకొన్నాడు. నెమ్మదిగా పైకిలేచి శరీరాన్ని గోడమీదకి చేరవేసి, చేతితో విశ్వాన్ని కూడా చేదుకున్నాడు.

ఇద్దరూ గోడమీద కూర్చొని చుట్టూ చూసారు. ఎవరూ లేరు. గబుక్కున్న గోడ దూకారు ఒకేసారి. చీకటి వలన

ఎదుట ఏమి వుందో కనబడటంలేదు.

ఎక్కడి నుంచి లోపలికి ప్రవేశించాలా — అని ఆలోచిస్తూ బ్యాంకు ముందు భాగానికి వచ్చారు.

ఇంతలో సైరను ఊదుకొంటూ పోలీసు జీపు వచ్చి గేటుముందు ఆగింది. ఆగీ ఆగటంతోనే గేటు తీసుకొని పోలీసులు బిలబిలా లోపలికి వచ్చేసారు.

"ఇదెక్కడి ఖర్మరా బాబూ" అని ఇద్దరూ తప్పించుకొందామని అటూ ఇటూ చూసేసరికే పోలీసులు ఆ ఇద్దర్నీ మూసేసారు.

ఇన్‌స్పెక్టర్ అవసరం లేకపోయినా, గాలిలో రివాల్వర్ రెండుసార్లు పేల్చి "యువార్ అండెర్ అరెస్ట్" అని అరచి.

"ఓహో, ఇద్దరు వున్నారు గదా. ఊ ఎలా ఉంది మన తడఖా కానిస్టేబుల్స్ సెర్చి ది బ్యాంక్" అని ఆర్డరు వేసాడు.

కానిస్టేబుల్సు బ్యాంకు చుట్టూ పరిగెత్తసాగారు. ఇంతలో ఇన్‌స్పెక్టర్ కాల్చిన రివాల్వర్ శబ్దానికి చుట్టుపక్కల జనం హడావుడిగా పరిగెత్తుకొని వచ్చారు.

నిద్రకళ్ళతో వచ్చారేమో వాళ్ళకి ఈ ఇన్‌స్పెక్టర్‌ని, పోలీసుల్ని చూస్తుంటే బ్యాంకు దోపిడీ చేయటానికి వచ్చారేమో అనిపించింది.

"ఏమి జరిగింది" అని ప్రశ్నించారు ముక్తకంఠంతో జనం.

"ఏమి జరిగిందా, ఇంకా జరగలేదు. జరగబోయేది బ్యాంకు దోపిడి, కాని నేను సమయానికి వచ్చి" అని యింకా ఏదో చెప్పబోతున్న ఇన్‌స్పెక్టర్ శశికాంత్ మాటలు ఎవరూ వినటంలేదు. అందరూ రాజు, విశ్వంలని

హీరోలని చూసినట్టు చూస్తున్నారు.

అది గమనించిన ఇన్‌స్పెక్టర్ శశికాంత్ బాధగా మొహం చిట్లించి ఇద్దరు కానిస్టేబుల్సుని పిలిచి, విశ్వం, రాజులని కట్టిపడేయమన్నాడు.

ఇద్దరికీ చెమట్లు పట్టేశాయి. అసలే ఇది కొత్త పని. అందులోను ఇంకా పూర్తిగా చేయకుండానే ఈ అవాంతరం వచ్చింది. అసలు తాము దోపిడీ చేయబోతున్నట్టు ఈ ఇన్‌స్పెక్టర్ బృందానికి ఎలా తెలిసిందా అని మిడిగుడ్లేసుకొని ఇన్‌స్పెక్టర్ శశికాంత్‌వైపు చూడసాగారు విశ్వం, రాజులు.

అది గమనించి "ఏం? దొరికిపోయారని బాధగా వుందా, లేక ఎలా తెలిసిందా అని భయంగా వుందా!

మీరు బ్యాంకు దోపిడీ చేద్దామని మాట్లాడుకొన్నది ఒక హోటలులో. ఆ హోటలు సర్వరు 'అపరాధ పరిశోధన' చదువుతాడు. అందుకే మీ మాటలు విని ఈ రోజు సాయంత్రం నాకు ఫోనుచేసి చెప్పాడు. కాని నేను ఇది ఆటగా తీసేసి పట్టించుకోలేదు. కాని ఇందాక ఎవరో ఫోను చేసి మళ్ళీ చెప్పారు.

నాకు అనుమానంవేసి, వెంటనే పోలీసుల్ని తీసుకొని బయలుదేరాను. నా అదృష్టంకొద్దీ మీరు స్పాటులో దొరికారు" అన్నాడు గర్వంగా ఇన్‌స్పెక్టర్ శశికాంత్.

"నీ అదృష్టం మండినట్టే వుంది. మా ప్రాణానికి వచ్చింది" అని వణకసాగారు విశ్వం, రాజులు.

"హాయిగా జేబు దొంగతనాలు చేసుకొనే నన్ను ఇలా కష్టపెట్టింది నువ్వే" అన్నట్టుగా రాజుని చూసాడు విశ్వం.

విశ్వం చూపులకి జవాబులు చెప్పలేక తల దించుకొన్నాడు రాజు.

"ఏం తల దించుకొంటున్నారా, ఏం దొంగతనానికి వచ్చినప్పుడేమయింది ఆ బుద్ధి" అన్నాడు శశికాంత్ ఉరిమి చూస్తూ.

ఇంతలో బ్యాంకుని చుట్టి వచ్చిన పోలీసులు "అనుమానించ దగింది ఏదీ లేదని" చెప్పారు యిన్‌స్పెక్టర్‌తో.

ఈ గొడవకి ఆ సందు చివర వుంటున్న బ్యాంకు ఏజంటుగారు పరుగు పరుగున వచ్చారు. జరిగింది విని గుండెలు బాదుకొంటూ కూలబడ్డారు బ్యాంకు ఏజంటు పురుషోత్తంగారు.

"ఏమి జరగలేదని" ఆయనకి నచ్చజెప్పి తాళాలు తీయమన్నాడు యిన్‌స్పెక్టర్.

వెంటనే తాళాలు తిసారు. లైట్లు వెలిగాయి.

మొత్తంమీద లెక్కలన్నీ వేసాక రెండు లక్షల క్యాష్ మాయం అయిందని తెలిసింది. బ్యాంకు ఏజంటు పురుషోత్తంగారు గుండెలు బాదుకొంటూ మళ్ళీ కూలబడ్డారు.

ఇంక ఆయన్ని లేవదీయటంవల్ల కాక, వాకిట్లో కట్టి పడేసిన రాజు, విశ్వంలని లాక్కురమ్మని ఆజ్ఞచేసాడు యిన్‌స్పెక్టర్ శశికాంత్.

ఈలోపల బ్యాంకు అంతా పరిశీలించాడు. ఒక కన్నంగాని. విరిగిన తలుపుగాని కనిపించలేదు. భృకుటి ముడి పడింది యిన్‌స్పెక్టర్ శశికాంత్‌కి.

విశ్వం, రాజుల్ని తెచ్చి యిన్‌స్పెక్టర్ కాళ్ళముందు పడేశారు పోలీసులు. వాళ్ళని సోదా చేస్తే రెండు లక్షలు కాదుకదా రెండు రూపాయలు కూడా దొరకలేదు. ఆ చుట్టు పక్కల అంతా వెతికించాడు. కాని ఏమీ దొరకలేదు.

ఇద్దరు కానిస్టేబుల్స్‌ని బ్యాంకు దగ్గర వుండమని, బ్యాంకు ఏజంటు పురుషోత్తంగారికి ధైర్యం చెప్పి, విశ్వం రాజుల్ని తీసుకొని పోలీసు స్టేషన్‌కి బయలుదేరాడు యిన్‌స్పెక్టర్ శశికాంత్.

పోలీసు స్టేషన్లో పోలీసు మర్యాద చవిచూసాక కూడా నిజం చెప్పకపోవటంతో యిన్‌స్పెక్టర్ శశికాంత్‌కి వళ్ళు మండిపోయింది.

వాళ్ళు మొదటినుంచి తామేసుకొన్న ప్లాను చెప్పారు. కాని ఈ డబ్బు సంగతి మాకేం తెలియదు. మేమింకా లోపలికే వెళ్ళలేదు. మమ్మల్ని కాపాడండి, అని యిన్‌స్పెక్టర్ శశికాంత్ కాళ్ళు పట్టుకొన్నారు.

వాళ్ళిద్దర్నీ లోపల పడేయమని విచారంగా తల పట్టుకొని కూర్చున్నాడు యిన్‌స్పెక్టర్ శశికాంత్.

ఇంతలో ఎస్సై గోపాల్ వచ్చాడు. "సార్ మీరు చెప్పినట్టు ఎంక్వయిరీ చేసాను. ఫలితం లేదు" అన్నాడు గోపాల్.

అప్పుడు గుర్తుకు వచ్చింది. "ఫోను వచ్చాక ఆ ఫోనును ట్రేసుచేసి మనిషిని పట్టి ఆ మనిషికి ఈ రోజే యిప్పుడే బ్యాంకు దోపిడీ జరుగుతుందని ఎలా తెలుసో" విచారించమని గోపాల్ని పంపాడు.

ఇప్పుడు అ ఆశ కూడాలేదు. పోనీ ఆ సర్వరుని అడుగుదామంటే 'యింతకన్నా ఏమీ తెలీయదని' ముందే చెప్పేసాడు. అవి యెలా తెలిసాయో కూడా చెప్పాడు. వాళ్ళు ఆర్డరు యిచ్చినవి తీసుకొని వచ్చినప్పుడు విన్నాడట. వాళ్ళ గొడవలో వాళ్ళుండి పట్టించుకోలేదట. అన్నీ విని, మళ్ళీ లోపలికి వెళ్ళి అనుమానం కలక్కుండా పావుగంట

ఆగి వచ్చాడట.

మొత్తం బ్యాంకు దగ్గర జరిగింది జరిగినట్టు చెప్పాడు గోపాల్‌కు ఇన్స్‌పెక్టర్ శశికాంత్.

"సార్, మీరు చెప్పేది వింటుంటే, ఇది బయటివాళ్ళు చేసినట్టు లేదు. లోపలే ఎవరో చేసినట్లు వుంది" అన్నాడు ఎస్సై గోపాల్.

"అవును. నాకు అదే అనుమానంగా వుంది. పట్టుబడిన వాళ్ళ దగ్గర క్యాష్‌లేదు. పోనీ ఎవరికైనా యిచ్చారను కొంటే అసలు లోపలికి వెళ్ళినట్టు ఎక్కడా కన్పంగాని, మరేదిగానిలేదు" అన్నాడు ఇన్‌స్పెక్టర్ శశికాంత్.

"అవును సార్, బహుశా, ఆ ఏజంటే ఏమన్నా తీసాడంటారా" అన్నాడు ఎస్సై గోపాల్.

"ఛ. ఛ. ఆ ఏజంటు అలాంటివాడిలా లేడు. పైగా డబ్బు పోయినందుకు, తన సొమ్ములాగా పడీ పడీ ఏడుస్తున్నాడు" అన్నాడు శశికాంత్.

"మరి ఎవరి చేసినట్టు" అని సాలోచనగా ప్రశ్నించాడు ఎస్సై గోపాల్.

"అదే ఆలోచిస్తున్నా" అని ఫోను తీసి బ్యాంకుకి ఫోను చేసాడు ఇన్‌స్పెక్టర్ శశికాంత్.

బ్యాంకు ఏజంటు పురుషోత్తం ఎత్తాడు అవతల.

కాసేపు మాట్లాడి పెట్టేసి, కొంతమంది కానిస్టేబుల్స్‌ని, ఎస్సై గోపాల్‌ని తీసుకొని బ్యాంకు కాషియర్ యింటికి బయలుదేరాడు ఇన్‌స్పెక్టర్ శశికాంత్.

వాకిట్లో పోలీసు జీపు ఆగిన శబ్దానికి భయపడి క్యాషియర్ సాంబశివరావు ఒక్క దూకులో పిట్టగోడ దూకి రోడ్డుమీద పరుగులు తీయసాగాడు.

విజిల్సు వేసుకొంటూ పోలీసులు వెనక తరమసాగారు.

ఆఖరికి యెలా అయితేనేం బ్యాంక్ క్యాషియర్ సాంబ శివరావుని పట్టేశారు.

సాంబశివరావు ఇల్లంతా సోదాచేయగా రెండు లక్షల బ్యాంకు క్యాష్ నిక్షేపంగా కనబడింది. ఈ హడావుడికి యిక్కడ కూడా జనం మూగారు. సాంబశివరావుని జీపు ఎక్కించారు పోలీసులు.

హుందాగా వారిని అనుసరించాడు ఇన్‌స్పెక్టర్ శశి కాంత్.

సాంబశివరావుని స్టేషన్‌కి తీసుకొచ్చేశారు. లాకప్‌లో పడేసి నాలుగు ఉతికాక, తానే దొంగతనం చేసినట్టు చెప్పే శాడు సాంబశివరావు.

"అలా క్లుప్తంగా చిన్న కథలా చెబితే కాదు. పెద్ద నవలలా వివరంగా చెప్పు" అన్నాడు ఎస్సై గోపాల్.

సాంబశివరావు మొదలు పెట్టబోతుంటే ఇన్‌స్పెక్టర్ శశికాంత్ అతన్ని ఆగమని చెప్పి, గొంతు సవరించు కొని—

"చూడు మిష్టర్ గోపాల్. నేను చెబుతాను, జరిగింది. ఈ క్యాషియర్ సాంబశివరావుకి మొదటి నుంచి పేకాట పిచ్చి వుంది. చాలా డబ్బు తగలేశాడు. అదీగాక తొంద రలో వాళ్ళ చెల్లెలు పెళ్ళికూడా చేయాలని వాళ్ళ అమ్మగారి తాపత్రయం. అందుకు డబ్బు లేదు.

బ్యాంకులో అందర్నీ అడిగాడు డబ్బు సర్దమని. కాని ఎవ్వరూ ఈ పేకాట పిచ్చాడికి డబ్బు యివ్వటానికి సాహ సించలేదు. తెగించి ఏజంటు పురుషోత్తంగారినే అడిగాడు. కాని ఈ సాంబశివరావు విషయం తెలిసినవాడవటం మూలంగా లేదు పొమ్మన్నాడు పురుషోత్తంగారు. ఇవన్నీ

యిందాక ఫోన్లో పురుషోత్తంగారిని అడిగి తెలుసు కొన్నాను.

"మీ దగ్గర డబ్బు యిబ్బందుల్లో వున్న స్టాఫ్ ఎవ రైనా వున్నారా అంటే—ఈ సాంబశివరావు పేరు చెప్పారు ఆయన. అందుకే సాంబశివరా వింటికి వెళితే మనకి బ్యాంకు క్యాష్ చిక్కింది" అని ఆగి "ఆ చూడు మిష్టర్ సాంబశివరావు అసలు ఈ రోజునే వీళ్ళు వస్తారని, ఈ రోజునే దొంగతనం చేద్దామని ఎలా అనుకొన్నావు" అని అడిగాడు ఇన్స్పెక్టర్ శశికాంత్.

సాంబశివరావు చెప్పింది విని మతిపోయింది మొత్తం అక్కడ విన్న పోలీసులకి.

రాజు, విశ్వం బ్యాంకు దోపిడీ గూర్చి ప్లాన్ వేసుకొనే టప్పుడు ఆ హోటల్లో వాళ్ళ వెనక సీటులోనే ఈ సాంబ శివరావు కూర్చున్నాడట. వాళ్ళు తానుండే బ్యాంకే కొల్ల గొడదామని మాట్లాడుకొంటుంటే ఆనందంతో తబ్బిబ్బ య్యాడట.

మర్నాడు బ్యాంకు మూసే సమయానికి రెండు లక్షలూ తన చేతిసంచీలో పెట్టుకొని, 'ఎలాగూ దొంగలు వస్తారు. అందులో ఇదీ కలిసిపోతుంది' అని అనుకొన్నాడట.

"చూశారా, మీరేసిన ఆ బ్యాంకు దోపిడీ ప్లాను చెవిటి వాళ్ళకి తప్ప, ఈ ఊరంతా వినిపించి, ఆశలేని వాళ్ళకి ఆశ కల్పించింది. మీ విషయం తరువాత చూస్తా"నని, రాబోయే ప్రమోషన్ మీద కలలు కనసాగాడు ఇన్స్పెక్టర్ శశికాంత్.

బ్యాంకు దోపిడీ విఫలమయి, మళ్ళీ జేబులు కొట్టు కొంటూ బతికేరోజు ఎప్పుడు వస్తుందా అని రోజులు లెక్కపెట్టసాగారు రాజు, విశ్వంలు. □

దుబాయ్ వ్యాపారులు

ప్రతాప రవిశంకర్

చలిగా వుంది. తెరచివున్న కిటికీల్లోనించి చల్లదనాన్ని నింపుకున్న గాలి విసురుగా కొడుతోన్నది.

పేము కుర్చీలో కూర్చున్న రాజు చేతిలో వున్న సిగరెట్టును యాష్‌ట్రేలో నొక్కి వాచీకేసి చూసుకున్నాడు. పదకొండు గంటలు కావస్తోంది.

అతను లేచి నిల్చున్నాడు. లుంగీ విప్పి ప్యాంటు-షర్టు

వేసుకున్నాడు. సూట్కేసు అడుగున వున్న రివాల్వర్‌ని తీసి ప్యాంటుజేబులో వేసుకున్నాడు. పదునైన కత్తిని మరో జేబులో వుంచి గది మధ్య నిల్చుని ఒక్కక్షణం ఏదో ఆలోచించాడు.

బూట్లు తొడుక్కుని గది బయటకు వచ్చి తాళం వేసి రోడ్డుమీదకు వచ్చాడు.

నిర్మానుష్యంగా వుంది రోడ్డు. వీధి దీపాలు బాగానే వెలుగుతున్నాయి. సన్నగా చినుకులు పడుతున్నాయి.

రోడ్డుపక్కనే నిల్చున్నాడు రాజు. అతను టాక్సీకోసం ఎదురుచూస్తున్నాడు. అక్కడినించి టాక్సీ స్టాండు దూరంలో వుంది. ఓ పది నిముషాలు అక్కడ ఎదురు చూసి టాక్సీ స్టాండుకు వెళదా మనుకున్నాడు.

కాని—పది నిముషాలు అవకముందే ఖాళీగా వున్న టాక్సీ అక్కడికి వచ్చింది. రాజు చెయ్యెత్తి దాన్ని ఆపి కూర్చున్న తర్వాత ఎడ్రసు చెప్పాడు.

రద్దీలేని రోడ్డుమీద టాక్సీ రివ్వున దూసుకువెళుతోంది.

వెనుకసీట్లో వెనక్కువాలి ఆలోచిస్తున్నాడు రాజు. అతని ఆలోచనలన్నీ వజ్రాల గురించి—

మలుపులు తిరుగుతోంది టాక్సీ. డ్రయివర్ సూటిగా రోడ్డుమీదకే చూస్తున్నాడు.

రాజు సిగరెట్టు వెలిగించాడు. టాక్సీ దాటిపోతున్న పరిసరాలను గమనిస్తున్నాడు.

పది నిమిషాలు గడిచాయి.

టాక్సీ ఆగిపోయింది.

రాజు కిందికి దిగాడు. ఫేర్‌మీద ఐదు రూపాయలు ఎక్కువ ఇచ్చాడు డ్రయివర్‌కి.

టాక్సీ వెళ్ళేవరకు అతను అక్కడే నిల్చుని తర్వాత ఓ

వీధిలోకి నడిచాడు. ఆ వీధిలో రోడ్డుకు రెండువైపులా ఎత్తయిన భవనాలు వున్నాయి. ఆ భవనాల్లో ధనవంతులు వుంటున్నారు.

రాజు ఓ భవనం ముందు ఆగిపోయాడు. గేటు వేసి వున్నది. పై అంతస్తులో ఓ గదిలోనించి సన్నని దీపం వెలుతురు బయటకు పడుతోంది.

తోటలో లైటు వెలుగుతోంది. దానిచుట్టూ పురుగులు తిరుగుతున్నాయి.

రెండు నిమిషాలు అక్కడే నిల్చుని తర్వాత అంత ఎత్తుగా లేని గోడదగ్గరగా నడిచాడు.

అతను చటుక్కున ఎగిరి గోడమీద నించి లోపలకు దూకాడు. క్రోటన్ మొక్కల మధ్యనించి నడిచి భవనం వెనుకవైపుకు చేరుకున్నాడు.

కిందినించి నీటి గొట్టం పైకి వెళతోన్నది. అతను క్షణంకూడా ఆలస్యం చెయ్యలేదు. నీటిగొట్టాన్ని పట్టుకుని ఐదు నిముషాల్లో పైకి చేరుకున్నాడు.

ఎదురుగా వున్న గది కిటికీ తెరచేవుంది. దానికి ఇనుప వూచలు లేవు. అద్దాల తలుపులు వున్నాయి.

క్షణం తర్వాత రాజు ఆ గదిలోకి దూకాడు. ఎంత చిన్నగా దూకినా దబ్ మన్న చప్పు డయ్యింది.

ఆ గదిలో రెండు బల్లలు—నాలుగు కుర్చీలు ఉన్నాయి. ఒక్కసారి గదినంతటినీ చూసి ఆ గదిలోనించి మరో గది లోకి నడిచాడు. ఆ గదికూడా చీకటిగానే వుంది. అది బెడ్ రూం అయివుండాలి. కాని దాన్ని ఉపయోగించక పోవటంవల్ల దుమ్ము కొట్టుకుని వుంది.

పక్కనే వున్న గదిలోనించి సన్నని దీపం వెలుతురు కనిపిస్తోంది.

రాజు ఆ గది తలుపులను చిన్నగా నెట్టాడు. చప్పుడు చెయ్యకుండా తెరుచుకున్నాయి తలుపులు.

బెడ్ లైటు వెలుగుతోంది. ఎదురుగా బెడ్ మీద ఓ అందమైన యువతి నిద్రపోతోంది. పైన తిరుగుతున్న ఫ్యాను గాలికి ఆమె తల వెంట్రుకలు చిన్నగా ఎగురుతున్నాయి.

ఆ యువతి అందం రాజును కలవరపరచింది. అతను క్షణంసేపు అక్కడే నిల్చుని తర్వాత రెండడుగులు ముందుకు వేశాడు.

అంతే.

ఎవరో వున్నట్టుండి అతని వీపుకు రివాల్వర్ను నొక్కి వుంచి "మర్యాదగా చేతులెత్తు" అన్నాడు.

2

రాజు వెనక్కి తిరిగే ప్రయత్నం చేశాడు.

"వెనక్కి తిరిగితే ప్రమాదం. రివాల్వర్ పేలుతుంది. నాకు దయాదాక్షిణ్యాలు లేవు" అన్నాడతను.

చేతులెత్తాడు రాజు.

"రాణీ" అని పిల్చాడతను.

అప్పటివరకు నిద్రపోతున్నట్టు నటిస్తున్న ఆ యువతి బెడ్ మీద లేచి కూర్చుని చిన్నగా నవ్వింది రాజుని చూసి.

తర్వాత ఓ నైలాన్ తాడును తీసుకువచ్చింది.

ఇద్దరూ కలిసి రాజు చేతులను వెనక్కి విరిచి కట్టేశారు. తర్వాత అతను వెళ్ళి ఓ కుర్చీలో కూర్చున్నాడు.

రాణి నిల్చునే వుంది.

"ఎవర్నువ్?" అడిగాడతను. అతనికి యాభై యేళ్ళు వుంటాయి. లావుగా—పొడుగ్గా వున్నాడు. పెద్దపెద్ద కళ్ళు. దట్టమైన కనుబొమలు—మొద్దు పెదవులు. అతని చూపులు తీక్షణంగా వున్నాయి.

"నేనెవర్నయినా నీ పేరు శివన్ కదూ" అన్నాడు రాజు అతన్నే చూస్తూ.

"అవును. నా పేరు శివన్"

"అయితే నేను పొరపాటు పడలేదు. రావలసిన ఇంటికే వచ్చాను" అన్నాడు రాజు.

"రావలసిన ఇంటికా. ఈ ఇంటితో నీకు పనేమిటి?" అడిగాడు శివన్.

"చెప్పను"

"చెప్పకపోతే నిన్ను కాల్చి చంపుతాను. చావదల్చు కుంటే నిజం చెప్పకు."

రాణి—రాజునే చూస్తోంది.

అతడి అందం ఆమెను ఆకర్షిస్తోంది. ఆమె వయసు పాతిక దాటి వుండదని అనుకున్నాడు రాజు. ఆ యువతి కళ్ళు నక్షత్రాల్లా మిలమిలా మెరుస్తున్నాయి.

"నేను లోపలకు వచ్చినట్టు నీకెలా తెలిసింది?" అడిగాడు రాజు.

శివన్ నవ్వి ఇలా అన్నాడు: "నాకు నిద్రపట్టలేదు. కిటికీ దగ్గర నిల్చుని సిగరెట్టు కాలుస్తున్నాను రోడ్డు మీదికి చూస్తూ. నువ్వు గోడదగ్గర నిల్చోటం—ఆ తర్వాత గోడ దూకటం చూశాను. అందుకే నిన్ను పట్టుకోటానికి సిద్ధంగా వున్నాను."

"ఇంతకీ నన్నేం చేస్తావ్? పోలీసులకు పట్టిస్తావా?" అడిగాడు రాజు.

"నిజం చెబితే పోలీసులకు పట్టిస్తాను. లేకపోతే కాల్చేస్తాను."

"ఆల్ రైట్ ... నిజమే చెబుతాను. నేను దొంగతనానికి వచ్చాను" అన్నాడు రాజు.

"గుడ్ .... ఈ ఇంట్లో నువ్వు ఏం తీసుకెళ్ళాలని వచ్చావ్? డబ్బా! బంగారమా?"

నవ్వాడు రాజు.

"ఎందుకు నవ్వుతావ్?" కోపంగా అడిగాడు శివన్.

"డబ్బు, బంగారంకోసం నేను దొంగతనానికి రాను. నేను వజ్రాల దొంగని. వజ్రాలు ఎక్కడ వుంటే అక్కడికి నేను వస్తాను."

ఉలిక్కిపడ్డాడు శివన్.

రాణి అతనికేసి చూసింది.

"అంటే ఇక్కడికి నువ్వు వజ్రంకోసమే వచ్చావా?"

"అవును."

"ఈ ఇంట్లో వజ్రాలు లేవు"

"అబద్ధం ఆడుతున్నావు శివన్....వజ్రం లేనిదే ఈ రాజు ఆ ఇంటి గోడ దూకడు....నీ దగ్గర వజ్రం వుంది. రెండునెల్ల క్రితం దుబాయ్‌నించి వచ్చిన ఇద్దరు వ్యాపారుల దగ్గర నువ్వు ఆ వజ్రాన్ని కొన్నావు....ఆ తర్వాత ఆ ఇద్దరినీ హత్య చేయించి వాళ్ళకి నువ్వు ఇచ్చిన బంగారాన్ని తిరిగి తీసుకున్నావు ...ఇదంతా నాకు తెలీ దనుకుంటున్నావా శివన్" అన్నాడు రాజు.

"మైగాడ్" ఐతే నీకు చాలా విషయాలు తెలుసన్న మాట. గుడ్....నువ్వు కొంతవరకు నిజమే చెప్పావుకాని. ఆ దుబాయ్ వ్యాపారస్థులను నేను హత్య చేయించలేదు. వాళ్ళను ఇంకెవరో హత్యచేశారు. ఇన్ని నిజాలను తెల్సుకున్న నిన్ను బతకనివ్వకూడదు. నిన్ను కాల్చి చంపుతాను" అన్నాడు శివన్.

"నన్ను చంపినందువల్ల నీకు ప్రయోజనం ఏమిటి? అనవసరంగా చిక్కుల్లో యిరుక్కుంటావ్? నన్ను వదిలి

పెట్టు ...నా దారిన నేను పోతాను. మళ్ళీ నీకు కనిపించను" అన్నాడు రాజు.

పెద్దగా నవ్వాడు శివన్....

"ప్రాణంకోసం భయపడుతున్నావా? ఇంత భయం వున్నవాడివి అసలు నువ్వు ఈ వృత్తిలోకి ఎందుకు దిగావ్? నీలాంటి పిరికి మనుషులు ఈ వృత్తికి పనికిరారు. నీమీద నాకు జాలిగా వుంది. ఐనా నిన్ను నేను వదిలి పెట్టను."

"ప్లీజ్....నన్నొదిలిపెట్టు శివన్. నాకు ప్రాణభిక్షపెట్టు" దీనంగా అన్నాడు రాజు. అతని కళ్ళలోకి సూటిగా చూసింది రాణి.

"ఏం డియర్....ఈ పిరికివాడ్ని వదిలెయ్యమంటావా?" అన్నాడు శివన్—రాణితో.

"వద్దు .... ఇలా వదిలేస్తే ఇతనివల్ల మీకు మళ్ళీ ప్రమాదం వుంది. అందువల్ల యితన్ని పోలీసులకు అప్ప గించండి....అంతా వాళ్ళే చూసుకుంటారు" అన్నది రాణి.

మళ్ళీ నవ్వాడు శివన్.

"వీల్లేదు. ఇతనివల్ల నాకు ఎప్పటికైనా ప్రమాదం వుంది. జైలునించి విడుదలయి వచ్చినా నన్ను వదిలి పెట్టడు. అందుకే నేను యితన్ని వదిలిపెట్టను. డియర్ రాజూ....నీకు చావు తప్పదు. నీ చివరి కోరిక ఏమిటో చెప్పు....తీరుస్తాను" అన్నాడు.

"చెబుతాను ...చావు తప్పనపుడు నేను చెయ్యగలిగింది యేదీ లేదు. ఆఖరి కోరికగా నువ్వు దుబాయ్ వ్యాపారుల నించి కొన్న ఆ వజ్రాన్ని చూడాలని వుంది. ఒకసారి చూపుతావా" అనడిగాడు రాజు.

"సారీ....రాజూ. నీ కోరిక అంత త్వరగా తీరేదికాదు

కొంచెం రిస్కుతో కూడుకున్న పని" అన్నాడు శివన్.

"అంటే?"

"ఆ వజ్రాన్ని బిల్డింగ్‌పైన వున్న వాటర్ టాంక్‌లో పడేశాను చిన్న పెట్టెలో వుంచి. టాంక్ నిండా నీళ్ళు వున్నాయి. ఆ నీళ్ళన్నింటినీ తోడెయ్యటం యిప్పుడు జరిగే పనికాదు. అందువల్ల నువ్వు చావుకు సిద్ధంగా వుండు అని రివాల్వర్ ట్రిగ్గర్‌మీద వేలు బిగించాడు శివన్.

అంతే.... ఢామ్మని రివాల్వర్ పేలింది. శివన్ చేతిలో వున్న రివాల్వర్ ఎగిరి దూరంగా పడింది.

రాణి చేతిలో వున్న రివాల్వర్ పొగ కక్కుతోంది.

3

"డియర్.... ఏమిటిదంతా?!" ఆశ్చర్యంగా అడిగాడు శివన్.

"ఇదంత నీ దగ్గర వున్న వజ్రంకోసమే శివన్.... ఆ వజ్రం కోసమే రెండునెల్ల క్రితం నీతో పరిచయం చేసుకుని, ఆ తర్వాత ప్రేమించినట్టు నటించి పెళ్ళి చేసుకున్నాను. ఇప్పటికి నువ్వు ఆ వజ్రాన్ని ఎక్కడ దాచిందీ చెప్పావు. వెరీగుడ్. అలాగే కదలకుండా నిలబడు" అంటూ వెనక్కు జరిగింది రాణి.

"మైగాడ్.... మోసం.... దగా...." అన్నాడు శివన్ కోపంగా—

రాణి టెలిఫోన్ దగ్గరకు నడిచి ఏదో నెంబర్‌కు డయల్ చేసి "అంతా సక్సెస్.... ఆ దుబాయ్ వ్యాపారుల వజ్రం రహస్యం తెలిసింది. వెంటనే రండి" అని ఫోన్ పెట్టేసింది.

"ఆడదానివైనా పదునైన కత్తిలాంటి దానివి డియర్" అన్నాడు రాజు నవ్వుతూ.

"పదునైన కత్తిలాంటిదాన్నే కాదు. మెషిన్‌గన్‌లాంటి దాన్ని కూడా. ఇప్పుడు మా బాస్ వచ్చి నిన్ను షూట్ చేసి చంపుతాడు. నీలాంటి మనుషులవల్ల మాలాంటి మనుషులకు ఎప్పుడూ పోటీ వుంటుంది" అన్నది రివాల్వర్‌ని గట్టిగా పట్టుకుంటూ.

పది నిముషాలు గడిచాయి.

ఉన్నట్టుండి తలుపులమీద చప్పుడయింది.

"ఇద్దరూ కదలకండి" అని రాణి గబగబా వెళ్ళి తలుపులను తెరిచింది.

వెంటనే ఆమె చేతిలో వున్న రివాల్వర్‌ని పోలీసు ఇన్‌స్పెక్టర్ లాక్కున్నాడు. ఎదురుగా వున్న పోలీసులనుచూసి రాణి ఆశ్చర్యపడింది.

శివన్ వెంటనే రాజు చేతికి వున్న కట్లు విప్పి "సారీ డియర్.... నువ్వు కథ యిలా ముగిస్తుందని అనుకోలేదనుకుంటాను" అన్నాడు.

"ఏమిటిదంత?" అన్నది రాణి భయంగా—

"ఏమీ లేదు. నిన్ను—మీ వజ్రాల దొంగల ముఠాని పట్టుకోవటానికి మేము ఆడిన నాటకం. రాజు ఓ గూఢచారి. మీరు షూట్ చేసిన ఆ దుబాయ్ వ్యాపారులు చనిపోయేముందు మీ వజ్రాల దొంగల ముఠాగురించి చెప్పి అందులో ఓ అందమైన యువతికూడా వుందని చెప్పారు. ఆ తర్వాత నీ అంతట నువ్వే మూన్‌లైటు క్లబ్బులో నాతో పరిచయం చేసుకున్నావు. ప్రేమించా నన్నావు. పెళ్ళి చేసుకోమన్నావు.

పెళ్ళయిన తర్వాత నీమీద నాకు అనుమానం వచ్చింది. నేను ఇంట్లో లేనప్పుడు ఇంట్లో వస్తువులన్నింటినీ ఎవరో సోదా చేస్తున్నట్టుగా గ్రహించాను. అప్పుడు నా అనుమా

నాన్ని బలపర్చుకుని పోలీసులతో అంతా చెప్పేశాను. రాజు నిన్న ఈ ముఠాను పట్టుకోటానికి ఈ ప్లాను చెప్పాడు. అనుకున్నట్టుగానే నువ్వు వజ్రం గురించి నేను చెప్పగానే బయటపడిపోయి నీ బాస్‌కు ఫోన్ చేశావు. ఆ ఫోన్ కాల్‌ను ట్రేస్ చేసి కొంతమంది పోలీసులు నీ బాస్ స్థావరానికి వెళ్ళి వుంటారు. ఇక్కడ నువ్వు దొరికిపోయావు. ఎలా వుంది మా ప్లాను దొంగలరాణీ" అన్నాడు శివన్.

ఇంతలోనే ఫోన్ మోగింది.

ఇన్‌స్పెక్టర్ మాట్లాడి "వజ్రాలదొంగల ముఠా అంతా పట్టుబడింది" అన్నాడు.

"ఓ పదునైన కత్తీ. నీ శేష జీవితాన్ని ఒరలాంటి జైల్లో గడుపు" అన్నాడు రాజు నవ్వుతూ ఆమె బుగ్గమీద చిటికె వేసి— □

రాంగ్ నంబర్

బి. రాజేశ్వరి

ఫోన్ గణగణ మోగింది.

డిటెక్టివ్ శేషు రిసీవర్ అందుకుని "హల్లో, వాసు అండ్ శేషు డిటెక్టివ్ ఏజెన్సీ ప్లీజ్!" అన్నాడు.

"అయితే మాతో మీకేం పని?" అన్నది అవతలినుంచి ఓ స్త్రీ కంఠం మంచి దూకుడుగా.

"చెప్పండమ్మా, మేము మీకే విధంగా సహాయపడ

గలం?" అన్నాడు శేషు మర్యాద ఉట్టిపడే కంఠంలో.

"అసలు మాకు సహాయం చెయ్యమని ఎవరడిగారు నిన్ను?" చాలా కోపంగా వుంది అవతలి కంఠం.

శేషు రాబోయే కోపాన్ని దిగమింగుకుని. "మీరేకదమ్మ ఫోన్ చేశారు?!" అన్నాడు.

"నేనేమిటి. నీకు ఫోన్ చెయ్యటమేమిటి? పొద్దున్నే కలగన్నావేమిటి? ఆఁయ్...." గయ్యమంది దావిడ.

"ఇదేం బావుందమ్మా. తిరి కూచుని ఫోన్‌చేసి మాతో తగువు పెట్టుకుంటున్నారు. మీరెవరు తల్లీ...."

"ఏవయ్యా నేను నీకు తల్లినా? కాసేపుంటే అమ్మమ్మని, తాతమ్మని అనికూడా అనేలా వున్నావు. చూడబోతే ఆడవాళ్ళతో మర్యాదగా మాట్లాడడం తెలీదా నీకు?"

"చూడమ్మా. నీతో ఏమన్నా గొడవగానే వుంది. నేను మీకు ఫోన్ చెయ్యలేదు. మీరే ఫోన్ చేశారు. తిరిగి మా మీద ఆరోపణలు అభాండాలు వేస్తున్నారు. ఇదేం బాగా లేదు."

"పెళ్ళికాని పిల్లలున్న యింటికి కావాలని ఫోన్‌చేసి సరసాలాడబోవటం నీకూ బావుందా?...."

శేషు మనసులోనే చెంపలు వేసుకుని "ఫోన్ పెట్టెయ్యి అమ్మాయీ!" అన్నాడు.

"నేను నీ కూతుర్ననుకున్నావా 'అమ్మాయీ' అని పిలుస్తున్నావు? నే నెందుకు పెట్టెయ్యాలి, నువ్వు పెట్టెయ్యి...."

ఆమె వాగ్ధాటి అలాగే సాగుతోంది. అంతవరకు మౌనంగా వింటున్న డిటెక్టివ్ వాసు చటుక్కున శేషు చేతిలోని రిసీవర్ అందుకుని "హల్లో, ఎవరండీ మాట్లా

దేది?'' అన్నాడు.

"నువ్వెవరయ్యా, నువ్వో కొత్త కథ చెప్తావా ఏమిటి? చూడగా మీరంతా ఏదో ముఠాలా వుందే! మీ ఏజన్సీ సంగతి యిప్పుడే పోలీసులకు రిపోర్టిస్తానుండు, తిక్క కుదురుతుంది!'' ఆమె పేట్రేగిపోయింది.

"ఏజెన్సీ ఏమిటండీ, మాది టెలిఫోన్ డిపార్టుమెంటయితేనూ....''

"మరిందాక మీ తాలుకు మనిషి ఏదో డిటెక్టివ్ ఏజెన్సీ అంటూ ఏదేదో వాగాడు....!?''

"అబ్బే, వాడికి జోక్ చెయ్యడం సరదానండీ అంతే! మేం టెలిఫోన్ లైన్ ఇనస్పెక్టర్లం! మీ ఫోన్ పని చేస్తున్నదో, లేదో జస్ట్ టెస్ట్ చేద్దామని మిమ్మల్ని కాల్చేశాం.''

"కాల్చడమేమిటి మీ బొంద....''

"కాల్చడం కాదండీ, 'కాల్' చెయ్యడం, కాలింగ్, కాలింగ్....''

"బాగున్న ఫోన్‌ని టెస్ట్ చెయ్యడమెందుకు? నిజంగా బాలేదని కంప్లెయింటిస్తే దిక్కూ దరీ వుండదు. వారం రోజులపాటు ఫోన్ డెడ్ అయినా పట్టించుకోరు. ఏం డిపార్టుమెంటయ్యా మీది?''

"ఈ సారి వారంరోజులపాటు కాదు, సంవత్సరంపాటు పట్టించుకోవటం మానేస్తాం. రేపే నీ ఫోన్ కనెక్షన్ కట్ చేసి పారేస్తాం. నీ దిక్కున్నచోట చెప్పుకో, ఫో!'' అంటూ ఫోన్ పెట్టేశాడు వాసు.

శేషుకి చాలా ఆనంద మయింది. డాన్స్ చేయబోయి నలుగురు చూస్తారని బిడియపడి, అది ఆఫీసని గుర్తొచ్చి మానేశాడు.

"బానేవుంది, పొద్దున్నే సహస్రనామం మొదలెట్టింది

మహాతల్లి! తను ఫోన్‌చేసి మనం చేశామని నోరేసుకు పడిపోతుందేమిటి?"

"అది నీ పొరపాటు కాదు, ఆమె పొరపాటు కాదు—టెలిఫోన్ వాళ్ళది!"

"ఆమె జనరల్ మేనేజర్‌ని కడిగేస్తుందేమో! నీ మాటలతో పిచ్చెత్తిపోయుంటుంది."

"కడిగేస్తుందో, ఎండేస్తుందో మనకెందుకు? ఇలాంటి ఫాల్టీలైన్స్ మెయిన్‌టెయిన్ చేస్తున్నందుకు టెలిఫోన్స్ వాళ్ళు అందుకర్హులే!"

"అవునూ—టెలిఫోన్ యినస్పెక్టర్లం అని అబద్ధం చెప్పావెందుకు?"

"అలా చెప్పకపోతే ఈపాటికి మనల్ని వెతుక్కుంటూ పోలీసువాళ్ళు వచ్చివుండే వాళ్ళు! అసలే మనలాంటి డిటెక్టివ్‌లంటే వాళ్ళకు కడుపుమంట—వాళ్ళు సాధించలేని కేసులు మనం సాధించి పేరు తెచ్చుకుంటున్నామని! అసలు వదలరు—ఏదో కేసు బనాయించి యిద్దరికీ ఆరేళ్ళు కారాగారవాసం వేయించేసినా ఆశ్చర్యపడనక్కర్లేదు.

"మంచి ఆలోచన చేశావు!"

"లేకపోతే....? నువ్వు ఫోన్ ఎత్తి 'హల్లో' అంటే సరిపోతుంది కదా! వాసు అండ్ శేషు డిటెక్టివ్ ఏజన్సీ ప్లీజ్....అంటూ మన జాతక మెందుకు అవతలవాడితో ఏకరువు పెట్టటం?! అందుకే ఆమెతో అలా అబద్ధం చెప్పాను. ఒకటి మనల్ని రక్షించుకోవటం కోసం, రెండోది—టెలిఫోన్స్ వాళ్ళపని పట్టడంకోసం—అలా చెప్పాను."

"అందుకే నువ్వు నాకు గురువయ్యావుగురూ!" అని శేషు ఏదో అనబోయేంతలో ఫోన్ మోగింది.

శేషు రిసీవర్ మీద చెయ్యి వెయ్యబోతుంటే వారించి వాసు ఎత్తుకున్నాడు. "హల్లో, ఎవరు కావాలండీ?" అనడిగాడు.

"డార్లింగ్, నిన్న సాయంత్రం వస్తానన్నావు రాలే దేం?...."

వాసు చటుక్కున రిసీవర్ శేషుకిచ్చి "నీ గురించి కాబోలు, అమ్మాయెవరో....!" అన్నాడు పొడిపొడిగా.

శేషు రిసీవర్ అందుకుని "హల్లో!" అన్నాడు.

"డార్లింగ్! ఈ రోజైనా మోసం చెయ్యకుండా వస్తావు కదా! పార్కులో మన సంకేత స్థలంలోనే కూచుని వుంటాను. నిన్న పొద్దుపోయేవరకు చూపి చూపి విసిగి పోయాను. ఈ రోజు కూడా అలా చేస్తే ఊరుకోను తెలుసా!"

శేషుకి కేస్ అర్థమయిపోయింది. టెలిఫోన్ రాయ బారమా? లవ్ ఎఫైర్స్ కూడా ఫోన్‌లోనేనా? మధ్యలో మరెవరి చెవుల్లో పడ్డా యెంత అపహాస్యంగా వుంటుంది!

"అది సరేగాని, యింకమీదట నాకు ఫోన్ చెయ్యకు."

"అదేమిటి?"

"నన్ను కలవాలని కూడా ప్రయత్నించకు!"

"ఏ మయిందివాళ నీకు?"

"నేను వేరే అమ్మాయిని ప్రేమించాను."

"వ్వాట్, నేను నీకు వెక్కసమయిపోయానా?"

"అయినా నువ్వేమైనా అందగత్తెవా, కనీసం రంభవా, ఊర్వశివా?"

"ఎన్నిసార్లు నా అందాన్ని పొగడలేదు నువ్వు? అలాంటి అప్సరసవు, ఇలాంటి వనదేవతవు అంటూ పొగిడి, ఇప్పు డిలా మాట్లాడుతావా?"

"నీ మీద నా కిప్పుడు యెలాంటి అభిప్రాయమూ లేదు, సారీ!"

"ఎంత తేలిగ్గా సారీ అనేశావు? నీ అంతు తేలుస్తాను. నన్ను కాదని దేంతో ఊరేగుతావో చూస్తాను. అయినా లోకంలో నువ్వొక్కడివే మగాడివా? నా వెంటబడి వేధించి, నేను కనికరించకపోతే చస్తానని ఏడిచావని మనసు కరిగి నీతో స్నేహం చేశాను. ఈ రోజు నన్ను కాదని మరోదాని వెంట పడటానికి సిగ్గులేదూ నీకు?"

"ఉందిలే! కాని అస్తమానూ సిగ్గుపడను!"

"యూ చీట్! ఛీ నీ మొహం ఈ జన్మలో చూడను. ఇంతటితో నీకు నాకు సరి!"

"నేను అదే చెప్పాలనుకుంటున్నాను, ఈ జన్మకి నిన్ను చూడాలని నాకూ లేదు...."

శేషు యింకా చెపుతుండగానే వాసు పరిస్థితి విషమించటం గమనించి చటుక్కున శేషు చేతినుండి రిసీవర్ లాక్కుని, హల్లో, ఎవరమ్మా మాట్లాడేది, శేషు స్నేహితురాలివా?" అన్నాడు.

"శేషా? శేషెవరు?"

వాసుకి పూర్తిగా సమస్య విడిపోయింది. "చూడమ్మా, ఇది నీ బాయ్‌ఫ్రెండు యిల్లుకాదు. మీరేదో రాంగ్‌నంబర్‌కి ఫోన్‌చేసి మీ బోయ్‌ఫ్రెండ్ అనుకుని యింతసేపు నా పార్ట్నర్‌తో వాదన పెంచుకున్నారు. నా పార్ట్నర్‌కి పెళ్ళికి ముందు ప్రేమకలాపాలు జరిపేవాళ్ళంటే మంట! అందుకని నిన్ను ఏడిపించటానికి అలా మాట్లాడాడు. అనవసరంగా నీ లవ్ ఎఫైర్‌లో తుఫాను చెలరేగటం నాకిష్టంలేక నిజం చెప్పేశాను. అనవసరంగా నీ బోయ్‌ఫ్రెండుతో అనక గొడవ పెట్టకునేవు— కేరీ ఆన్ ప్రొసీడ్?" వాసు

చివరి మాటలు వినకుండానే చటుక్కున ఫోన్ పెట్టేసిందా అమ్మాయి.

శేష వచ్చే నవ్వు నాపుకోవటానికి చాలా అవస్థ పడుతున్నాడు. వాసు మందలింపుగా చూశాడతని వంక.

"పాపం, ఎవరో ఆడకూతురు! ఆమె కిష్టమై ఎవరితోనే స్నేహం చేసుకుంటే మధ్య నీకెందుకు? ఆమెకు నచ్చచెప్పేసరికి తలప్రాణం తోకకొచ్చింది. ఎవరెలాపోతే నీకెందుకు డియర్ శేషూ!?"

శేష నవ్వాపుకుని, "యువతరం చెడిపోతోంది మిష్టర్ వాసూ! బాధ్యత తెలిసిన మనం కూడా యిలా పెళ్ళికి ముందు జరిగే ప్రేమ కలాపాల్ని ఎంకరేజ్ చెయ్యటం మంచిదా, వాళ్ళని మందలించటం మన బాధ్యత కాదా?" అన్నాడు సూటిగా.

"మనం యిలాంటి బాధ్యతలు నెత్తికేసుకుని లోకాన్ని ఉద్ధరించే బదులు మన కేసులమీద దృష్టి కేంద్రీకరిస్తే నాలుగు డబ్బులొస్తాయి. లోకాన్ని అందునా యువతరాన్ని సంస్కరించటానికి నువ్వేమైనా కందుకూరివా, గురజాడవా? మహానుభావులు వాళ్ళ జీవితకాలమంతా సంస్కరణ తీసుకురావటానికే వెచ్చించారు. నువ్వొక రోజు వెచ్చించగలవా?"

"ఏమిటో గోల. ఈ రోజు అన్నీ రాంగ్ నంబర్లే! ఫోన్ ఎందుకు ఇన్‌స్టాల్ చేయించామోగాని, యీ రాంగ్ నంబర్సుకి రిప్లయి యివ్వలేక ఛస్తున్నాం."

"అలా నిరాశపడిపోకు! ఏ రాంగ్ నంబర్‌కి ఏం ప్రయోజనం ముడిపడివుందో, ఏ లోకకల్యాణం పెనవేసుకుని వుందో—చూద్దాం. కేసులెలాగూ లేవుకదా, యిదో కాలక్షేపం! మనకి పైసా ఖర్చులేకుండా వినోదం!"

"ఇలాంటి వినోద కాలక్షేపాల్ని మరిన్ని యిబ్బడి ముబ్బడిగా ఏర్పాటు చేయాలని టెలిఫోన్స్ వాళ్ళను కోరుదాం. హేట్సాఫ్ టు టెలిఫోన్స్!"

సరిగ్గా అదే సమయంలో మళ్ళీ ఫోన్ మోగింది.

2

శేషు ఫోన్ అందుకోబోతుంటే, "ఆగాగు! నువ్వనవసరంగా మన గుట్టు అవతలివారికి చెప్పేస్తావు. మన జుట్టు వాడి చేతికందించేస్తావు" అని ఫోన్ ఎత్తి "హలో, ఎవరు కావాలండీ?" అన్నాడు.

"సుబ్బయ్యశెట్టి చింతపండు దుకాణమేనా?" అన్నాడు అవతలి వ్యక్తి.

"సారీ, రాంగ్ నంబర్ అంటూ ఫోన్ పెట్టెయ్యబోయి అవతలనుంచి మాటలు వినిపిస్తుండటం విని ఆగాడు.

"గుడ్! రైట్ నంబరే! రంగా నేను చెప్పేది జాగ్రత్తగా విను! బంగారప్ప చెట్టియార్ నగల దుకాణం-రాత్రి పదకొండున్నరకి! మెరూన్ కలర్ షెవర్లెట్ కార్లో మనవాళ్ళు చెట్టియార్ దుకాణం సందు చివర్లో యెదురు చూస్తుంటారు. తర్వాతి పని నువ్వు చూసుకో!" అవతలి వ్యక్తి యిక చెప్పాల్సిందేం లేదన్నట్టు ఫోన్ పెట్టేశాడు.

వాసు ఏదో అడగాలనుకున్నాడుగాని, అవతల వ్యక్తి అవకాశ మివ్వలేదు.

శేషు ఆసక్తిగా వాసువంకే చూస్తున్నాడు.

వాసు చిటికెవేసి, "చక్కటి కేసు ఫోన్లో వెతుక్కుంటూ వచ్చింది. గుడ్ డే! అన్నాడు వూరిస్తూ.

శేషు టేబిలు మీదికి వంగి ఏమిటేమిటి?" అన్నాడు హుంషారుగా.

"నేను చెప్పానుకదా ఏ రాంగ్ నంబర్తో ఏ లోకకల్యాణం ముడిపడుతుందోనని! అదే జరిగింది. రాంగ్‌నంబరే ఆ ముఖ్యమైన యిన్ఫర్మేషన్ విచ్చింది. ఈ రాత్రికి బ్రహ్మాండమయిన నగలదోపిడీ జరగబోతోంది. అది ముందుగా మనకి తెలియటం మన అదృష్టం. బంగారప్ప చెట్టియార్ అదృష్టం!"

"వాట్, వాట్! అసలేమిటి విషయం?"

ఈ రోజు రాత్రి పదగొండున్నరకి బంగారప్ప చెట్టియార్ నగల దుకాణం దోపిడీ చెయ్యటానికి ఓ బ్రహ్మాండమైన పథకం సిద్ధమైంది. దానికి నాయకత్వం వహించేవాడి పేరు రంగా! వాళ్ళ కోడ్ వర్డు—'సుబ్బయ్యశెట్టి చింతపండు దుకాణం! అవతలివాడు—బహుశా అందరికీ బాస్ అయివుంటాడు—ఆదేశమిచ్చాడు రంగాకి. రంగా దానికి 'సారీ రాంగ్‌నంబర్' అని బదులు చెపితే అతడే సరైన వ్యక్తి అని బాస్ గ్రహిస్తాడన్నమాట. నేను నిజంగా రాంగ్ నంబరని జవాబిస్తే అది తన కోడ్‌వర్డుని జవాబనుకుని అసలు సంగతి కక్కేశాడు బాస్. బ్రహ్మాండమయిన డిస్కవరీ! పదవోదాం!"

"ఎక్కడికి?"

"దుష్టశిక్షణకు ముందు శిష్టరక్షణ చేయటం మంచిది కదా! బంగారప్ప చెట్టియార్‌ని కలిసి రాబోయే అపద గురించి హెచ్చరించి, ప్రమాదాన్ని ఎదుర్కోవటమేగాక ఆ దొంగల ముఠాని రెడ్‌హేండెడ్‌గా పట్టిచ్చేద్దాం పోలీసులకి!"

"అందువల్ల మనకొచ్చే లాభం?"

"చెట్టియార్ మనకు ఫీజిచ్చుకోడా?"

"ఏమిటి గ్యారంటీ? మనం చెప్పింది చక్కగా వినేసి,

'ఆ యిదంతా ఉత్తది, నేన్నమ్మను. మీరు వెళ్ళిరండి!' అంటూ మనల్ని వదిలించుకుని ఆనక పోలీసు సహాయం తీసుకుంటాడు. దోపిడీ జరక్కుండా రక్షించుకుంటాడు. మన నోట్లో మన్నే!"

వాసు ఒప్పుకున్నాడు. "నీ తెలివితేటలు ప్రశంస నీయం! అలా జరగటానికి అవకాశ ముంది!"

"అంచేత స్వామికార్యం స్వకార్యం కూడా నెరవేరే మార్గం చూడాలి. మాస్టర్ ప్లాన్ వెయ్యాలి!"

వాసు సాలోచనగా చూశాడు.

ఇద్దరు కాసేపు తర్జన భర్జనల్లో పడ్డారు.

"ఒకలా చేస్తేనో...." అన్నాడు శేషు.

"ఏమిటది?"

"మనం అసలు విషయం చెప్పకుండా బంగారప్పతో ముందుగానే బేరం పెడితే...."

"ఏమని....?"

"అదే, 'నీకో ఆపద రాబోతోంది. దాని గురించి మాకు పూర్తి వివరాలు తెలుసు. దాన్ని నీకు చెపుతాం. ప్రతి ఫలంగా మాకేమిస్తావు?' అని అడిగితే....?"

"నమ్మకపోగా మనల్నే అనుమానించే ప్రమాదముంది. మనకీ విషయం ఎలా తెలుసని ఆరా తీస్తాడు. ఇలా అనుకోకుండా, కాకతాళీయంగా ఫోన్‌లో వినేశామని అంటే నమ్మడు. నా జాగ్రత్తలు నాకు తెలుసు మీరు దయ చేయండి—అనేపినా అనేయగల్డు. కాబట్టి, సరైన ప్లాన్ వెయ్యాలి!"

ఇద్దరు మళ్ళీ ఆలోచనల్లో పడ్డారు.

"పోనీ పోలీసులకి ముందుగా తెలియచేస్తే....? మనకి పేరు ప్రఖ్యాతలు, ప్రభుత్వ ప్రశంస లభిస్తాయి కదా!"

అన్నాడు శేషు.

"నువ్వే యుగంలో యున్నావు బాబూ! పోలీసుల చెవికి సోకిం తర్వాత యిక పూర్తిగా ఆశ వదిలేసుకో వచ్చు. ఆ ఘనకార్యమంతా తమ ప్రయోజకత్వమేనని డబ్బా వాయించుకుంటారు. మన పేరు బయటికి రాని వ్వరు. ఇటు చెట్టియార్ దగ్గర పెద్ద మొత్తంలో 'నజరానా' కొట్టేస్తారు, అటు డిపార్టుమెంట్లో పెద్ద ప్రమోషన్స్ కొట్టే స్తారు. వాళ్ళని పొరపాటున కూడా నమ్మొద్దు!"

"మరేం చేద్దాం? మనిద్దరం అంత పెద్ద ముఠాని ఎదిరించి పోరాడలేం కదా! పోలీసు అసిస్టెన్సు తప్పనిసరి! మనకి లాభం లేకపోయినా చెట్టియార్ నష్టపడిపోకూడదు. దొంగలు సంఘానికి శత్రువులు! మనం సంఘంలో సభ్యులం. కాబట్టి వాళ్ళు మనకీ శత్రువులే!"

"నీ థీరీ బానేవుంది, కాదనను. ఏ విధంగా చూపినా అటు చెట్టియార్‌కో, ఇటు పోలీసులకో చెప్పక తప్పేటట్టు లేదు."

"పోలీసులకి చెప్పేకంటే చెట్టియార్‌కి చెప్పటమే మంచిది! చెట్టియార్ మనకి ప్రతిఫలం ముట్టచెప్పకపోయినా ఓ మంచిపని చేశామన్న సంతృప్తి అయినా మిగుల్తుంది మనకి! ఆనక చెట్టియారే తనక్కావలసిన రక్షణ ఏర్పాట్లు చేసుకుంటాడు."

"అదే మంచి పని పద వెళ్దాం!"

"చెట్టియార్ షాపు మెయిన్‌రోడ్లో వుంది కదూ!"

"ఆఁ వరసగా అన్నీ బంగారు నగలషాపులే కదా ఆ రోడ్‌న. చెట్టియార్ షాపు ఓ చివరగా వుంది కదూ. అందుకే దొంగవెధవలు తమ టార్గెట్‌గా దాన్ని సెలక్టు చేసుకున్నారు!"

"నా కో అనుమానం వస్తోంది" అన్నాడు శేషు.

"ఏమిటది;"

"ఆ బాస్ ఎవడో రంగా అనే వాడికి కదా ఫోన్ చేశాడు: ...."

"అవునూ ఏం?"

"ఆ రంగాకి బదులు పొరపాటున ఆ మెసేజ్ మనకి చేరిపోయింది కదా: ...."

"అవునూ ...."

"ఆ రంగా అనేవాడు బాస్నించి వచ్చే మెసేజ్కోసం ఎదురు చూస్తూంటాడు. సాయంత్రం వరకు చూపి చూపి, ఏ విషయము కన్ఫర్మ్ చేసుకోవటానికి బాస్కి ఫోన్ చెయ్యటమో లేక స్వయంగా వాళ్ళ స్థావరానికి వెళ్ళటమో చేశా డనుకో: అప్పుడు అసలు విషయం తెలిసిపోతుంది. ఆ మెసేజ్ మనకి చేరినట్లు తెలీదు గాని, మొత్తానికి ఎవ డికో చేరిపోయిందని వాళ్ళకర్థమైపోతుంది. వాళ్ళ ప్రోగ్రాం అర్జంటుగా మార్చేసుకుంటారు. బహుశా భవిష్యత్తులో చెట్టియార్ షాపు జోలికే పోకపోవచ్చు. అవునా....?"

"యు ఆర్ రైట్: మరోసారి నీ హేతువాదానికి, తెలి వికి జోహార్లు:"

"పొగడ్తలు తర్వాత: ఇప్పుడు మనం చెట్టియార్కి యీ విషయం చెప్పాక, అతను రాత్రికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాక—యిప్పుడు మనం వూహించినట్టు ప్రోగ్రాం అర్జంటుగా ఛేంజ్ అయిపోతే, అప్పుడు మన మాట విలువ, మనకి గౌరవం మర్యాద—అన్నీ తుడిచిపెట్టుకుపోతాయి. అవునా....?"

"కరెక్ట్: భలే డైలమాలో పడిపోయామే:"

"ఆ బాస్ ఎవడో తెలీదు, వాడెక్కడుంటాడో అసలే

తెలీదు. కనీసం వాడి ఫోన్ నంబరైనా తెలీదు. ఆ రంగా గాడి గురించి కూడా అంతే! గాల్లో వున్నాం. ఊహాగానాలు పని చెయ్యవు. ప్రాక్టికల్ నాలెడ్జి చాలా ముఖ్యం. ఎలా....?"

"వాసు చటుక్కున కుర్చీలోంచి లేచాడు.

"అయిడియా....బ్రైట్ ఐడియా!" అని యెగిరి గంతేశాడు.

శేషు కూడా అంతపనీ చెయ్యబోయి ఆగి, "ఏమిటది? వెంటనే చెప్పు" అన్నాడు.

"టెలిఫోన్ అంటే గుర్తొచ్చింది. సాధారణంగా రాంగ్ నంబరు పక్క పక్క నంబర్లకే రింగవుతుంటుంది, అవునా?"

"అవును అంతే....?"

"మన నెంబరు 554433 కదా! రంగా నెంబరు 554432 గాని, 554431 గాని. 554434 గాని కావచ్చు. లేదా పదుల సంఖ్యలో అంకెను తీసుకుంటే 3 స్థానంలో 4 గాని 2 గాని కావచ్చు. అంటే 554443 గాని, 554423 గాని కావచ్చు. జస్ట్ ఓ ట్రయిల్ వేద్దాం. సక్సెస్ కావచ్చు కాకపోవచ్చు— ప్రయత్నం పురుషలక్షణం!"

"డైరెక్టరీ చూద్దామా?"

"ఆ నంబరు ఎవరిదో తెలుసుకోవటానికా? కరెక్టుగా తెలీకపోవచ్చు. దానికన్న కాల్స్ వేస్తయితే అవుతాయి— ఒకటొకటి ట్రై చేస్తేనే మంచిది. టైం కలిసొస్తుంది, ఫలితమూ వెంటనే వస్తుంది."

"ఆ నంబరు రంగాదో కాదో ఎలా తెలుస్తుంది? అవతలి వ్యక్తి రంగా అని యెలా గుర్తించగలుగుతాం?"

"డైరెక్టుగా అడిగితే పప్పులో కాలేసినట్టే! బాస్ ఏమని

అడిగాడు—'సుబ్బయ్యశెట్టి చింతపండు దుకాణమేనా?' అని! మనమూ అదే కోడ్ వర్డు ఉపయోగిస్తాం, ఫినిష్!"

౩

వాసు నంబర్లు రాసిన కాగితం ముందు పెట్టుకుని ప్రయత్నించసాగాడు. 554432 కి రింగు చేశాడు.

అవతల ఫోన్ ఎత్తిన మనిషి మగాడే!

"హల్లో ఎవరు కావాలి?" అనడిగాడు.

"సుబ్బయ్య శెట్టి చింతపండు దుకాణమేనా?" అన్నాడు వాసు.

"సారీ రాంగ్ నంబర్" అని చటుక్కున ఫోన్ పెట్టేశాడు ఆ వ్యక్తి. వాసు యింకా ఏదో అనబోయాడు.

కాగితం మీద నంబర్లు వరసగా ప్రయత్నిస్తూ వచ్చాడు వాసు. ఓ వ్యక్తి పెద్ద గొడవ వేసుకున్నాడతనితో.

"సుబ్బయ్యశెట్టి చింతపండు దుకాణమేనా?" అని వాసు అడగ్గానే "అవును, సుబ్బయ్యశెట్టి దుకాణమే, ఏం కావాలి?" అనడిగాడు అవతలి వ్యక్తి.

వాసు వెంటనే ఏం చెప్పాలో అర్ధంకాక తికమక పడి "చింతపండుందా?" అనడిగాడు.

"చింతపండు కాకపోతే బెల్లముంటుందా?"

"అదేనండి స్టాకుందా అని?"

"నీ కెంత కావాలో చెప్పరాదూ?" అన్నాడు పెడసరంగా.

"అదే స్టాకుందో లేదో తెల్సుకుని వద్దామని...."

"అసలు నీది కొనే బేరమేనా? నిజంగా కొనేవాడి వయితే సరాసరి యిక్కడికొస్తావుగాని ఫోన్‌మీద బేరాలేమిటి? ఇంకెప్పుడు యిలాంటి చచ్చుప్రశ్నలు వేసి నా టైం పాడుచెయ్యకు!" అని యింకా తిట్లదండకం వల్లి

స్తూంటే వాసు చటుక్కున ఫోన్ పెట్టేశాడు.

శేషు అతని అవస్థచూసి "ఫోన్ ఇలా యివ్వు!" అన్నాడు.

వాసు చెయ్యి అడ్డంపెట్టి ఆగమన్నట్టు సైగచేశాడు. అతను డయిల్ చేసిన నంబరు రింగయి యెవరో ఎత్తారు.

"హల్లో, ఎవరండీ?" అన్నది ఓ ఆడగొంతు.

ఆమెని కోడ్‌వర్డు అడగటం ఎలాగని ఆలోచించి, "రంగా వున్నాడండీ?" అన్నాడు.

"మిస్టర్ యిది లేడీస్ హాస్టల్! రంగాలు, రామయ్యలు యెవరూ వుండరు. డోంట్ బి సిల్లీ!" అంటూ ఫోన్ పెట్టేసింది.

వాసు కర్చీఫ్‌తో చెమట తుడుచుకున్నాడు.

ఇంక రెండు నంబర్లే మిగిలాయి. శేషు మళ్ళీ రిసీవర్ అడిగాడు. "ఈ రెండే కదా, ట్రై చెయ్యనీ! లక్కీగా రంగా దొరికితే ఎలా మాట్లాడాలో నేనే బాగా మాట్లాడగలను. బాస్‌తో మాట్లాడింది నేనే కదా!" అన్నాడు.

ఫోన్ రింగయింది. వెంటనే అవతల నుంచి "హల్లో!" అన్న కంఠం కర్కశంగా వినిపించింది.

"హల్లో సుబ్బయ్యశెట్టి చింతపండు దుకాణమేనా?" అనడిగాడు వాసు.

"సారీ, రాంగ్‌నంబర్!" అన్నాడు అవతల వ్యక్తి.

వెంటనే వాసు "గుడ్! రైట్ నంబరే" అన్నాడు.

అవతలి వ్యక్తికి చాలా కోపం వచ్చింది "ఏమిటయ్యా పొగరు? నేను రాంగ్‌నంబరంటుంటే కాదు రయిటంటా రేమిటి? నా నంబరేదో నాకే గుర్తు లేదంటావా? లేక నేను చింతపండమ్ముకునేవాడిలా కనిపిస్తున్నానా? జాగ్రత్తగా మాట్లాడు? మర్యాద నేర్చుకో!" అంటూ ఫోన్ పెట్టే

శాడు.

వాసు ముఖాన నెత్తురు చుక్కలేదు.

"అనవసరంగా మొదలెట్టాం యీ ప్రయోగం! సలహా యిచ్చినందుకు నాకే బెడిసికొట్టింది మర్యాద గురించి గౌరవం గురించి ప్రతివాళ్ళ దగ్గిరా పాఠాలు నేర్చుకోవలసి వచ్చింది ఉదయాన్నే! ఛీ, ఫోను వుండగానే సరా? పొరపాటున రాంగ్‌నంబరొస్తే మర్యాదగా ఆ సంగతి చెప్పొచ్చు గదా! దర్టీ క్రీచర్స్" తిట్టుకున్నాడు వాసు.

"అందుకే ఫోన్ నాకిమ్మన్నాను" చెయ్యి సాచాడు శేషు.

"ఎందుకులే యీ మిగిలిన నంబర్ కూడా యథాశక్తి నన్నే తిట్టనియ్యి....అన్నీ 'రాంగ్ నంబర్' అని చెపుతున్నారు దానికి జవాబుగా 'గుడ్ రైట్‌నంబరే!" అని బాస్ ఫక్కీలో చెప్పేలోపల ఫోన్ పెట్టెయ్యటమో, గద్దిపెట్టెయ్యటమో చేస్తున్నారు" వాపోయాడు వాసు.

"ఆ మాత్రానికే నిరాశపడిపోకు. ఆ నంబర్ రంగాదే అయితే రాంగ్‌నంబర్ అన్నాక ఫోన్ పెట్టెయ్యడు, మెసేజ్ కోసం ఎదురు చూస్తుంటాడు. అదే సింబల్ మనకు!" అన్నాడు శేషు ఓదారుస్తూ.

వాసు నంబరు చూశాడు 554443 రింగ్ చేశాడు.

"హల్లో! అన్నాడు అవతల వ్యక్తి. గొంతు చాలా బొంగురుగా వుంది. ఇందాకటి గొంతుకన్నా యెన్నోరెట్లు కఠినత్వం ధ్వనించింది.

"సుబ్బయ్యశెట్టి చింతపండు దుకాణమేనా?" అన్నాడు వాసు భయం భయంగానే అయినా, ఖచ్చితంగా.

"సారీ, రాంగ్‌నంబర్!" అన్నాడు అవతలి వ్యక్తి. కాని ఫోన్ పెట్టెయ్యలేదు. లైన్‌లోనే వున్నాడు.

వాసుకు ఉత్సాహం వచ్చేసింది.

"గుడ్! రైట్ నంబరే! రంగా!" అని ఓ క్షణం ఆగాడు వాసు, బాస్ గొంతుని అనుకరిస్తూ.

"ఎస్ బాస్. మీ ఫోన్‌కోసమే ఎదురుచూస్తున్నాము" అవతలి వ్యక్తి గొంతులో నమ్రత, విధేయత కొట్టొచ్చి నట్టు వినిపించాయి. ఎదురుగా వుంటే బహుశా చేతులు కట్టుకుని తలవాల్చి వినయంగా నించునివుండేవాడని ఊహించాడు వాసు.

"నేను చెప్పేది జాగ్రత్తగా విను. బంగారప్ప చెట్టియార్ నగల దుకాణం — రాత్రి పదకొండున్నరకి! మెరూన్ కలర్ ఛెవర్లెట్ కార్లో మనవాళ్ళు చెట్టియార్ దుకాణం సందు చివర్లో ఎదురుచూస్తుంటారు. తర్వాతి పని నువ్వు చూసుకో!" అంటూ యిక చెప్పాల్సిందేం లేదన్నట్టు ఫోన్ పట్టేశాడు.

శేషు నవ్వుతూ చూశాడు.

"ఒకవేళ వాళ్ళ బాస్ పొరపాటున ఫోన్‌చేసినాతెలీకుండా ముందే రంగాకి మెసేజ్ ఇచ్చేశాను. వాళ్ళ బాస్ మళ్ళీ ఫోన్ చేసినా ప్రమాదం లేదిక. ఆ మెసేజ్ మనకి చేరినట్టు గాని, మనం రంగాకి అది అందచేసినట్టుగా ఎవరికీ తెలీదు" అన్నాడు వాసు.

"మొత్తానికి సాధించావన్న మాట! ఉండు, ముందీ నంబరు డైరెక్టరీలో ఎవరి పేరుమీదుందో చూడనీ! ఈ రంగా మన గుప్పెట్లో చిక్కినట్టే!" అంటూ శేషు టెలిఫోన్ డైరెక్టరీలో 554443 నంబరు వెతికాడు. ఆశ్చర్యంతో నోరు తెరిచాడు.

'సుబ్బయ్యశెట్టి, టామరిండ్ మర్చంటు, మార్కెట్ రోడ్' అని వుంది నంబరు కెదురుగా.

"అరె, వీళ్ళు చాలా తెలివైన దొంగలే! నంబరు సుబ్బయ్యశెట్టి పేరుమీదనే వుంది. టెలిఫోను వాళ్ళు కూడా అనుమానించకుండా ఫోన్‌లో పెద్ద పెద్ద దెకాయిజం లకి పునాదులు వేసేస్తున్నారు!"

శేష నంబరు, అడ్రసు పేపరుమీద రాసుకుని జేబులో పెట్టుకున్నాడు. "రంగాతోబాటు బాస్ మనుషులు రాత్రి పదకొండున్నరకి సరాసరి నగల దుకాణం దగ్గరికి వచ్చేస్తారు. మనకి లైన్ క్లియర్!" అన్నాడు.

4

క్యాహోనా సాబ్?" అడిగాడు బంగారప్ప చెట్టియార్.

"మీతో పర్సనల్‌గా మాట్లాడాలి" అన్నాడు వాసు. అతనికి హిందీ రాదు. శేషుకి వచ్చుగాని బాగా పలకటంరాదు.

బంగారప్పకు తెలుగు వచ్చు. చాన్నాళ్ళుగా ఆంధ్ర దేశంలో స్థిరపడిపోయి కోట్లు గడించాడు.

"అయితే తమకు నగలు అక్కర్లేదా?" అనడిగాడు చెట్టియార్ ఆశ్చర్యంగా.

"వద్దండి. నగల విషయంలోనే మీ సలహా కావలసి వచ్చాం!" అన్నాడు శేష.

సరిగ్గా అప్పుడే నలుగురు పెద్దమనుషులు లోని కొచ్చారు.

చెట్టియార్ వాళ్ళని సగౌరవంగా లోపలికి ఆహ్వానిస్తూ, "రెండు నిమిషాలు! గిరాకీ చూసి వచ్చేస్తాను" అన్నాడు.

వాసు, శేష మౌనంగా తల ఊపారు. వచ్చిన వాళ్ళు పైకి పెద్దమనుషులుగా వేషం వేసుకున్నా పహిల్వాన్‌ల్లా వున్నారు. ముఖాల్లో తెచ్చిపెట్టుకున్న సౌమ్యత కనిపి

స్తోంది.

"ఖరీదైన వజ్రాలహారా లున్నాయా?" అనడిగారు వాళ్ళు. చెట్టియార్ వజ్రాల హారాలు వరసగా అద్దాలకేసు మీద పేర్చాడు. వాళ్ళు పెదాలు విరిచారు.

"ఇంకా ఖరీదైనవి లేవా?" అడిగారు చాలా నిర్ల క్ష్యంగా.

చెట్టియార్ మంచిగిరాకీ వచ్చినందుకు సంతోషించాడు. ఇంకా యింకా ఖరీదైన డైమండు నెక్లెసులు, ఛెయిన్లు చూపించాడు.

ఎంత విలువైన హారాలు చూపించినా వాళ్ళకు నచ్చటం లేదు. ఖరీదు లక్షల్లో చెప్తున్నా యింకా పెదవి విరుస్తూనే వున్నారు.

వాళ్ళు అడిగేకొద్దీ చెట్టియార్ లోపల్నుంచి యింకా యింకా తెప్పిస్తూనే వున్నాడు.

వాసు శేషను చూపి కళ్ళతోనే సందేశం పంపాడు. శేషు దాన్ని రిసీవ్ చేసుకున్నాడు. ఎక్కడెక్కడి నగలో చెట్టియార్ తెచ్చి పోగేస్తున్నాడు గ్లాసు కేసుల మీద. తక్కిన బేరాల్ని అతని కొడుకు కాబోలు అటెండవు తున్నాడు.

వాళ్ళు నలుగురు "ఇంకేమీ లేవా? ఇంతకన్న ఖరీ దైనవి లేవా?" అనడుగుతున్నారు.

చెట్టియార్ వాళ్ళవంక ఆశ్చర్యంగా చూపి, "ఈ సిటీలో కెల్లా పెద్దషాపు నాదేనని తమకు తెలీదనుకుంటాను. ఎవరూ తెప్పించనన్ని లేటస్టు మాడల్సు నేనే తెప్పిస్తాను. ఇంతకన్న ఖరీదైనవి కూడా సిటీ మొత్తంమీద యెక్కడా దొరకవు" అన్నాడు.

వాళ్ళు నలుగురు ఒకరినొకరు సంప్రదించుకున్నారు. "సరే, యీ నగలు పక్కకు తీసిపెట్టండి. సాయంత్రం ఆడవాళ్ళను కూడా తీసుకొస్తాం. వాళ్ళు సేటిస్‌ఫై కావాలి కదా!" అన్నారు కొన్నినగలు తీసి పక్కగాపెట్టి.

"అచ్ఛాసాబ్! మంచిమాట అన్నారు. అసలు ఆడవాళ్లు సంతృప్తిపడితేనే తీసుకోవాలి యిలాంటి ఖరీదైన వస్తువులు!" అన్నాడు వంతపలుకుతూ చెట్టియార్.

వాళ్ళు నలుగురు వెళ్ళిపోయారు. చెట్టియార్ నగలన్నీ గాజుకేసులమీది నుంచి తీసి లోపల సర్దించాడు. తర్వాత వాసు, శేషులను చూసి, "బోలియే సాబ్!" అన్నాడు అలవాటైన ధోరణిలో.

"మీ పర్సనల్ రూం వుందా?" అడిగాడు శేషు.

"ఇలా రండి" అంటూ షాపుకి చేర్చివున్న ఏంటీ రూంలోకి వాళ్ళను తీసుకువెళ్ళాడు. ముగ్గురూ కూచున్నారు.

"మేము వాసు అండ్ శేషు డిటెక్టివ్ ఏజెన్సీ నుంచి వచ్చాం. నా పేరు శేషు. ఈయన పేరు వాసు. మీకో ముఖ్యమైన యిన్ఫర్మేషన్ యివ్వాలని వచ్చాం. అది మీకెంతో ఉపయోగపడ్తుందని నమ్ముతున్నాం" అన్నాడు శేషు.

చెట్టియార్ ఆసక్తిగా ముందుకు వంగి "ఏమిటి సార్, అది?" అనడిగాడు.

"మీ షాపు ఈ రోజు దోచబడుతోంది" అన్నాడు వాసు తాపీగా.

చెట్టియార్ కుర్చీలో అదిరిపడ్డాడు. "ఏమిటి మీరంటున్నది?" అన్నాడు.

"అవును. రాత్రి పదకొండున్నరకి! ముందే రక్షణ ఏర్పాట్లు చేసుకోండి!"

చెట్టియార్ నమ్మలేనట్టు ముఖం పెట్టాడు. "ఏమిటి గ్యారంటీ?" అన్నాడు.

"మీరేమీ ప్రయత్నాలు చెయ్యకపోతే రేపుదయిం మీకు మా మాటలు నిజమేనని తెలుస్తుంది. అదే గ్యారంటీ!"

"చెట్టియార్ దెబ్బతిన్నట్టు చూశాడు.

"మీరు నాతో ప్రాక్టికల్ జోక్ చెయ్యటంలేదు కదా!"

శేషుకి చిర్రెత్తింది. కుర్చీలోంచి లేచిపోయాడు.

"ఈ రాత్రికి మేం చెప్పినట్టు జరిగితే యిక్కడి మీ వ్యాపారం ఎత్తేసి మీ దేశం వెళ్ళిపోండి! జరక్కపోతే మా ఏజెన్సీ మూసేసి యింట్లో కూచుంటాం" అన్నాడు తనూ లేస్తూ.

చెట్టియార్ లేవకుండా అలాగే చూస్తున్నాడు వారి వంక.

వాసు చెట్టియార్ మీదికి వంగి, "చూడండి, ఓ గంట క్రితం వచ్చారే డైమండ్ హారాలు కావాలని! వాళ్ళు నలుగురు దొంగలే! మీరు డైమండ్స్ ఎక్కడెక్కడ దాచారో బయటికి లాగించటానికి, ఆ ప్రదేశం గుర్తుపెట్టుకోవటానికి వచ్చారు. మీరు హారాలు చూపిస్తున్నంతసేపూ మీ రహస్య అరల్ని పరీక్షిస్తున్నారు. వాళ్ళు సాయంత్రం ఆడవాళ్ళను తీసుకొచ్చే మాట శుద్ధ అబద్ధం! అదే మీకు ఋజువు, గ్యారంటీ!" అంటూ శేషుతో బయటికి నడిచాడు.

వాళ్ళు మెట్లు దిగుతుండగా స్పష్టంగా వినిపించింది చెట్టియార్ కంఠం. "హల్లో, ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌గారా?

సార్, మీరు మఫ్టీలో వెంటనే మా షాపుకు ఓసారి రాగలరా? చాలా అర్జంటు. యూనిఫాంలో వద్దు, వివరంగా తర్వాత చెపుతాను, చుట్టూ శత్రువులు? ....”

5

రాత్రి పదకొండున్నర. వాసు, శేషు బంగారపు దుకాణానికి చాలా దూరంగా ఓ షాపు కీ నీడలో నిలబడి చూస్తున్నారు. అలా ఆ సమయంలో అక్కడ వుండటం చాలా రిస్కు అనీ, అనుమానానికి దారితీస్తుందనీ వాళ్ళకి తెలుసు? కాని, మొదలుపెట్టిన పని పూర్తయ్యేవరకు యెన్ని కష్ట నష్టాలనైనా ఎదుర్కొనటానికి వాళ్ళు సిద్ధంగా వున్నారు.

సరిగ్గా పదకొండున్నరకి మెరూన్ కలర్ ఛెవర్లెట్ కారు వచ్చి రోడ్ మలుపులో ఆగింది. మరో రెండు నిమిషాలకి ఫుల్‌సూట్‌లో వున్న ఓ వ్యక్తి ఆటోలో వచ్చి దిగాడు— ఆటోని పంపేశాడు. ఛెవర్లెట్ కారును చూపి పెన్ టార్చ్‌తో సిగ్నల్ యిచ్చాడు, షాపు మెట్లెక్కి.

ఛెవర్లెట్ కారు చెట్టియార్ షాపు ముందుకొచ్చి ఆగింది. షాపు కొల్లగొడుతుండగా చుట్టూ పోలీసు జీపులు ఒకసారిగా చుట్టేశాయి వాళ్ళను.

వాసు, శేషు సంతృప్తిగా పొకర్నొకరు చూసుకొన్నారు.

* * *

బంగారప్ప చెట్టియార్ మర్నాడుదయం వాసు, శేషుల చేతులు పట్టుకుని వదల్లేదు. “కాదనకండి. ఏదో నాకు తోచింది యిస్తున్నాను. నా మాటలకు ఏమనుకోకండి. క్షమించండి.” అంటూ క్షమాపణలు చెప్పుకున్నాడు.

శేషు చెక్ మీది అంకె చూశాడు. పదివేలు!

వసుంధర

ఎముకల మూట

గిరిధర్ ఆఫీసులో వుండగా ఫోన్ మ్రోగింది.

"హలో — గిరిధర్ స్పీకింగ్ —" అన్నా డతను.

"ఏమండీ — నేను. ఒక్కసారి అర్జంటుగా ఇంటికి రండి —" అంది ఫోన్లోని అవతలి గొంతు.

"ఏమయింది సంధ్యా!" అన్నాడతను ఆత్రుతగా.

"ఇంకేమీ అడక్కండి — రాగానే అన్నీ చెబు

తాను—"

"అసలేమిటో చెప్పు సంధ్యా!" అన్నాడతను.

"ప్లీజ్—వెంటనే బయల్దేరి రండి. సరిగ్గా గంటలో మీ రిక్కడుండకపోతే నేను మీకు దక్కను—" ఆ గొంతులో భయం వుంది.

గిరిధర్ యేమో మాట్లాడబోయాడు కానీ అవతల క్లిక్ మంది. అతనోసారి నిట్టూర్చి పర్మిషన్ కోసం బాస్ వద్దకు వెళ్ళాడు.

* * *

"వస్తాడంటావా?" అన్నాడతను.

"రమ్మని చెప్పానుగా—" అంది సంధ్య.

"నీ మాటంటే నీ భర్తకు విలువెంతుంటుందో?"

"అది కాసేపట్లో తెలుసుకుందువుగాని—యింతకూ ఆయనతో నీకు పనేమిటి?"

"ఫోన్ చేశావు కాబట్టి యింక చెప్పొచ్చు—" అన్నాడతను.

"చెప్పు—"

"నాకు మీ ఆయనమీద పగ, కసి...."

ఆమె వులిక్కిపడి—"ఎందుకు?" అంది.

"మీ ఆయన నరరూప రాక్షసుడు—" అన్నాడతను.

"అబద్ధం—" అంది సంధ్య.

"అతను నవ్వి—"నీకు తెలిసిన నిజం నాకు అబద్ధం. నాకు తెలిసిన నిజం నీకు అబద్ధం—" అన్నాడు.

"నీకు తెలిసిన నిజమేమిటి?"

"మీ ఆయన నరరూప రాక్షసుడని...."

సంధ్య అతడివంక పరీక్షగా చూసింది. అతడి వయసు ముప్పై సంవత్సరా లుంటాయి. మనిషి నాజూగ్గానూ,

అందంగానూ వున్నాడు. మాట కూడా సౌమ్యంగా వుంది. కానీ కళ్ళు....

ఆ కళ్ళలో పట్టుదల కనబడుతోంది. అదెలాంటి పట్టుదలో తెలియదు.

తను బట్ట లుతుక్కుంటూండగా అతను తలుపుతట్టాడు. తలుపు తీయగానే చొరవగా లోపలకు వచ్చి తలుపు వేశాడు.

"నువ్వేం భయపడకు. నీకేం ప్రమాదం లేదు—" అన్నాడు.

అయినా సంధ్య భయపడింది.

దానికి తోడు అతను కత్తి తీశాడు. నిజాని కది కత్తి కాదు, బటన్ నైఫ్.

ఆమె చూస్తూండగా బటన్ నొక్కాడు. ఆరంగుళాల పొడవు వచ్చింది.

"భయపడకు. నీకేం ప్రమాదం లేదు—" అన్నాడతను మళ్ళీ.

"అలాంటప్పుడు కత్తి ఎందుకు తీశావు?" అనడగా లనుకుంది సంధ్య. గొంతు పెగలలేదు. పెదవి కదల్లేదు.

"కత్తిని చూపి భయపడుతున్నావా? అది నేను బుద్ధిమంతులమీద ప్రయోగించను. నువ్వు బుద్ధిమంతురాలివనే నా అభిప్రాయం. బుద్ధిమంతురా లంటే—వెంటనే వెళ్ళి మీ ఆయనకు ఫోన్ చేసి యిక్కడకు రమ్మనాలి—" అన్నాడతను.

అతను కత్తి చూపిస్తూంటే ఆమె ఫోన్‌చేసి అతడు చెప్పమన్నట్లు చెప్పింది.

ఇప్పు డేమో తనకు ఆయనమీద పగ, కసి అంటున్నాడు.

"ఏమిటాలోచిస్తున్నావ్?" అన్నా డతను.

సంధ్య మాట్లాడలేదు.

"ఫోన్ చేసే ముందే నాకు మీ ఆయనమీద కసి అన్న విషయం యెందుకు చెప్పలేదూ అని ఆలోచిస్తున్నావు కదూ—మన ఆడవాళ్ళ పాతివ్రత్యం గురించి నాకు తెలుసు. నేనతన్ని చంపడానికే ఫోన్‌చేసి రప్పిస్తున్నానది తెలిస్తే నువ్వు నీ ప్రాణంపోయినా ఫోన్ చేయవు—" అన్నాడతను.

సంధ్య ఉలిక్కిపడి—"ఏమన్నావ్?" అంది.

"మీ ఆయన్ని చంపబోతున్నాను—" అని అతను బటన్‌నైఫ్‌ను మడిచి జేబులోపల పెట్టుకున్నాడు.

"ఎందుకు?...." అంది సంధ్య. ఇప్పుడామె కంఠం వణికింది.

"భయపడకు. నీకేమీ ప్రమాదం లేదు—" అన్నా డతను.

సంధ్య కాస్త ధైర్యం తెచ్చుకుని—"హంతకుణ్ణి చూస్తే భయంవేస్తుంది. అందులో అసహజం లేదుకదా!" అంది.

"నేను హంతకుణ్ణి కాదు—" అన్నాడతను.

"మరి మా వారిని చంపుతానన్నావ్!" అంది సంధ్య.

"చంపుతానంటేనే హంతకుడినై పోతానా?"

"పోనీ—కాబోయే హంతకుడివి...." అంది సంధ్య.

"నీకు తెలియ దేమో—నేను నీ భర్తను చంపినా హంతకుణ్ణి కాను...."

సంధ్య మాట్లాడలేదు. ఆమె మళ్ళీ పరీక్షగా అతడి వంక చూపింది. అతడి కళ్ళలో పట్టుదల....

"హత్య చేసినవాడు హంతకుడు కాడా?"

"కుమారస్వామి వృత్రాసురుణ్ణి చంపాడు. అది హత్య అయిందా? కుమారస్వామి హంతకు డయ్యాడా?"

"అంటే?"

"మీ ఆయన నరరూప రాక్షసుడు—"

సంధ్య కంగారుపడింది. పదేపదే అతడు తన భర్తను నరరూప రాక్షసుడని అంటున్నాడు. అందు క్కారణ మేమిటి?

"ఆయన చాలా మంచివారు...."

"అందుకేగా నరరూప రాక్షసుడంటున్నాను. నువ్వు అతడిలో నరుణ్ణి చూశావు. రాక్షసుణ్ణి నేను గుర్తించాను—"

"ఎప్పుడు?"

"నిన్న!" అతను నవ్వాడు—"నాకు ఏ పనీ వాయిదా వేసే అలవాటులేదు. నిన్న ఈ విషయం తెలిసింది. వెంటనే వాకబు చేసుకుంటూ వచ్చి యిప్పు డిక్కడున్నాను...."

"నువ్వు పొరబడ్డావేమో—మా ఆయ నలాంటివారు కాదు—" అంది సంధ్య.

"కత్తి పుచ్చుకుని రోజూ వళ్ళు చీరేస్తూండే మొగుడి గురించి కూడా భార్య అలాగే చెబుతుంది. అది ఈ దేశపు సంప్రదాయం—"

"నేను నిజం చెబుతున్నాను. నువ్వు పొరబడ్డావని నా అనుమానం—"

"నీ అనుమాన నివృత్తి చేయడం నాకు అవసరంలేదు. కానీ ఆధారా లున్నప్పుడు చూపించడంలో తప్పులేదు గదా—ఈ ఫోటో చూపి—ఇందులోని వ్యక్తి నీ భర్త అవునో కాదో చెప్పు—" అన్నాడతను.

అతడిముందు ఓ బ్రీఫ్‌కేసు వుంది. అందులోంచి ఓ

ఫోటో తీసి అందించాడతను. సంధ్య ఫోటో అందుకుని చూసి ఉలిక్కిపడింది.

అందులో గిరిధర్ వున్నాడు. అతడి పక్కన ఓ అమ్మాయి కూడా వుంది.

ఆ అమ్మాయి నవ్వుతోంది. గిరిధర్ కూడా నవ్వుతున్నాడు.

ఆ జంట ఎంతో చక్కగా వున్నది.

ఆ ఫోటోలో యువతి సంధ్యకు మించి అందంగా వున్నది. సంధ్య రెప్పలార్చకుండా ఆ యువతి ఫోటోనే చూస్తున్నది.

"ఎవరా యువతి?" ఆ ముఖం తనెన్నడూ చూసి వుండలేదు.

"ఆమె నా చెల్లెలు—" అన్నాడతను.

"ఆఁ" ఆశ్చర్యంతో నోరు తెరిచింది సంధ్య.

"ఆమె ఇప్పుడు లేదు—"

తెరిచిన నోరు అలాగే వుండిపోయింది సంధ్యకు.

"నీ భర్త నరరూప రాక్షసుడు...."

కాసేపు యిద్దరి మధ్యా భయంకర నిశ్శబ్దము.

సంధ్యకు యేదో అర్థమవుతూంది. అర్థమవుతూంటే ఆమె మనసు యేదోలాగైపోతోంది.

"అమ్మయ్య—నీ కళ్ళలో కూడా కసి, పగ కనబడుతున్నాయి నాకు—" అంటూ నిట్టూర్చాడతను.

సంధ్య ఉలిక్కిపడింది.

తనకు భర్తమీద కసి....పగ....

"నో....ఆయన చాలా మంచివారు...." అంది సంధ్య వున్నట్లుండి.

"నా చెల్లెలు కూడా అతన్ని గురించి అలాగే అను

కుంది....” అన్నాడతను.

“అనుకుంటే ఏమయింది?”

“నా చెల్లెలు చచ్చిపోయింది....” అన్నాడతను.

సంధ్య అదోలా అతడివంక చూసి—“పిరికివాళ్ళు చచ్చిపోతారు—” అంది.

“మరి ధైర్యవంతులేం చేస్తారు?”

“న్యాయంకోసం పోరాడుతారు....” అని నవ్వింది.

“భయం పిరికివాడి లక్షణం. ధైర్యవంతుడే అయినప్పటికీ గుండె జబ్బున్నవాడికి ఉద్రేకం కలిగించే వార్త చెబితే—గుండె ఆగి మరణించే అవకాశమున్నదని నీకు తెలుసా?”

“ఊఁ” అంది సంధ్య.

“ఆ విషయం తెలిపి ఒకడు ఆ పని చేస్తే!”

“అది హత్య అవుతుంది—” అంది సంధ్య.

“అలాంటి హత్య చేసినవాణ్ణి నరరూప రాక్షసుడని నేనంటే తప్పు అవుతుందా?”

“కాదు—”

“నీ భర్త నరరూపరాక్షసుడు—” అన్నాడతను.

అతడిలాగనడం మొదటిసారి కాదని సంధ్యకు తెలుసు. తన భర్తమీద అతడెలాంటి నేరం మోపబోతున్నాడో చూచాయగా ఆమెకు అర్థమైపోయింది. అయినప్పటికీ—“వివరంగా చెప్పు—” అన్నదామె.

“చెబుతాను—ఎందుకంటే నేను నీ భర్తను చంపుతున్నప్పుడు నువ్వతడిమీద జాలిపడితే నేను సహించలేను” అన్నాడతను.

సంధ్య మాట్లాడలేదు.

2

సుకుమారికి తల్లి లేదు. చిన్నతనంలోనే పోయింది.

తండ్రి రెండో వివాహం చేసుకోలేదు. కానీ ఆయన ప్రవర్తన మారిపోయింది. తనకు మిగిలిన ఇద్దరు పిల్లల విషంలోనూ యేమీ పట్టనట్లుండేవాడాయన. వాళ్ళిద్దరినీ బంధువుల యింట్లో అప్పగించి తను యిష్టం వచ్చినట్లు తిరిగేవాడు. నెలనెలా ఆ బంధువు లింటికి కొంత డబ్బు పంపేవాడు.

బంధువుల యింట్లో సుకుమారి, ఆమె అన్న చంద్రం- ఇద్దరూ బానిసల్లా పెరిగారు. సుకుమారికి పన్నెండేళ్ళ వయ నప్పుడు చంద్రం యిల్లు వదిలి పారిపోయాడు.

సుకుమారి ప్రయివేటుగా మెట్రిక్ ప్యాసైంది. టైపు, షార్టుహాండు నేర్చుకుంది. పద్దెనిమిదో ఏట ఆమె ఉద్యో గంలో ప్రవేశించింది.

జీవితంలో ఆమె ప్రేమకు నోచుకోలేదు. అంతా ఆమెను తిట్టేవారు. ఆమెపై యెన్నో ఆంక్షలు విధించే వారు. అడుగడుగునా అనుమానించేవారు. మాటలతో వేధించేవారు.

బంధువుల యింట్లో ఓ కుర్రా డుండేవాడు. వాడికీ సుకుమారి వయసే వుంటుంది. వాడికి సుకుమారిని చూస్తే ఏదోలా వుండేది.

వాడు చూడ్డానికి వెర్రివెధవలా వుండేవాడు. అంతా వాణ్ణి వెర్రబ్బాయి అనేవారు. వాడికి చదువు వంటబట్టలేదు.

వాడు సుకుమారిని ఏకాంతంలో పట్టేవాడు. తను చెప్పి నట్లు వినమనేవాడు. ఆమె వినేదికాదు. ఫలితంగా వాడామెను అల్లరిపెట్టేవాడు.

అంతా సుకుమారికి వళ్ళు కొవ్వెక్కిందని అనేవారు.

వెర్రబ్బాయిని యెవరూ అనుమానించేవారు కాదు.

వెర్రబ్బాయిదగ్గరే అలా ప్రవర్తించిన మనిషి ఆఫీసులో యింకెలా వుంటుందోనని అంతా అనుమానించేవారు. అయితే వుద్యోగం మానిపించాలని వాళ్ళనుకోలేదు. ఎందుకంటే సుకుమారి జీతంఅంతా ఇంట్లోనే తీసుకుంటున్నారు. రోజూ సుకుమారికి తిట్లు పడుతూండేవి.

సుకుమారికి జీవితం దుర్భరంగా వుంది. అయితే ఆమె బంధువుల యింటి నుంచి పారిపోదల్చుకో లేదు. ఆడది ఒంటరిగా యీ ప్రపంచంలో బ్రతుకలేదని ఆమెకు తెలుసు.

అప్పుడు గిరిధర్ ఆమె జీవితంలో ప్రవేశించాడు.

గిరిధర్ తొలిచూపులోనే ఆమెను ప్రేమించాడు.

ఏదో పనిమీద ఆఫీసుకు వచ్చి ఆమెను చూశాడు. ఆ తర్వాత పని లేకున్నా ఏదో సమయంలో ఆఫీసుకు వచ్చి ఆమెతో మాట్లాడి వెడుతూండేవాడు.

అతడితో మాట్లాడుతూంటే సుకుమారికి చాలా హాయిగా వుండేది. తొలిసారిగా ప్రేమతో కూడిన పలకరింపు ఆమెకు ఎదురయింది.

క్రమంగా వారి ప్రేమ ముదిరింది.

గిరిధర్ ఆమెతో ఏకాంతానికి ప్రయత్నించేవాడు.

సుకుమారి అతణ్ణి పెళ్ళికి ప్రోత్సహించేది.

సుకుమారిని సమాజం అనేక రకాలుగా బాధించి వుండవచ్చు. కానీ ఆమె ఈ సమాజం విధించిన సంప్రదాయాలకు బద్ధురాలు. ఆమె అతడినెప్పుడూ అల్లంత దూరంలో వుంచేది.

ఒకరోజు గిరిధర్ తన తల్లిదండ్రులు చూస్తారన్న నెపంతో ఆమెను ఓ ఏకాంత ప్రదేశానికి తీసుకువెళ్ళాడు.

అక్కడ అత డామెను కాళ్ళావేళ్ళా పడి ప్రాధేయపడి మొత్తంమీద అనుకున్నది సాధించాడు.

అప్పుడు సుకుమారి ఏడ్చింది. అతడామెను బుజ్జగించాడు. తమ పెళ్ళి తప్పక జరుగుతుందన్నాడు.

ఆ విధంగా నెలరోజులు వాళ్ళిద్దరూ భార్యాభర్తల్లా జీవించారు. సుకుమారి యెక్కడికి వెడుతున్నదీ అన్న విషయం బంధువుల యింట్లో ఆరావచ్చింది. ఆమె లెక్క చేయలేదు. గిరిధర్ తనవాడన్న ధైర్యంతో ఆమె అందరికీ ఎదురుతిరిగింది. దాంతో వాళ్ళూ ఆమెనేమీ అనలేక పోయారు.

కానీ—"నువ్వు తప్పడడుగు వేయకూడదనే నీమీద ఆంక్షలు విధిస్తున్నాము. మాకు నీమీద కక్షలేదు. నువ్వు స్వతంత్రించి ఏ నిర్ణయమైనా తీసుకున్నావో—నీ జీవితం బుగ్గిపాలవుతుంది. అప్పుడు నీకు మానుంచి ఏ సహాయమూ వుండదు"—అన్నాడు ఇంటి యజమాని.

అప్పుడు సుకుమారి నవ్వి ఊరుకుంది!

"గిరిధర్ ఎంత మంచివాడు! అతడుండగా నాకేమి లోటు....?" అనుకునే దామె.

అప్పుడు సుకుమారిలో చెప్పుకోదగ్గర మార్పు వచ్చింది. ఆమెలో కొత్త ఉత్సాహం వచ్చింది.

తన జీవితానికో మలుపు వచ్చిందనీ తన కష్టాలు గట్టెక్కనవనీ సుకుమారి నమ్మింది. ఆమె గిరిధర్‌కు పూర్తిగా వశమైపోయింది.

అదే ఆమె వేసిన తప్పటడుగు.

సరిగ్గా నెలరోజుల్లో గిరిధర్‌కు ఆమెపై మోజు తీరిపోయింది. అప్పుడతను తన అసలు రంగు బయటపెట్టాడు.

గిరిధర్‌కు మూడు నెలల క్రితం మంచి సంబంధం

వచ్చిందట. పిల్ల బాగుంది. కట్నం బాగా యిస్తారు.

"మరి నా సంగతేమిటి?" అంది సుకుమారి.

"నీకు తగ్గవాడిని చేసుకుని సుఖంగా వుండు" అన్నాడు గిరిధర్.

"నాకు తగ్గవాడివి నువ్వే!" అంది సుకుమారి.

"నీకు తగ్గవాడిని కాదు నేను. సంధ్యకు తగ్గవాడిని" అన్నాడతను.

నాకూ సంధ్యకూ ఏమిటి తేడా?"

"పెళ్ళికి ముందు మగాడికి లొంగదు సంధ్య" అన్నాడు గిరిధర్.

"పెళ్ళి చేసుకుంటానన్న నమ్మకంతో కదా నీకు నేను లొంగిపోయాను!"

"ఆడది లొంగిపోతుందని తెలిస్తే—ఏ మగాడైనా సరే పెళ్ళి చేసుకుంటాననే అంటాడు" అన్నాడు గిరిధర్.

"నువ్వూ అలాగే అన్నావా?"

"ఊఁ"

"మరి నన్ను పెళ్ళి చేసుకోవా?"

"చేసుకోను."

"అయితే నేను చచ్చిపోతాను" అంది సుకుమారి.

"అది నీ యిష్టం" అన్నాడు గిరిధర్.

"నన్నెందుకిలా మోసం చేశావు?"

"మనిద్దరం కలిసి సుఖపడ్డాం—అందులో మోస మేముంది?"

"గిరీ అలా మాట్లాడకు. నేను నిన్ను మనస్ఫూర్తిగా, హృదయ పూర్వకంగా ప్రేమిస్తున్నాను. నువ్వు లేనిదే బ్రతకలేను."

"నేను నిన్ను ప్రేమించడంలేదు—నువ్వు లేకపోతేనే

నేను బ్రతకగలను" అన్నాడు గిరిధర్.

"గిరీ-నా ప్రేమను భగ్నం చేయకు" అంది సుకుమారి.

నువ్వు నన్ను ప్రేమిస్తూనే వుండిపోతానంటే నాకేమీ అభ్యంతరం లేదు. నీ అందం మాయనంతకాలం—నాకు పెళ్ళయినా సరే—నిన్ను వచ్చి చూసిపోతుంటాను" అన్నాడు గిరిధర్.

"గిరీ!" అరిచింది సుకుమారి.

అంతే! ఆ మర్నాడు సుకుమారి ఆత్మహత్య చేసుకుంది.

ఆ శవం దగ్గరకు వచ్చాడు చంద్రం. జీవితంలో కాస్త స్థిరపడి చెల్లెల్ని తీసుకునిపోదామని వచ్చాడతను.

శవం ఎదురయింది.

కంటికీ మంటికీ ఏకధారగా ఏడ్చాడు చంద్రం.

ఇంట్లో సుకుమారి వ్రాసిన డైరీ లున్నాయి. చంద్రం అవన్నీ చదివాడు. అవే అతడికి మిగిలాయి. అవి చదువు తూంటే అతడి రక్తం మరిగింది.

సుకుమారి బ్రతకాలనే అనుకుంది. అయితే గిరిధర్ ఆమెపై తీసిన దెబ్బ సామాన్యమైనది కాదు.

స్వార్థంతోనయితేనేం గిరిధర్ అంతులేని ప్రేమాను రాగాల నామెకు రుచి చూపించాడు. ఆ మైకంలో ఆమె తన చుట్టూ వున్న ప్రపంచాన్ని మరిచిపోయింది. ఆ మైకం పోగానే ఆమె వాస్తవంలోకి వచ్చింది. ఆ వాస్తవం ఆమెకు భరించ శక్యం కాకుండా వుంది. అందుకే ఆత్మ హత్య చేసుకుంది.

3

"అవును. నా భర్త నరరూప రాక్షసుడు" అంది సంధ్య అప్రయత్నంగా.

"అందుకే అతణ్ణి నేను చంపాలనుకుంటున్నాను— తప్పా?" అన్నాడు చంద్రం.

"లేదు" అంది సంధ్య

సుకుమారి కథ ఆమెను కదిలించింది. ఆమెలో తాత్కాలి కావేశం కలిగించింది.

"అయితే ఈ హత్యలో నాకు సహకరించు" అన్నాడు చంద్రం.

"ఎలా?" అన్నది సంధ్య.

"అన్నంలో విషం కలిపి పెట్టగలవా?" అన్నాడు చంద్రం.

ఊఁ అనబోయి ఆగింది సంధ్య! ఆమె కనుల ముందు ఎన్నో దృశ్యాలు మెదిలాయి. తను నోట్లో ముద్ద పెడితే గానీ భోంచేయనని భీష్మించుకునేవాడు గిరిధర్. తను కలిపి పెడితే-చంటి పిల్లాడిలాగా మారాంచేస్తూ తినేవాడు.

అతడికి తను విషం కలిపిపెట్టగలదా?

క్రమంగా ఆమె బుద్ధి పని చేయసాగింది.

ఈ చంద్రం నిజమే చెబుతున్నాడా?

అతడామె వంక నవ్వుతూ చూసి "నీవల్ల కాదుకదూ- నాకు తెలుసు" అన్నాడు.

"నువ్వు ఆయనకూ, నాకూ మధ్య స్పర్థ పెంచడానికి ప్రయత్నిస్తున్నావని నా అనుమానం" అంది సంధ్య.

"ఫోటో చూశావు. మా యింటి అడ్రసిస్తాను. నా చెల్లెలు సుకుమారి నిన్న పోయిందో, లేదో వెళ్ళి తెలుసు కుందువుగాని...."

"నా కా అవసరంలేదు...."

"నిన్ను నమ్మించాల్సిన అవసరం నాకూ లేదు—" అన్నాడతను.

సంధ్య అతడివంక అదోలా చూసి—"ఆయన్ను వదలిపెట్టు—" అంది.

"ఎందుకని?"

"ఇతరత్రా ఎలా ప్రవర్తించేవారో నాకు తెలియదు. ఆయన నా వద్ద నరరూపరాక్షసుడిలా ప్రవర్తించలేదు. ఆయనంటే నాకెంతో యిష్టం. ఇందాకా నువ్వు చెప్పిన కథ తాత్కాలికంగా నాలో ఆవేశం రగిల్చినప్పటికీ—నాలో యిప్పుడు వివేకం మేల్కొంది—" అంది సంధ్య.

"అయితే ఏమంటావ్!"

"ఆయనెలాంటివారైనా నాకు ఫరవాలేదు. ఆయన నిజంగా నరరూప రాక్షసుడే అయితే యీ రోజు నుంచీ ప్రయత్నించి ఆయన్ను మామూలు మనిషిగా చేస్తాను. జీవితమంటే నాకు యెంతో ఆకర్షణ కలిగించి, దాంపత్య జీవనంలోని తీపిని రుచి చూపించిన ఆయనంటే నాకెంతో యిష్టం. ఆయన్ను నేను చంపుకోలేను. ఎవరైనా చంపుతానంటే సహకరించలేను—" అంది సంధ్య.

చంద్రం మాట్లాడలేదు.

"ప్లీజ్—నేనే నీ చెల్లిననుకుని ఆయన్ను వదిలిపెట్టు—" అంది సంధ్య.

"నువ్వు నా చెల్లివనుకునేందుకు అభ్యంతరంలేదు. నీ ఆయన్ను వదలిపెట్టడానికి మాత్రం అభ్యంతరమే!" అన్నాడు చంద్రం.

సంధ్య అతణ్ణి బ్రతిమలాడసాగింది. గిరిధర్‌లో వున్న మంచి లక్షణాలు తన అనుభవంలోనికి వచ్చినవన్నీ చెప్పి "ఆయనలోని రాక్షసత్వం నాకు అనుభవంలోకి రాలేదు. అయినప్పటికీ ఆయన్ను మామూలు మనిషిని చేయగలనన్న నమ్మకం నాకుంది—" అంది.

చంద్రం మాట్లాడకుండా తన ముందున్న బ్రీఫ్‌కేస్ తెరిచి—ఆమె కో చిన్న మూట యిచ్చాడు.

"ఆ మూట విప్పి—మనిషిని చేయి—" అన్నాడతను.

సంధ్యకు అతడి మాటల కర్థం తెలియలేదు. అయినా వేరే ప్రశ్న వేయకుండా ఆమె ఆ మూటను విప్పి ఉలిక్కి-పడింది.

అందులో చిట్టి చిట్టి ఎముకలు, వేళ్ళు, గోళ్ళు.... వగైరా లున్నాయి.

"ఏమిటివి?" అంది సంధ్య.

"మనిషికి సంబంధించిన విడిభాగాలు. అవన్నీ ఉపయోగించి మనిషిని తయారుచేయొచ్చు. నువ్వు ప్రయత్నించు" అన్నాడు చంద్రం.

సంధ్య ప్రయత్నించింది కానీ ఆమె వల్లకాలేదు.

"మనిషిని మనిషి చేయలేవుగానీ రాక్షసుణ్ణి మనిషిని చేస్తావా?" అని నవ్వాడు చంద్రం.

సంధ్య యిబ్బందిగా నవ్వి"నువ్వు చేయి చూద్దాం—" అన్నది.

"ఎందుకు?"

"మనిషిని మనిషిగా చేయడం నేర్చుకుంటాను—"

చంద్రం వెంటనే ప్రారంభించి అయిదు నిమిషాల్లో బొమ్మను తయారు చేశాడు. సంధ్య అతడెలా ఫిట్ చేస్తున్నాడో శ్రద్ధగా గమనించింది.

ఆ బొమ్మ అచ్చం మనిషికివలెనే వున్నది.

ముందతడు ఎముకలను ఒకదానితో ఒకటి గుచ్చి అస్థిపంజరాన్ని తయారుచేశాడు. ఆ పైన హృదయం. ఊపిరితిత్తులు, కండరాలు బిగించాడు. చర్మపు రంగులో వున్న

ఒక యెలాస్టిక్ కవర్‌తో—మనిషి బొమ్మ తయారయింది.

"మనిషిని మనిషిగాచేయడం తెలిసిందా?"అన్నాడతను.

"ఊఁ" అన్నదామె పట్టుదలగా.

"అయితే చూడు. ఈ మనిషిని నేను ఒక్కో భాగామే విడిగా తీపి మూటకట్టి నీకు యిస్తాను ..." అంటూ అతను ఆ బొమ్మకు ముందు గోళ్ళూడపెరికాడు. తర్వాత వేళ్లూడ పెరికాడు. ఆ పైన ముక్కూ, చెవులు తీసేశాడు. అలా ఆ బొమ్మను పూర్తిగా విడిభాగాలు చేసి మూటకట్టి ఆమె ముందుపెట్టి "మనిషిని చేయి—చూస్తాను—"అన్నాడు.

"నాకు వచ్చు. కానీ చేయను—" అన్నదామె.

"నీకర్మ-నేర్చుకోకపోతే నీకే ప్రమాదం"అన్నాడతను.

"ఏం?"

"ఇప్పుడిక్కడికి నీ భర్త రాగానే ముందు గోళ్ళు తీసేస్తాను. అప్పుడు ముక్కూ, చెవులు, కళ్ళు...."

అతడింకా చెబుతూండగానే కెవ్వున కేకపెట్టింది సంధ్య.

"నువ్వెప్పుడు అతన్ని మనిషిని చేయాలి—అందుకని యిప్పట్నించీ ప్రాక్టీసు చెయ్యి—" అన్నాడు చంద్రం క్రూరంగా నవ్వుతూ.

సంధ్య కా మాటలు వినబడ్డంలేదు. భర్త పడే దారుణ మరణవేదన ఆమె కనుల ముందు దృశ్యంగా కదలాడుతున్నది.

"ప్లీజ్....ప్లీజ్....ఆయన్ను చంపాలనుకుంటే ఒక్క కత్తిపోటుతో చంపేసేయ్.కానీ ఇలా క్రూరంగా హింసించవద్దు .." అన్నదామె.

"చూశావా—అప్పుడే నీలో యెంత మంచి మార్పు తీసుకుని వచ్చానో—ఇంతవరకూ నీ భర్తను చంపవద్దన్నావ్. ఇప్పుడు ఒక్క కత్తిపోటుతో చంపమంటు

న్నావ్—....” అన్నాడతను.

“భగవంతుడా-నువ్వే ఆయన్ని హింసాకాండకు గురి కాకుండా రక్షించాలి—” అంది సంధ్య ఏడుపుగొంతుతో.

“భగవంతుడంటూ వుంటే నీ భర్తను క్షమించడు. నీ ప్రార్థనను మన్నించడు” అన్నాడు చంద్రం.

“ప్రపంచంలో ప్రతి ఒక్కడూ యేదో తప్పు చేస్తూనే వుంటాడు. శివుడి ఆజ్ఞలేనిదే చీమైనా కుట్టదంటారు. నా భర్త శివుడి ఆజ్ఞమీదనే తప్పుచేసి వుంటాడు—” అంది సంధ్య.

“నేనూ శివుడి ఆజ్ఞ మీదనే వచ్చాను—” అన్నాడతను.

“శివుడా—నీ ఆజ్ఞ యేమిటి?” అని ఆక్రోశించింది సంధ్య.

4

కాలింగ్ బెల్ మ్రోగింది.

“నువ్విక్కడే వుండు-కదలకు—”అన్నాడు చంద్రం.

“కదుల్తాను—” అంది సంధ్య.

చంద్రం గది గుమ్మంవద్ద ఓ చిన్న పరికరం పెట్టాడు.

“ఇప్పుడు గది దాటావంటే షాక్ కొడుతుంది—ఇది లక్ష్మణరేఖ—....” అంటూ వెళ్ళి వీధి తలుపు తీశాడు.

సంధ్య గది గుమ్మంవైపూ, వీధి గుమ్మంవైపూ మార్చి మార్చి చూస్తున్నది.

ఇప్పుడేం జరుగుతుంది?

గిరిధర్ కీ విషాదయోగం తప్పదా?

తలుపులు తెరుచుకున్నాయి.

సంధ్యకు భయంవేసి కళ్ళు గట్టిగా మూసుకుంది.

చేజేతులా తనతణ్ణి పులిబోనులోకి ఆహ్వానించింది.

ఇప్పుడెలా?

ఆమె వెనువెంటనే కళ్ళు తెరవలేదు.

ఆమె కళ్ళు తెరిచేసరికి యెదురుగా యిద్దరు మనుష లున్నారు. వారిలో చంద్రంలేడు. ఆమె భర్త గిరిధర్ లేడు.

"తలుపు తీసినతను ఏడీ?" అన్నదామె.

"అతను వెళ్ళిపోయాడు—" అన్నా డో వ్యక్తి.

సంధ్య అప్రయత్నంగా గది గుమ్మంవంక చూసింది. ఇందాక అతడుంచిన పరికరం అక్కడ లేదు. అతను తెచ్చిన ఎముకల మూట మాత్రం గదిలోనే వున్నది.

"ఆయనేరీ?"

"ఆయనంటే...."

"నా భర్త...."

ఆ వ్యక్తి బాధగా ఆమెవంక చూసి—నన్ను మన్నించా లమ్మా—" అన్నాడు.

సంధ్యకు అర్థంకాలేదు.

"అతడికి అన్నీ చెప్పాను. అతడు నీకు చెప్పమని వెళ్ళిపోయాడు—"

సంధ్య వింటోంది.

"నీ భర్త హడావుడిగా రోడ్డు దాటుతూ నా కారుక్రింద పడ్డాడు. అప్పటికీ సడెన్ బ్రేక్ వేశాను...." ఆ వ్యక్తి మాట సగంలో ఆపాడు.

పక్కనున్న రెండో వ్యక్తి—"అది మా దురదృష్టం. అతను యిలా పడ్డం—అలా ప్రాణం పోవడం జరి గింది...." అన్నాడు.

"ఈ వార్త నీకెలా అందజేయాలా అని బాధపడు తున్నాను....శవం హాస్పిటల్లో వుంది...."

సంధ్య చటుక్కున రెండడుగులు ముందుకు వేసి, చటుక్కున వంగి ఆ వ్యక్తి పాదాలు స్పృశించి "బాబూ—

మీరు నాకూ, నా భర్తకూ చేసిన వుపకారం ఈ జన్మకు మరిచిపోలేను—" అంది. ఆమె కన్నీళ్ళతో అతడి పాదాలు తడిశాయి.

అతడాశ్చర్యపోయాడు. ఆమె భావం అర్థంకాలేదు. అతను పోవడం వుపకారమెలాగవుతుంది? అయినపక్షంలో ఆమె ఏడ్వడ మెందుకు?

అతను గదిలో చుట్టూ చూశాడు.

ఆమె ఎన్ని తిట్టినా భరించాలనీ, ఆమెకు శక్తికొద్దీ సాయపడాలనీ అతను వచ్చాడు. కాని ఆమె అతడినేమీ అనడంలేదు.

గదిలో చంద్రం వదిలిపోయిన మూటను అతను చూశాడు. అది సంధ్య ఆలోచనలపై చూపిన ప్రభావం అని మాత్రం అతడికి తెలియదు. □



దొంగను చూచి బెదరకు

కె. వి. రమణ

దిక్కులు అదిరేలా కూతవేస్తూ శరవేగంతో ముందుకు సాగిపోతోంది ఎక్స్‌ప్రెస్ రైలు. ప్రయాణీకులందరూ దాదాపు నిద్రావస్థలో వుయ్యాల లూగుతున్నారు.

ఆ కంపార్టుమెంటు కంతటికీ కనులు మూయనిది చలపతి ఒక్కడే. అతడికి రైలు చాలా నెమ్మదిగా నత్త నడకలు నడుస్తున్నట్టుగా వుంది.

"దరిద్రగొట్టు దేశం, ఎప్పటిలానే వుంది. ఏ మాత్రం

మార్పు లేదు" తనలో తనే విసుక్కున్నాడు చలపతి.

చలపతి మాటలకు వులిక్కి పడుతూ నిద్ర లేచిన ప్రక్కవాడు అటూ యిటూ చూసి నిద్రలోకి జారుకున్నాడు.

చలపతి మాటల్నిబట్టి అతడు ఏ విదేశాల నుండో దిగి వస్తున్నాడని యెవరైనా భావిస్తే అది పొరపాటే! ఎందుకనంటే, ఆరేళ్ళుగా అతడు రాజమండ్రి సెంట్రల్ జైల్లో విశ్రాంతి పొంది, రెండ్రోజుల క్రితమే జైలునుండి విడుదలయ్యాడు.

చలపతి మాటిమాటికీ పళ్ళు కొరుకుతున్నాడు. వేళ్ళు నొప్పిపుట్టేలా ఆవేశంతో పిడికిలి బిగిస్తున్నాడు. చలపతి రాజమండ్రిలోనే ఆరంగుళాల పిడి బాకు సంపాయించాడు.

"వైజాగులో దిగుతూనే ఆ వంచకిని కత్తితో కసిదీరా పొడిచి పారెయ్యాలి. లేకపోతే పగటి దొంగతనాలలో ఆరితేరి సాటివారిలో దొంగరాముడుగా పేరుపడ్డ తనను, ఆఫ్టరాల్ ఒక ఆడది, అందునా ఇరవయ్యేళ్ళున్నా నిండని ఆడది దద్దమ్మను చేసి జైలుకు పంపుతుందా!" చలపతి మనసు కుతకుతలాడిపోతోంది.

"అది సరేలేవోయ్! ఆ అమ్మాయి యింకా ఆరేళ్ళూ ఆ యింట్లోనే వుంటుందన్న గ్యారంటీ ఏమిటి?" సందేహం వెలిబుచ్చింది చలపతి రెండో మనసు.

"నువ్వు నోర్ముయ్! అసలిదంతా నీ మూలానే! దొంగతనానికి వెళ్ళినవాడిని అదే పనిమీద తిరిగి రానివ్వకుండా ఆ పిల్ల వలలో పడేట్టు చేశావు. ఇన్నేళ్ళు జైలుపాలు చేశావు. ఒకటా రెండా ఆరేళ్ళు! ఆ యింట్లో లేకపోతే మరో యింట్లో! ఎక్కడున్నా వెదుకుతాను. దాని చావు నా చేతిలో రాసివుంది" చలపతి రెండో మనసును విసిరి

కొట్టింది అసలు మనసు. రెండో మనసు కిక్కురు మన లేదు.

చలపతి జ్ఞాపకాలు ఆరేళ్ళ వెనక్కు మళ్ళాయి!

* * *

సాయంత్రం ఆరు గంటలయేందుకు యింకా ఇరవై నిముషా లుంది.

సరిగ్గా ఆరయ్యేసరికి భర్త ఇంటికొచ్చేస్తాడు. సుధాకర్ ఇంటికి వచ్చేవేళకు యిల్లంతా అద్దంలా వుండాలి. లేక పోతే తిరతాడు.

రాధ హడావుడిగా యిల్లంతా సర్దుతోంది. ఇంతలోనే తలుపుమీద చప్పుడు!

ఆశ్చర్యంగా గోడగడియారం చూపింది రాధ. ఐదూ నలభై నిముషాలయింది. 'ఎన్నడూ లేనిది ఇవాళ తొందరగా వచ్చేశారే! ఎవరి మొహం చూశానో యేమో చీవాట్లు తప్పవు.' అనుకుంటూనే తలుపు తీపింది రాధ.

చిరునవ్వుతో ఆరడుగుల గుమ్మానికి సరిపడే ఎత్తులో అగుపించాల్సిన భర్తకు బదులు, క్రూరమైన చూపులతో ఐదున్నర అడుగుల ఎత్తున నల్లని యువకుడు దర్శనమిచ్చాడు.

"ఎవరు మీరు? ఏం కావాలి?" అని రాధ అడిగేంతలో ఆ యువకుడు రాధను నెట్టుకుంటూ దూకుడుగా లోనికి ప్రవేశించి తలుపు గడియవేశాడు. వూహించని యీ పరిణామం రాధను నిశ్చేష్టురాలిని చేసింది.

"అరవకు? అరిస్తే చస్తావ్! మర్యాదగా యింట్లో వున్న నగా నట్రా పట్రా!" అరిచా డా యువకుడు కర్కశంగా.

రాధకు పరిస్థితి అర్థమయింది. వీడెవడో పగటి దొంగ.

ఇరుగూ పొరుగూ లేని యిల్లు తమది. అరచినా ప్రయో జనం వుండదు. అన్నీ తెలుసుకొనే వీడు యింట్లో ప్రవే శించాడు. ఓరగా గోడగడియారంవంక చూసింది రాధ. ఆరుకి పావు తక్కువ.

భర్త కరక్టు సైముకే వస్తాడు. తనే తొందరపడి తలుపు తీసేసింది. వూళ్ళో దొంగతనాలు జోరుగా వున్నాయి. ఎవరు పిలిచినా కిటికీలో నుండి చూసిన తరవాతనే తలుపు తియ్! అంటూ సుధాకర్ డ్యూటీకి పోతూ రాధను రోజూ హెచ్చరిస్తాడు కూడా! అయిందేదో అయింది. వీణ్ణి యేదోలా ఒక పదిహేను నిముషాలు ఆపాలి. యెలా?

రాధ చిరునవ్వుతో అతణ్ణి చూసింది. శృంగార కథా నాయికలా వయ్యారంగా నిలుచుని "ఇంతా చేసి నువ్వు దొంగవా? భలేవాడివే. నే నింకా కాలేజీ కుర్రాడివేమోనని కంగారు పడిపోయాను. ఈ కాలేజీ కుర్రాళ్ళు ఈ మధ్య ఒంటరి యిళ్ళలో దూరి అల్లరి చేయడం మొదలుపెట్టార్లే! అయినా ఏం సుఖం వాళ్ళలో అల్లరి తప్ప అసలేమీ వుండదు" అన్నది కొంటెగా.

రాధ వాళ్ళున్న యింటికి కొద్ది దూరంలో ఓ కాలేజీ వుంది. తనను కాలేజీ కుర్రాణ్ణి చేసి ఒక యువతి మాట్లాడి నందుకు ఆ యువదొంగ ఆనందంతో తబ్బిబ్బయ్యాడు. తను వచ్చిన సంగతి మరచి రాధను ఎగాదిగా చూశాడు. ఇరవై ఏళ్ళ వయసులో బంగారుపూత పూసిన పంచకళ్యాణిలా వుంది. చూసేకొద్దీ నరాలు జివ్వుమంటున్నాయి.

"అలా వూరికే ఎంతసేపని చూస్తావ్! ముందు ఆ కుర్చీలో కూర్చో. నీతో చాలా మాట్లాడాలి ఇంతకూ నీ పేరేంటి?" అన్నది రాధ.

మంత్రముగ్ధుడిలా కుర్చీలో కూర్చుంటూ గొంతు

పెగల్చుకొని "చలపతి" అన్నాడు.

రాధ కిలకిల లాడుతూ "ఆ పేరంటే నా కెంతో ఇష్టం. నీకు నగా నట్రాయేనా యింకా యేమైనా కావాల్నా?" బద్ధ కంగా ఒళ్ళు విరుస్తూ అన్నది రాధ.

చలపతి ముసలాడేం కాడు. ఇరవై యెనిమిదేళ్ళ యువ కుడు. అరవై యేళ్ళవాడినే పిచ్చివాణ్ణి చేయగల రాధ యవ్వనపరువాలు ఇరవైలలో వున్న చలపతిని వుర్రూత లూగిస్తున్నాయి.

రాధ తనతో మాట్లాడుతూనే గోడగడియారం వంకా రోడ్డుకు ఎదురుగా వున్న ఒక కిటికీ వంకా మార్చి మార్చి చూడడం చలపతి గ్రహించగలిగే స్థితిలో లేదు.

రాధ చలపతికి నమ్మకంగా చాలా విషయాలు చెప్పింది. సుధాకర్‌తో ఆమెకు పెళ్ళయి ఏడాదే అయింది. సుధాకర్ అందగాడే! ఒడ్డూ పొడుగూ వున్నవాడే! అయితే యేం లాభం? అతని మూలంగా ఆమెకు ఏ మాత్రం సుఖం లేదు. ఇన్నాళ్ళూ సరయిన అవకాశంకోసం ఎదురుచూస్తూ కాలం గడుపుతున్నది. ఇన్నాళ్ళకు చలపతిలాంటి తోడు దొరికి నందుకు రాధ ఎంతో సంతోషించింది.

"డబ్బూ నగలూ పట్టుకొచ్చేస్తాను. ఎటన్నా పోయి హాయిగా బ్రతుకుదాం. ఏం? నీ కిష్టమేనా?" చలపతిని అడి గింది రాధ.

చలపతి ఆనందానికి పగ్గాల్లేవు. "ఐస్‌క్రీంలాంటి పిల్ల! దానికి తోడు డబ్బూ నగలూనూ! ఎవడికి చేదు? అనుభ వించినన్నాళ్ళూ హాయిగా అనుభవించి, డబ్బూ నగలూ చేజిక్కించుకుని దీన్ని ఏ కంపెనీకో అప్పగించి పోవచ్చు పేరున్న ఏ సుబ్బమ్మ కంపెనీలాంటి వాటికి చేరేస్తే, గుంట పాలకోవాలా వుందేమో పదివేలన్నా ఇచ్చి కొంటారు,"

ఇదీ చలపతి ఆలోచన.

టైము ఆరు కావస్తోంది. "నేను డబ్బూ నగలూ పట్టు కొస్తాను" అని చెప్పి రాధ వెనక గదుల్లోకి ప్రవేశించింది. రెండే నిముషాల్లో చేతిలో చిన్న మూటతో తిరిగివస్తూ కిటికీలో నుండి రోడ్డుపైకి చూసింది.

ఆ సరికి టైము సరిగ్గా ఆరుగంట లయింది. రోడ్డుపై ఆరడుగుల విగ్రహం హుషారుగా అడుగులు వేస్తూ తమ యింటివేపు రావడం రాధ కిటికీలో నుండి చూడగలిగింది.

"నువ్విక్కడే నిలుచో! నేను తలుపుతీసి తెలిసినవా ళ్ళెవరయినా పైన తిరుగుతున్నారేమో చూస్తాను" అన్నది రాధ. చలపతి అమాయకుడిలా తలూపాడు.

రాధ నెమ్మగా తలుపు తెరచి చటుక్కున పైకిపోయి తలుపు గడియ వేసేసింది.

చలపతికి బయట ఏవేవో కేకలూ హడావుడులా విని పించాయి. తాను మోసపోయానని చలపతి తెలుసుకునేసరికి సుధాకర్‌తోబాటు చాలామంది ఆ యింటిలో ప్రవేశించి చలపతిని బంధించడం జరిగింది.

చలపతికి పాతనేరాలతో బాటు ఆరేళ్ళ కఠిన కారాగార శిక్ష పడింది.

* * *

గతం గుర్తుకురాగా చలపతిలో ఆవేశం పెల్లుబికింది. "ఒసేవ్! నీ అంతు చూస్తాను" అంటూ పిడికిలి బిగించి చేతిని ప్రక్కకు విసిరాడు. ఆ పోటు ప్రక్కనే కునికిపాట్లు పడుతున్న ప్రయాణికుణ్ణి తాకింది.

ఆ ప్రయాణీకుడు కుయ్యో మొర్రో అంటూ "ఏం టయ్యా! ఇందాకణ్ణుంచీ చూస్తున్నాను నీ సంగతి" అన్నాడు.

చలపతి ఈ లోకంలోపడి అతణ్ణి తప్పయిందని బ్రతి మాలి ఓదార్చాడు. మామూలుగాఅయితే ఇటువంటి పోట్లాట లకు చలపతి ఏం బెదిరే రకంకాదు. కానీ యిప్పటి పరిస్థితి అదికాదు. తాను తొందరపడి తిరిగి జైలుకు పోయే ప్రమాదం తెచ్చుకోకూడదు. తన శపథం నెరవేరేవరకూ తాను చాలా జాగ్రత్తగా వుండాలని మనసులో అను కున్నాడు చలపతి.

రైలు దిగుతూనే తను మొదట మోసపోయిన రాధ యింటి పరిసరాలలో తచ్చాడాడు చలపతి. ఆ ప్రాంతం యిప్పుడు మునుపటిలా లేదు. కొత్తగా చాలా యిళ్లు వెలి శాయి.

రాధను అదే యింట్లో చూసి వుప్పొంగిపోయాడు చలపతి. ఆమెకు యిప్పుడు యిద్దరు పిల్లలు కూడానూ. అయితే యేం! ఆమెలో ఆకర్షణ యింకా పెరిగిందే గాని తరగలేదు. 'ఈ తళుకుబెలుకులు ఇంకెన్నాళ్ళులే!' అని మనసులో అనుకొని పళ్ళు కొరికాడు చలపతి.

రాధ భర్త ప్రతిరోజూ రాత్రి సరిగ్గా తొమ్మిదింటికి అలసీసొలసీ వస్తూండడం చలపతి గమనించాడు. "గురుడు ఓవర్‌టైమ్ చేస్తున్నట్టున్నాడు. ఇదీ మన మంచికే!" అను కొన్నాడు చలపతి.

మర్నాడు రాత్రి ఏడు కావస్తుండగా చడీచప్పుడు లేకుండా రాధ యింటి తలుపు తట్టేందుకు తలుపుమీద చేయి వేశాడు చలపతి. తలుపులు లోనగడియ వేసిలేదేమో నెమ్మదిగా తెరుచుకొన్నాయి. పరిస్థితు లన్నీ తనకు అను కూలిస్తూ వుండడంతో సంబరపడిపోతూ చలపతి లోనికి ప్రవేశించాడు.

పిల్లల్ని అప్పుడే నిద్రపుచ్చి తలుపులు గడియవేసేందుకు

అటుగా వస్తున్న రాధ, మాటామంతీ లేకుండా యింట్లో దూరి తలుపులు మూసి తనవేపుకు తిరిగిన వ్యక్తిని చూసి నిర్ఘాంతపోయింది. అతని చేతిలోవున్న ఆరంగుళాల పిడి బాకు లైటుకాంతిలో తళతళ లాడుతోంది.

కొద్ది క్షణాల్లోనే చలపతిని రాధ గుర్తించగలిగింది. చలపతి కళ్ళనిండా ద్వేషం, పగ, కసి అన్నీ కలసి నాట్యం చేస్తున్నాయి.

చలపతి ఒక్కొక్క అడుగే ముందుకేస్తూ "వగలాడీ! ఆ నాడు నాలో ఆశలు రగిల్చి సెగలు రేపి మోసంచేస్తావుటే! నిన్ను కసితీరా అనుభవించి, ఆనక నీ శరీరాన్ని ముక్కలు ముక్కలుచేసి నీ రక్తంలో స్నానం చేస్తాను!" అన్నాడు క్రూరంగా.

రాధ, చలపతి వుగ్రరూపాన్ని చూసి వెనక్కి తగ్గిపోలేదు. చలపతిని ప్రేమగా చూస్తూ జలజలా కన్నీరు కార్చసాగింది. "చలపతీ! మీ మగాళ్ళెప్పుడూ యింతే! ఆవేశం యెక్కువ ఆలోచన తక్కువ" అన్నది రాధ వణికే స్వరంతో.

చలపతి అడుగులు అక్కడే ఆగిపోయాయి. అయినా అతని మొహంలో ప్రస్ఫుటిస్తున్న అరుణఛాయలు అణగారిపోలేదు. "ఏం ఇదొక నాటకమా? ఈసారి చలపతి మోసపోడు" అన్నాడు కర్కశంగా.

రాధ విషాదంగా నవ్వింది. "చలపతీ! నీకు అంతే తెలుసు. ఆడదాని మనసు మీ మగవారికి ఏనాటికీ అర్థం కాదు. ఆనాడు నువ్వు పట్టుబడి పోయినప్పుడు నేను మనసులో యెంత కుమిలిపోయానో మాటలతో నీ కెలా చెప్పను?"

"మాటలతో చెప్పలేకపోయినా చేతలతో చూపించావుగా

ఆరేళ్లు రాజమండ్రి సెంట్రల్ జైలులో తోయించి? ఆనాడు నన్ను గదిలో వుంచి తెలివిగా నీ భర్తకు అప్పగించింది నామీద గల ప్రేమతోనే కదూ!" వెటకారం ధ్వనించింది చలపతి గొంతులో.

"మరేం చేయను? సమయానికి శనిగ్రహంలా వూహించని రీతిలో నా భర్త వచ్చేశాడు. చేతిలో నగల మూట, గదిలో నువ్వు. నిన్ను యెవరని అతనికి పరిచయంచేసేది? అసలే అతనికి అనుమానం జాస్తి. చేతకానివాడికి అనుమానాలు ఎక్కువే కదా! ఆ స్థితిలో నేనేం చేయాలో నువ్వే చెప్పు!" నిలదీసింది రాధ.

చలపతి ఒక్కసారిగా ఆలోచనలో పడ్డాడు. ఇన్నాళ్ళూ తను ఆ దృష్టిలో ఏనాడూ ఆలోచించలేదు.

నిజమే! ఇటువంటి సంఘటనలను తాను యెన్నో సినిమాలలో చూశాడు. భర్తవలన సరదాలు తీరని స్త్రీ ఏ యువకుణ్ణో ఆహ్వానించి తన కోరికలు తీర్చుకొంటుంది. ఆటువంటి సమయంలో అనుకోని రీతిలో ఆమె భర్త యింటికి రావడం జరుగుతుంది. ఆ స్థితిలో భర్త తన శీలాన్ని శంకించకుండా వుండేందుకు, అప్పటివరకూ ఆ మగవాడి చేతుల్లో మనఃపూర్వకంగా తిరిగిన ఆ స్త్రీ, వీడు నన్ను బలవంతం చేస్తున్నాడంటూ కేకలువేస్తూ మహాపతివ్రతలా భర్త కాళ్ళను చుట్టేస్తుంది.

చలపతి బుర్రలో సినిమాలలో జరిగే అటువంటి సంఘటనలు ఒక్కసారిగా గిర్రుమన్నాయి.

చలపతి పూగిసలాటను గుర్తించిన రాధ ఇదే అదనుగా భావించి మరొక్క బాణం విసిరింది. "చలపతీ! ఇన్నేళ్లూ నిన్ను నేను మరచిపోలేదనడానికి నీ పేరు గుర్తుంచుకోవ

దమే అందుకు రుజువు."

ఆ దెబ్బతో చలపతి ఒక నిశ్చయానికి వచ్చేస్తూ కత్తి జేబులో వేసుకున్నాడు. "మరయితే ఆనాటి మాట ప్రకారం ఈ క్షణంలో నాతో వచ్చెయ్యగలవా?" అన్నాడు చలపతి.

చలపతి చేతిలో వున్న కత్తి జేబులోకి పోవడంతో "హమ్మయ్య!" అని మనసులో నిట్టూర్చి "ఎందుకు రానూ అనాడూ ఈనాడూ నాది ఒకే మాట" అన్నది రాధ నమ్మకంగా.

చలపతి కుర్చీలో కూలబడుతూ "అయితే బయల్దేరు మరి, మీ ఆయన రాకమునుపే" అన్నాడు.

రాధ సమ్మోహనంగా నవ్వి "అలాగే" అంది.

చలపతి కళ్ళు నులుముకొంటూ కుర్చీకి జారబడ్డాడు. రాధ వంటింట్లో నుండి, ట్రేలో రెండు పెద్దసైజు స్టీలు గ్లాసులూ, ఒక పాత్రనిండా పాలూ తీసుకొచ్చింది.

"ఇవన్నీ ఏమిటి? మనం వెంటనే పోవాలి" చిరాకు పడ్డాడు చలపతి.

"అంత తొందరెందుకు? ఆయన తొమ్మిదిదాకా రాడు. పాలు ఎప్పట్నుండో మరిగిపోతున్నాయి. తిరిగి మన ప్రయాణంలో ఎప్పుడు తింటామో ఏమో! అంతవరకూ కాస్తంత ఆధారం" అంటూ పాత్రలోని పాలను గ్లాసుల్లోకి వంచింది రాధ. చలపతికి ఒక గ్లాసు అందించి, తనొక గ్లాసు తీసుకుంది.

చలపతికి అప్పటికే ఆకలి మండిపోతోంది. మరింకేం మాట్లాడకుండా రాధ యిచ్చిన పాలగ్లాసు అందుకొన్నాడు.

పాలను చప్పరిస్తూ "ఇలా వున్నాయేంటీ?" అనుమా

నంగా అన్నాడు చలపతి.

"పిల్లలిద్దరికీ పడుకోబోయే ముందు వీనితోనే గ్లూకోజ్ యిచ్చాను. ఆ వాసన ఏవన్నావుందో ఏమో! నువ్వూ నేనూ ఒకే పాత్రలోని పాలను త్రాగుతున్నాం. నీకు మరీ భయమైతే ఆ గ్లాసు యిలా యిచ్చి నా గ్లాసు తీసుకో—"అంటూ తను త్రాగుతున్న పాలగ్లాసును చలపతి కివ్వబోయింది రాధ చిరుకోపం అభినయిస్తూ.

చలపతి నవ్వేస్తూ "వూరకే అన్నాను. రాణీగారికి అంతలోనే అంత కోపమయితే ఎలా?" అంటూ గ్లాసులోని పాలన్నీ గుక్క తిప్పకుండా తాగేసాడు.

లేచి గ్లాసులు తీస్తూ "రెండే రెండు నిముషాల్లో అన్నీ సర్దేస్తాను. నువ్వలా కూర్చో" అని చెప్పి వెనక గదుల్లోకి నడిచింది రాధ.

పెట్టెలు సర్దుతున్నట్టుగా చప్పుళ్ళు వినిపిస్తున్నాయి. రెండు నిముషాలన్నదల్లా ఐదునిముషా లయింది.

చలపతికి ఒకవంక కళ్ళు మూసుకుపోతున్నాయి. ఎంత ప్రయత్నించినా నిద్ర ఆగడంలేదు. ఒకే ఆవులింతలు. "వెధవది నాలుగైదు రోజులుగా నిద్రలేని సంగతి ఇప్పుడు తెలుస్తోంది" అనుకొంటూ కుర్చీకి అలా జారబడ్డాడు చలపతి. అంతే! మరి లేవలేదిక చలపతి!

రాధ నెమ్మదిగా గది గుమ్మం నుండి తొంగి చూసేసరికి చలపతి ఏనుగులు తొక్కినా లేవలేని నిద్రలో వున్నాడు.

రాధ విజయగర్వంతో యిరుగు పొరుగువారిని పిలిచేందుకు బయటకు నడిచింది ధీమాగా. ప్రళయం ముంచుకు వచ్చినా పాలలో కలిపిన నిద్ర మాత్రల ప్రభావం వలన

ఆరేడు గంటలవరకూ చలపతి మరి లేవలేడని ఆమెకు తెలుసు.

ఈ సంఘటనకు ఐదారు రోజుల ముందు రాధను చూసేందుకని ఆమెకు మేనమామగారైన దశరథరామయ్య రాధ యింటికి రావడం జరిగింది. దశరథరామయ్యగారికి ప్రతిరోజూ రాత్రిపూట రెండు నిద్రమాత్రలు పడందే నిద్రరాదు. ఆ కారణంగా నిద్ర మాత్రల డబ్బా అహర్నిశలూ అతని వెంట వుండాల్సిందే.

రాధని చూసి వెళ్ళిన దశరథరామయ్యగారు తన నిద్ర మాత్రల డబ్బాను రాధ యింట్లో మరచిపోయారు. అవి పిల్లల చేతిలో పడితే ప్రమాదమని, వాటిని ఎటన్నా పారేయాలని అనుకుంటూనే బద్ధకించేసింది రాధ. ఆ మాత్రలే వూహించని రీతిలో రాధ ప్రాణాలను కాపాడాయి.

ట్రేలో రెండు స్టీలుగ్లాసులు వుంచి, ఒకదానిలో చేతికి దొరికినన్ని నిద్రమాత్రలను పొడిచేసి చలపతి ఎదురుగా ఖాళీగ్లాసులతో వచ్చింది రాధ. మాత్రల పొడి స్టీలు గ్లాసు అడుగుభాగంలో వున్న కారణంగా చలపతి దృష్టికి అందలేదు. చలపతికి ఎటువంటి అనుమానమూ రాకుండా అతని ఎదురుగానే పాలను గ్లాసుల్లో పోసి, నిద్ర మాత్రల పొడి కలిపిన పాలగ్లాసును చలపతి కిచ్చి, రెండో గ్లాసులోని మామూలు పాలను అతని ముందే తాగింది రాధ.

చలపతి ఈ సంగతి తెలుసుకోలేక మరోసారి రాధ చేతిలో బోల్తాపడ్డాడు.

ఈసారి చలపతి దొంగతనం, హత్యాప్రయత్నం మొదలయిన నేరాలకుగానూ మరింత కఠినశిక్షకు పాత్రుడై జైలు పాలయ్యాడు. □

కన్నెపిల్ల కోరిక

కె.బి.యస్ కుమార్

"నువ్వేమైనా చెప్పు....నాకేమీ మనసొప్పటం లేదమ్మా"
అన్నాడు గుర్నాధం.

"అమృతా! మీ నాన్నగారు చెప్పేదాంట్లో అబద్ధం లేదమ్మా! ఈ కాలం కుర్రాళ్ళలో చాలమంది కామాంధులు. మరెంతోమంది స్వార్ధపరులు. ఇంకెందరో అవకాశ వాదులు. నువ్వా అమాయకురాలివి. తులసిమొక్క లాంటి

నిన్ను గంజాయి వనంలో నాటడానికి మాకు మనసొప్పడం లేదమ్మా" అంది సీతాలక్ష్మి.

అమృత చిరాగ్గా నవ్వింది. "మీవన్నీ పాతకాలం భావాలమ్మా! ఈ కాలం ఆడపిల్లలు ఏ విషయంలోనూ మగాళ్ళకి తీసిపోవడంలేదు. యిప్పుడు నేను చదివే ఆడపిల్లల కాలేజీలో మీరు ముక్కుమీద వేలేసుకునేన్ని చిత్రమైన సంఘటనలు జరుగుతున్నాయి.

ఎందరో కుర్రాళ్ళు తమకి చెల్లాయిలుగా చెప్పుకుంటూ ఆడపిల్లల్ని బయటికి తీసుకువెడుతున్నారు. వార్డెన్లకి మామూళ్ళు ముడుతున్నాయి. అందుకని వాళ్ళ నోళ్ళు మెదపడంలేదు. వీళ్ళు వాళ్ళతో సినిమాలూ షికార్లూ కొడుతున్నారు.

....మొన్నేమైందో తెల్సా? బురఖా వేసుకొని ముస్లిం యువతిలా ఓ ప్రేమికుడు మా క్లాసుమేటు గదిలో దూరాడు. ఎవ్వరూ కనుక్కోలేక పోయారు. ఆ కథ యిప్పటికీ అలా జరుగుతూనే వుంది. యిప్పుడు చెప్పండి. మీది గుడ్డినమ్మకము కాదా?"

కూతురు వయసును మించి మాట్లాడుతూందని గ్రహించారు గుర్నాథం దంపతులు.

"సరే....యింతకూ ఆ వుమెన్స్ కాలేజీలో చదవనంటావ్ ...."

"అవును డాడీ!!"

"అయితే చదువే వద్దు. చదివింది చాలు...." కోపంగా అంది సీతాలక్ష్మి.

"నాపై నమ్మకం లేదామ్మా!" కోపంగా ప్రశ్నించింది అమృత.

"అలా అని కాదమ్మా...." గుర్నాథం ఏమో చెప్ప

బోయాడు.

"మీరూరుకోండీ; అన్నీ అది చెప్పినట్టేనా?" భర్తపై విరుచుకుపడింది సీతాలక్ష్మి.

"అందరం కల్సి సినిమాకెళ్తాం. ఆడాళ్లూ వుంటారు: మగాళ్లూ వుంటారు. మన కిష్టమైన చోట మనం కూచుంటాం. బస్సెక్కుతాం. అక్కడా వాళ్లూ వీళ్లూ కలగా పులగమై వుంటారు. మనకి సేఫ్టీ అనుకున్నచోట మనం కూచుంటాం. లేదా నుంచుంటాం.

కాలేజీ అంటే కూడా అంతే! కంబైండ్ అయినంత మాత్రాన వాళ్లూ వీళ్లూ పక్క పక్కన కూచోరు. మగాళ్ళంతా ఓ జట్టుగా ఆడాళ్ళంతా ఓ జట్టుగా విడి విడిగా కూచుంటారు. కాలేజీ వదలగానే జట్లు జట్లుగా తలొంచేసు కొని ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళిపోతారు. ఎవరి చదువువాళ్ళదే! ఎవరి సీటు వాళ్ళదే! యిందులో మనం చెడిపోయేదంటూ యేమీలేదు. యింకా మగాళ్ళ ముందు చులకనయిపోతామనే భయంవల్ల పోటాపోటీలుగా చదివి పట్టుదలమీదా పాసయ్యే అవకాశం వుంటుంది........" గోముగా అంది అమృత.

"పోన్లేవే! అది చెప్పేదాంట్లో కూడ నిజమే వుంది. దానికోరికెందుకాదనాలి? వూఁ అనేసెయ్...." అన్నాడు గుర్నాధం.

"వూఁ...." అంది సీతాలక్ష్మి అన్యమనస్కంగానే.

అమృత హృదయంలో అమృతం పొంగి పొర్లింది.

నిజానికి అమృత కాలేజీ మారుస్తున్నది పోటీమీద చదివి ఫస్టుక్లాసులో పాసవడానిక్కాదు....

2

"నీకోసమే...." అంది అమృత ముద్దుగా.

"ఏమిటీ! నా కోసం నువ్వు ఆడపిల్లల కాలేజీలో టీసీ

పుచ్చుకొని యిక్కడ చేరావా!? ఆనందంపట్టలేక అడిగాడు మనోజ్‌కుమార్.

"నిజం....నీమీదొట్టు...."

"కాని అమృతా! నువ్విలాంటి పని చేసుండాల్సింది కాదు" అన్నాడు మనోజ్.

"అదేం?" అదిరిపడి అడిగింది అమృత.

"యిన్నాళ్లూ మనం చాటుమాటుగా కల్సుకునేవాళ్ళం. మన యిద్దరి వునికి తరచుగా మాత్రమే తెలిసేది. అందుకు తగిన జాగ్రత్తలు తీసుకునేవాళ్ళం. కాని యిప్పుడలా కాదు. ప్రతిరోజూ తప్పనిసరిగా కల్సుకుంటాం. చిలిపితనం వూరుకోనివ్వదు కదా! చూపులూ సైగలూ స్పర్శలూ తరచూ సంభవిస్తూంటాయి. కళ్ళెదుటే నుంటాం గాబట్టి నిగ్రహించుకోలేం. పొరబాటున ఎవరి కంటైనా పడిందో, మన పేర్లు గోడల కెక్కుతాయి...."

"అలా జరక్కుండా చూసుకోవాలి మరి...." అతని జుత్తులోకి వేళ్ళు పోనిస్తూ అంది అమృత.

"చూసుకుందాం...." అన్నాడు మనోజ్.

"మరి వెడదామా!?"

"అలాగే...." అన్నాడు మనోజ్.

"నీ కోసం నేను కాలేజీ మారాను. మరి నా కేమిస్తావ్?"

"హోటల్ సవేరాలో ఈ రాత్రి టేబుల్ రిజ్వర్ చేయిస్తాను. డిన్నర్‌కి రా...."

"ఏడుకొస్తాను. ఎనిమిదికల్లా నేను యిల్లు చేరుకోవాలి...."

"ఓకే...."

ఇద్దరూ లేచారు.

3

"హలో....డిటెక్టివ్ జలంధర్ స్పీకింగ్...."

"హలో! బ్రదర్....నేను....చక్రవర్తిని మాట్లాడుతున్నాను. నువ్వు తక్షణం బయల్దేరి రావాలి...."

"తక్షణమా!!"

"అవును. వున్నపళంగా."

"కొంపలు మునుగుతాయ్...."

"ఏం?"

"స్నానం చేస్తున్నాను—బాత్‌రూమ్‌లో...."

"ఓయ్....అయితే వెంటనే పూర్తిచేసి డ్రస్ వేసుకొని ఆ తర్వాత వున్నపళంగా వచ్చెయ్...."

"వాట్సద మాటర్?"

"మర్డర్....హోటల్ సవేరా....రూమ్ నెంబర్ వన్ వన్‌సిక్స్...."

"పది నిమిషాల్లో అక్కడుంటాను...."

పది నిమిషాలకి డిటెక్టివ్ జలంధర్ అక్కడున్నాడు.

మంచంపై అస్తవ్యస్తంగా పడున్న యువకుడి శవం-కళ్ళు తెరవబడి భీతిగొల్పుతోంది. ఛాతీలో దిగబడిన కత్తి ఆ భాగాన్ని మంచంపై కొంతమేర, రక్తమయం చేసింది. రిగర్‌మార్టిస్ యింకా ప్రారంభం కాలేదు....రిగర్ మార్టిస్ వేడిప్రదేశంలో అయితే హత్య జరిగిన పన్నెండు గంటలకి ప్రారంభమవుతుంది. కోల్డ్ వెదర్ అయితే మరణించిన నలభై ఎనిమిది గంటలకూడ ప్రారంభం కావచ్చు. ఎక్స్-రే కళ్ళతో రూమంతా కలయజూశాడు డిటెక్టివ్ జలంధర్.

హోటల్ సవేరా సంపన్నులకిమాత్రమే అందుబాటులో వున్న హోటల్. హోటల్ గది ఎన్నో అదనపు హంగుల్ని

కలిగుంది. ఫాల్స్ రూఫింగు. ఏ.సి మిషన్ ఆగిపోయి వుంది. చిన్న లైటు మందంగా వెలుగుతోంది.

నేలమీద ముదురు గోధుమరంగు ఖరీదయిన కార్పెట్ పరచబడి వుంది. ద్వారానికి కుడిప్రక్క డెకోలం షీటు పరచిన టేకు టేబుల్. మూడు కుర్చీలు. ఓ టీపాయ్. వాటిప్రక్కగా ఓ మూలకి పొడుగాటి స్టూలుపై మూతి విరిగిన కూజా.

ఎడంప్రక్క డ్రస్సింగ్ మిర్రర్. దానిలో టాయిలెట్ సామగ్రి వుంది. దాని ముందుభాగంలో ఖరీదయిన డబుల్ కాట్. యూఫోమ్ బెడ్. దానిపైన స్థానభ్రంశం చెందిన బెడ్‌షీటు. దానిమీద రెక్కలూడిన మల్లెలు. మల్లెల్ని వీడిన రెక్కలు. ఆకుపచ్చ రంగు గాజుముక్కలు. వాటిమధ్య కళ్ళు తెరచుకొని భయాన్నిగొల్పుతొన్న శవం.

"నీ దర్యాప్తులో ఏమైనా వూహించగలవా?" చక్రవర్తి కేసి తిరిగి ప్రశ్నించాడు జలంధర్.

"ఎక్కడా!? యింకా యేమీ చూళ్ళేదు. శవాన్ని చూశాను. ముందుగా నీకు ఫోన్ చేశాను...." చక్రవర్తి చెప్పాడు.

"శవాన్ని ముందుగా ఎవరు చూశారు."

"రూమ్‌బోయ్ గోపాల్ ...."

"అతన్ని పిలిపించు నేను మాట్లాడుతాను. ఈ లోగా యిక్కడ నీ మేధని వుపయోగించు."

చక్రవర్తి తలూపాడు.

గోపాల్ పిలిపించబడ్డాడు.

"నీకు తెల్సిందిచెప్పు...." రెడ్‌విల్స్ వెలిగించుకుంటూ అన్నాడు జలంధర్.

"నిన్న సాయంత్రం యితనూ మరో అమ్మాయీ

టేబుల్ రిజర్వ్ చేయించుకున్నారు సార్....అంతకుముందే యితను ఈ రూమ్ బుక్ చేశాడు. డిన్నర్ అయ్యాక ఇతను కూడా వచ్చిన అమ్మాయి కడుపు నెప్పిగా వుందని చెప్పిందిట...."

"ఆ అమ్మాయి ఇతన్తో చెబుతుండగా నువ్వు విన్నావా?"

"లేదు. వీళ్ళకి సర్వ్ చేసిన బేరర్ చెప్పాడు. తింటోన్న ఐస్‌క్రీమ్‌ని సగంలోనే వదిలేసిందిట...."

"ఆ తర్వాత?...."

"రూములో కొచ్చేశారు. ఆ అమ్మాయి యింటికెళతానంది. నెప్పి తగ్గాక వెడుదువులే అంటూ యితను వారించాడు. ఏమైనా కావాలేమోనని నేను మామూలుగా వెళ్లాను. డబ్బులిచ్చి 'రెండు 'స్పాస్మిండన్' మాత్రలు తెప్పించాడు. వాటితోబాటే ఓ కాఫీ కూడ తెచ్చిచ్చాను. అంతే.... మళ్ళీ వాళ్ళని చూళ్ళేదు.

ఉదయం ఆరుగంటలకి బెడ్‌కాఫీ తాగటం అలవాటుట. ఆ విషయం చెబుతూ వుదయం ఆరుకల్లా కాఫీ తెమ్మన్నాడు. అలాగేనని పట్టుకెళ్ళాను. ఓరగా వేసివున్న తలుపు తెరవగానే ఈ ఘోరం కన్పించింది" బాధగా అన్నాడు గోపాల్.

"వెంటనే మీ మేనేజర్‌కి ఈ విషయం తెలియజేశావా?"

"లేదు. గదిలో వస్తువులన్నీ చిందరవందరగా పడున్నాయి. అవన్నీ గబగబా సర్దేశాను. ఆ తర్వాత మా మేనేజర్‌గారికి చెప్పాను....ఏ.సీ మిషన్ ఆఫ్ చేసింది కూడ నేనే...."

దీర్ఘంగా నిట్టూర్చాడు జలంధర్. "అలా సర్ది వుండాల్సింది కాదు నువ్వు...."

"అవున్సార్....అలాచెయ్యకూడదని మా మేనేజర్‌గారు చెప్పేవరకూ తెలీదు నాకు ..." బాధగా అన్నాడు గోపాల్.

"ఈ వుదయం నువ్వు తొలిసారిగా గదిలో అడుగు పెట్టినప్పుడున్న గది చిందరవందరని గుర్తుకు తెచ్చుకొని వర్ణించగలవా?"

పది క్షణాలపాటు ఆగాడు గోపాల్.

"డ్రస్సింగ్ మిర్రర్ వద్ద ఉండాల్సిన పౌడర్ డబ్బా, దువ్వెనా తలుపు వద్ద పడున్నాయి. కుర్చీ తల్లక్రిందులై మంచం ప్రక్కన పడివుంది. కూజా మూతి విరిగి ముక్కలు స్టూలు పక్కనే పడ్డాయి."

"ఎదురుగా అమితమైన భయాన్ని గొలుపుతూ అతని శవం కన్పిస్తోంటే తీరిగ్గా వస్తువులు సర్దావా?"

"శవాన్ని చూస్తే భయమెందుకుసార్!!? అదేమన్నా మీదబడి రక్కుతుందా? మొదటే మేనేజర్ని కలిస్తే ఆయనొచ్చి గది సర్దక నన్నుపిల్చావా అని కేకలేస్తారేమోనని భయమేసింది....కాని సర్దినందుకాయన చీవాట్లేశారు."

"ఆ అమ్మాయి పేరు తెలుసా?"

"డియర్ డియర్ అని పిలుస్తూ వచ్చాడు సార్! ఆ పిల్లేమో యితన్ని మనోజ్ మనోజ్ అని పిలుస్తూండటం విన్నాను."

"సరే....నువ్వెళ్ళు. అవసరమైతే మళ్ళీ పిలిపిస్తాను. ఈలోగా వూరొదిలి ఎక్కడికైనా వెళ్ళడంలాంటి ప్రయత్నాలేం చెయ్యకు." గంభీరంగా అన్నాడు జలంధర్.

నమ్రతగా తలూపి వెళ్ళిపోయాడు గోపాల్.

చక్రవర్తి వద్దకి నడిచాడు జలంధర్.

"ఏమీ దొరకలేదు గురూ...." నిస్సహాయంగా అన్నాడు చక్రవర్తి.

4

జలంధర్ తన ఆఫీసు కొచ్చేసరికి అతనికోసం ఎదురు చూస్తోన్న యాభై యేళ్ళ వృద్ధుడు లేచి నిలబడి నమస్కారం చేశాడు.

అతన్ని కూచోబెట్టి విషయం అడిగాడు జలంధర్.

"మా అమ్మాయి నిన్న మధ్యాహన్నం నుండి కన్పించటములేస్సార్" అన్నాడతను. అతని దీనవదనంలో లక్ష అర్థా లున్నాయి.

"వివరంగా చెప్పండి."

"అమృత నా కూతురు. కాలేజీలో చదువుతోంది. నిన్న మధ్యాన్నం కాలేజీకి వెళ్ళింది. సాయంత్రం అయిదుకల్లా రావాలి. రాలేదు. ఫ్రెండ్ యింటికి వెళ్ళివుంటుందనుకున్నాం. తొమ్మిదయినా రాకపోయేసరికి అనుమానం వేసింది. ఆమె ఫ్రెండ్ నిర్మల యింటికి వెళ్ళాను. ఆమె దానికి క్లాస్ మేట్ కూడ! క్లాసుకొచ్చిందని, క్లాసవగానే యింటికి వెళ్ళిపోయిందని చెప్పింది. నాకు చాల భయంగా వుంది. సార్.... పెళ్ళికావలసిన పిల్ల. తప్పిజారి ఏదేనా అయితే పరువుదక్కదు. మీరెలాగైనా నా కూతురు ఆచూకీ తీయాలి...." ఆయన కంఠం రుద్ధమైంది.

ఓదార్పుగా ఆయన చెయ్యి పట్టుకొని మృదువుగా నొక్కాడు జలంధర్.

"మరోలా అనుకోక నా ప్రశ్నలకి జవాబులు చెప్పండి" సాధ్యమైనంత మృదువుగా అన్నాడు జలంధర్.

"చెప్పండి."

"మీ అమ్మాయి ప్రవర్తనలో యిటీవల ఏవైనా మార్పులు సంభవించాయా?"

"యిదివర్లో ఆడపిల్లల కాలేజీలో చదూతుండేది. ఈ

సంవత్సరం పట్టుబట్టి గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజీలో చేరింది."

"కంబైండ్ స్టడీస్ కదూ!"

"అవును."

"కాలేజీ మారటానికి కారణం ఏం చెప్పింది?"

"వుమన్స్ కాలేజీలో సభ్యతగల ఆడపిల్లలు సహించ లేని అవకతవకలు జరుగుతున్నాయని చెప్పింది."

"మీ అమ్మాయి ఎవర్నైనా ప్రేమించిందా?"

"లేదు."

"ఆమెకెవరేనా బోయ్ ఫ్రెండ్సున్నారా?"

తల అడ్డంగా వూపాడు గుర్నాధం.

"మీ చిరునామా, అమ్మాయి ఫోటో యిచ్చి వెళ్ళండి. దర్యాప్తుచేసి నాలుగు రోజుల్లోగా ఫలితం తెలియజేస్తాను" అన్నాడు డిటెక్టివ్ జలంధర్.

5

జలంధర్ ఆలోచన్లు ఓ కొలిక్కి రావటంలేదు.

వుమన్స్ కాలేజీలో అసభ్యకరమైన సంఘటనలు జరుగుతూన్నాయని అమృత చెప్పింది .... అయితే గుర్నాధంతో ఆమె చెప్పిన వాటిని బట్టి అవి కాలేజీ హాస్టల్లో జరుగుతూండాలి. సరయిన టైమ్‌కి కాలేజీకొచ్చి చివరి బెల్ కొట్టగానే యింటికి వెళ్ళిపోయే అమ్మాయిలకి యివన్నీ వర్తించవు.

ఒకవేళ అమృతని దారిలో ఏ పోకిరి వెధవైనా పీడిస్తున్నాడా అంటే ఆమె కాలేజీ మారినంత మాత్రాన వాడు వదలడు. కాబట్టి అమృత మరో కాలేజీలో చేరటానికి ఆమె తల్లిదండ్రులతో చెప్పిన కారణం సరైంది కాదు.

మరేమై వుంటుంది?

ఒకవేళ గవర్నమెంటు కాలేజీ విద్యార్థిని ప్రేమించి— తను వుమన్స్ కాలేజీలో చదువుతూ అతన్నితరచూ కల్సు కోవటం అసాధ్యమనీ అతని కాలేజీలోనే చేరితే వారి ప్రేమాయణానికి ఏలాంటి ఆటంకమూ వాటిల్లదని అతని కోరికపైగాని తన కోరికమీదేగాని చేరి వుంటుందా?

ఏదేమైనా ఆ కుర్రవాడి అడ్రస్ తెలిస్తేగాని దర్యాప్తు సాగదు.

వుమన్స్‌కాలేజీ ప్రిన్స్‌పాల్‌ని కల్సి పరిశోధన ప్రారంభించాలి.

హోటల్ సవేరాలో హత్య చెయ్యబడిన కుర్రాడి విషయంలో ఏలాటి క్లూ లభించలేదు.

ఫోను గణగణ మంది.

రిసీవరెత్తాడు జలంధర్.

"హలో—నేను....చక్రవర్తిని మాట్లాడుతున్నాను. జలంధరేనా?"

"యస్ మై బ్రదర్."

"బ్రదరూ! చిన్న క్లూ దొరికింది."

"ప్రొసీడ్."

"హత్య జరిగిన రాత్రి హతుడితో బాటు వున్న అమ్మాయి పేరు అమృత."

"మైగాడ్....!? ఏమన్నావ్ అమ్మాయిపేరు?"

"అమృత....ఏం? ఆ పిల్ల నీకు బంధువా!?"

"షటప్ .... ఆ అమ్మాయి తండ్రి నా క్లయింట్! యిందాకే వాపోయి వెళ్ళాడు."

"అయ్‌పిటీయూ."

"నో కాళ్ళనాఫ్ పిటీ!! క్లయింటుగాని వాడి కూతురు గాని—లేక వాడి జేజెమ్మే అగునుగాక....నేరస్తులైతే

కిషోర్లే...."
"వాట్ నెక్ట్స్?"
"పోస్టుమార్టమ్ రిపోర్టొచ్చిందా?"
"అప్పుడేనా? .... రేపొస్తుంది. అన్నట్టు చెప్పడం మర్చాను....ఒక పేగోల!!"
"ఏమిటి?"
"సవేరా మేనేజరూ ప్రొప్రయిటరూ! ఈ హత్యజరిగిన విషయం ఎక్కడా పొక్కనీయవద్దని గడ్డం పట్టుకొని మరీ బతిమాలుతున్నారు. గెడ్డం నెప్పెడుతూంది."
"రోజుకి మూడు చొప్పున అనాల్జిన్ వాడు. ఆ భయం వాళ్ళకుండటం సహజమే!!"
"అలాగే...."
"అన్నట్టు వాడున్నాడు చూడు...., గోపాల్...."
"హోటల్ రూమ్ బోయ్....!?"
"యస్....వాడిమీదోకన్నేసుంచు. పి. ఎమ్. రిపోర్టు రాగానే నాకు ఫోన్ చెయ్."
"ఓకే...."
రిసీవర్ క్రెడిల్ చేశాడు జలంధర్. బుర్రలో ఆలోచన్లు సుళ్ళు తిరగడం ప్రారంభించాయ్.
అయితే అమృత తల్లిదండ్రులతో కాలేజీ మారతానని గోలపెట్టింది మనోజ్ కోసమే నన్నమాట. యిద్దరూ ప్రేమికులన్నమాట. తనమీది ప్రేమతో కాలేజీ మార్చి నందుకు ధన్యవాదాలు చెబుతూ మనోజ్ హోటల్ సవేరాలో టేబుల్ రిజర్వ్ చేసుండాలి. ఆనక హోటలు గదిలోకి మారుండాలి.
మరి మనోజ్‌ను హత్యచేసిందెవరు???
ప్రేమతో కాలేజీనే మార్చిన తన ప్రేయసి ముంద

డుగు విషయంలో మాత్రం కాదంటుందా అన్న ధీమాతో హద్దుమీరబోగా యిద్దరికీ మధ్య జరిగిన పెనుగులాటలో ఆమె అతన్ని హత్య చేసిందా?

కడుపునెప్పి మాత్రలు తెప్పించుకొని మింగాక నెప్పి తగ్గాక వెడుదువ్‌గానిలే అంటూ మనోజ్ ఆమెని రూములోకి తీసికెళ్ళాడు. అదీగాక టేబుల్ రిజర్వేషన్‌కి ముందే రూమ్ రిజర్వ్ చేశాడు.

అంటే అమృత కన్నెతనాన్ని జుర్రుకోవాలనే దురుద్దేశం మనోజ్‌కి ముందుగానే వుందన్నమాట. లేకపోతే రూమ్ రిజర్వ్ చెయ్యాల్సిన అవసరం ఏమిటి?

ఒకవేళ నెప్పితగ్గి—అమృత వెళ్ళిపోయాక మరెవరేనా మనోజ్‌ని హత్యచేశారా?

అయితే అమృత ఏమైనట్టు??

6

నెమ్మదిగా కళ్ళు తెర్చింది అమృత.

పరిసరాలు చూపింది.

వులిక్కిపడింది.

'నేనెక్కడున్నాను?'' మనసులో అనుకుంది.

అది హోటల్ గదికాదు.

తమ యిల్లుకాదు.

క్రొత్తప్రదేశమని స్ఫురణకి రాగానే ఆమె ఒళ్ళు ఝుల్లుమంది.

లేవబోయింది. సాధ్యం కాలేదు. ఒళ్ళంతా నెప్పులుగా వుంది. రెండుక్షణాలు మౌనంగా అప్రయత్నంగా ఆలోచించింది. అంతే. నెమ్మదిగా అమృత కళ్ళమ్మట నీళ్ళు ప్రవహించసాగాయి.

అనుకున్నప్రకారం ఏడుగంటలకి హోటల్ సవేరాకి వెళ్ళింది. మనోజ్ తనకోసం టేబుల్ రిజర్వ్‌చేయించాడు. భోజనం ముగించారు. అయిస్క్రీమ్ ఆర్డరిచ్చారు.

తనకి నెమ్మదిగా కడుపునెప్పి మొదలైంది. ఆ విషయం మనోజ్‌కి చెప్పింది. మరేం ఫర్వాలేదని, తగ్గిపోతుందని చెప్పాడు మనోజ్.

కాని తనకి తెల్సు.... ఈ నెప్పి అరగంటవరకూ తగ్గదని. ఈ మధ్య తనకి పీరియడ్స్ నెలనెలా సక్రమంగా రావడం లేదు. పదిరోజులు అటూయిటూ జరుగుతోంది. రావటానికి రెండుమూడు రోజులు ముందుగా ఓ అరగంటపాటు యిలా నెప్పొస్తోంది.

కాని.... ఈ విషయం సిగ్గువిడిచి మనోజ్‌తో ఎలా చెప్పగలదు?

అయిస్క్రీమ్ వచ్చింది. తినమని బలవంతం చేశాడు మనోజ్. నెప్పి అధికం కావడంతో పూర్తిగా తిన్లేకపోయింది. పరిస్థితి గ్రహించి మనోజ్ రిసెప్షన్ వద్దకి నడిచాడు. ఒక్క నిమిషంపాటు మాట్లాడి వచ్చాడు. రూమ్ తీశాననీ కాసేపు రెస్టు తీసుకోమనీ బలవంతం చేశాడు.

కాదన్లేకపోయింది.

రూమ్ నెంబర్ వన్‌వన్‌సిక్స్ ఏకాంతంగా వుంది. చుట్టూ పూలకుండీలు. ఎంతో ఆహ్లాదకరంగా వుంది.

రూమ్‌బోయ్ రాగానే ఏవో మాత్రలు తెప్పించాడు మనోజ్. వేసుకున్న కాసేపటికి కాస్త ఉపశమన మన్పించింది.

టైమ్ ఎనిమిది కావస్తూండడంతో వెడతానంది.

అప్పుడు బయటపడింది మనోజ్ అసలు రూపం.

చెయ్యి పట్టుకున్నాడు.

'మనసే పట్టుకున్నావు. చెయ్యందించటానికి సిద్ధమే. ఆ రోజొచ్చేవరకూ ఆగు' అంది తను.

యిప్పుడు చెయ్యందిస్తే ఆ రోజు వస్తుందన్నాడతను.

అందే. ఛెళ్ళుమంది మనోజ్ చెంప.

అప్పుడు మొదలయింది పులీమేకల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం.

మేక పెనుగులాడింది. గింజుకుంది.

కాని లాభం లేకపోయింది.

మేక 'ప్రాణాన్ని' పులి హరించింది.

హరించి—ఆనందంగా విందు చేసుకుంటోన్న సమయంలో సరిగ్గా మంచంమీద — ఎవరు పారేశారో ఓ వస్తువు—తని చేతికి సమీపంలో పడింది.

అది....కత్తి!!

అంతే....ముందూ వెనకా ఆలోచించలేదు తను.

బలంగా కత్తి పట్టుకుంది. మరుక్షణం అది మనోజ్ గుండెల్లో దిగింది.

'మూడ్'లో వున్న పులి-చిన్నగా గాండ్రించి ప్రక్కకి ఒరిగిపోయింది.

గబగబా లేచి చీర కట్టుకున్నాననిపించుకొని తలుపుతెర్చి బయటికి పరిగెత్తింది తను.

కాదు....పరిగెత్తా ననుకుంది.

ఎదురుగా యిందాక టాబ్లెట్స్ తెచ్చిచ్చిన రూమ్‌బోయ్.

"వెళ్ళిపొండమ్మాయిగారూ! ఎవరూ చూడకముందే పారిపొండి. లేకపోతే ప్రమాదంలో యిరుక్కుంటారు" నెమ్మదిగా అన్నాడు వాడు.

"ను....ను....నువ్వు ..."

"మీకు కత్తి పారేసింది నేనే! నా పేరు గోపాల్....

మీకు నెప్పెలాగుందో కనుక్కుందా మని వచ్చాను. వాడు మిమ్మల్ని బలవంతం చెయ్యడం చూశాను. మొదట నలు గుర్నీ పిలుద్దామనుకున్నాను. కాని మీ పరువుపోతుందని ఆత్మరక్షణకోసం మీకు కత్తిని పారేశాను. మీరు వాణ్ని భయపెట్టి పారిపోతారనుకున్నాను. కాని....కాని....అయినా మంచిపనే చేశారు ...ప్రేమించిన పిల్లనే మానభంగం చేసే యిలాంటి వెధవలకిలాగే జరగాలి. ఎవరూ చూడకముందే పారిపోండి."

"మరి నువ్వు....?"

"అన్నీ సర్దేస్తాను .... నామీదికూడ రాకుండా చూసు కుంటాను....నా గురించి ఆలోచించకండి .... మీరు పారి పోండమ్మా" అన్నాడతను.

తనకి నోట మాట్రాలేదు. కృతజ్ఞతా సూచకంగా కళ్ళు వర్షిస్తోండగా మౌనంగా రెండు చేతులెత్తి నమస్క రించింది.

గబగబా మెట్లు దిగింది సాధ్యమైనంత సౌమ్యంగా ముఖకవళికల్ని మార్చుకొని.

ముఖకవళికలైతే మార్చుకో గల్గింది గాని మనసు మార్చుకోలేకపోయింది.

గోపాల్!!

ఆఫ్టరాల్ ఓ హోటల్ బోయ్....

అతనెవరో—తనెవరో....తనపాలిటి దేవుడయ్యాడు. అయిదు నిమిషాలు—అయితే అయిదు నిమిషాలు ముందుగా ఆ కత్తిని పారేసి వుంటే—మనోజ్‌ని బెదిరించి తప్పించు కొని గోపాల్‌ని పెళ్ళాడి వుండేది తను!!

కాని అంతా అయిపోయాక అందింది కత్తి తనకి!!

శీలం కోల్పోయిన తను—ఎవర్ని వుద్ధరించాలి??

అందుకే ఓ కలుపు మొక్కని ఏరిపారేసింది....

తన గురించి ఒక వుత్తముడు శిక్ష అనుభవించడం సహించలేదు తను. పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళి అంతా చెప్పేయ్యాలి.

శీలం కోల్పోయిన సత్యాన్ని మరుగుపరచి కన్నెపిల్లగా తల్లిదండ్రుల చాటున గడిపే జీవితం కన్నా—ఓ అమాయకుణ్ని శిక్షకి గురిచేసి సంఘంలో నిర్దోషిగా గడిపే జీవితం కన్నా బ్రతికిన పులిని చంపిన చచ్చిన మేకగా జైలుజీవితంలోనే సంతృప్తి వుంది తనకి.

అందుకే వడివడిగా అడుగులేస్తూ పోలీస్‌స్టేషన్ వున్న రోడ్డువెపు నడవబోయినది.

అంతే....

రెండు బలమైన చేతులు బలంగా నోరు మూసి ప్రక్కనే వున్న నల్లని అంబాసిడర్‌లోకి నెట్టేశాయి....

తనకి స్పృహ తప్పుతోండగా కారు కదిలింది.

....అలికిడి కావడంతో వర్తమానంలో కొచ్చింది అమృత.

ఎవరో దృఢకాయుడు. టిఫిన్ ప్లేటుతో వస్తున్నాడు.

"స్పృహొచ్చిందన్న మాట...." వెకిలిగా అన్నాడు.

"ఎవరున్నవ్వు? నే నెక్కడున్నాను? .... నన్నెందుకు బంధించారు?"

"చెబుతాము. వినటానికీ ఆ తర్వాత మాట్లాడాలన్పిస్తే మాట్లాడ్డానికీ నీకు సత్తువ కావాలి. తిను...." మంచంపై ప్లేటు పెట్టేసి వెళ్ళిపోయాడతను.

ఆకలి దంచేస్తోంది. అయినా తినాలన్పించటంలేదు. కాని తినకపోతే ప్రేవులు ఎదురుతిరిగేలా వున్నాయి.

టిఫిన్ ప్లేటు ముందుకు లాక్కుంది....

7

"టిఫిన్ పెట్టిన వెధవలూ! మంచినీళ్ళివ్వాలని తెలీదూ?" గట్టిగా కేకపెట్టింది అమృత.

బదులుగా నవ్వు విన్పించింది. ఓ నడివయస్కుడు చిరు నవ్వుతో ముందుకొచ్చాడు.

"గాడిదలా వున్నావు బుద్ధిలేదూ!? మంచినీళ్ళు!!" గట్టిగా అంది అమృత, వాణ్ని వ్యంగ్యంగా చూస్తూ.

"సరిగ్గా యిప్పుడు మేమూ అదే పరిస్థితిలో వున్నాం.... కాదు మాకలాంటి పరిస్థితి కల్పించింది నువ్వు. నువ్వే!! కాబట్టి యిప్పుడు నీకూ అదే పరిస్థితి!!! యెలా వుంది!?

"షటప్....మనోజ్‌గాణ్ని పువ్వుల్లో పెట్టి పెంచాను. కోరిన ప్రతిదీ తీరుస్తూ వచ్చాను. వీసమెత్తు దెబ్బ తగిలినా విలవిల్లాడిపోయేవాణ్ని. తలనెప్పి వచ్చినా టైఫాయిడ్ పేషంటుకిమల్లే చికిత్స చేయించేవాడిని....

"ఎందుకో తెలుసా? వాళ్ళ చిన్నాన్న తండ్రి ఆప్యాయతని మరిపిస్తున్నాడన్న మంచిపేరు నాకు రావాలని. అంతే కాదు. మనోజ్‌ని యీ రోజు నా స్వహస్తాలతో నేను చంపాలని...."

ఉలిక్కిపడింది అమృత.

వికటంగా నవ్వాడతను. "అవును. నిన్నటితో మనోజ్‌కి మైనారిటీ తీరిపోయింది. యివాళనుండి ఈ యావదాస్తికీ వాడే వారసుడు. ఈ రోజు వాడితో కావలసిన సంతకాలు చేయించుకొని యీ రాత్రికి వాణ్ని శాశ్వత నిద్రలో ముంచెయ్యాలనుకున్నాను.

"డామిట్!! యిరవైనాలుగ్గంటలు........ఒక్కరోజు ముందుగా నువ్వు వాణ్ని చంపి నా ప్లానంతా గంగపాలు చేశావు. నా పథకాన్ని సర్వనాశనం చేశావు. ఇప్పుడీ

ఆ స్తంతా ఎవరికీ కాకుండా పోతుంది. పిలిచినా పలకని దేవుడి పరమై పోతుంది.

"దీనికంతా కారణం నువ్వు... నిన్ను నరికినా నా మనసు శాంతించదు. అయినా కాస్తైనా తృప్తి కోసం నిన్ను చంపబోతున్నాను. చివరికోరిక ఏదయినా వుంటే కోరుకో...."

"ఓ కత్తివ్వు .."

"నువ్వే ఆత్మహత్య చేసుకుంటావా!! నా మనోజ్‌ని నేను చంపలేకపోయాను. నిన్ను చంపిన తృప్తి కూడ మిగలకుండా చేస్తావా!! తప్పుకదూ!"

"థూ!!!"

"భీమ్‌పింగ్!!!" గట్టిగా గర్జించాడతను....

"ఎస్! బాస్!!"

గొంతు మారటంతో వులిక్కిపడి యిటు తిరిగిన ఆ వ్యక్తి ప్రక్కలో బాంబు ప్రేలినంతగా వులిక్కిపడ్డాడు.

"డి....డి....డి...."

"డిటెక్టివ్ జలంధర్!!! తమ్ముడి ఆస్తికోసం తమ్ముడి కొడుకుని చంపబోయిన చిన్నాయనగారూ! చేతులెత్తండి మరి...." వ్యంగ్యంగా అన్నాడు జలంధర్. అతని చేతిలో రివాల్వర్ మెరుస్తోంది.

"జలంధర్‌గారూ....!!" చెమ్మగిల్లిన కళ్ళతో పరుపరుగున వచ్చి జలంధర్ పాదాలకి చుట్టుకుపోయింది అమృత.

"అమృతా! లే...." సాధ్యమైనంత సౌమ్యంగా అన్నాడు జలంధర్. మనోజ్ చిన్నాన్నవైపు తిరిగాడు.

"మిస్టర్ విశ్వపతీ! మనోజ్ అమృతను రేప్ చేశాడు.

ఆ విషయం పోస్టుమార్టమ్ రిపోర్టులో వెల్లడైంది. మనోజ్ వివరాలు రాబట్టడంకోసం కాలేజీకి వెళ్ళాను. ప్రిన్సిపాల్‌నీ మనోజ్ క్లాసుమేట్సునీ కలిశాను. కాని నా పరిశోధనకి అవసరమయ్యే సమాచారం లభించలేదు. మీ యింటికి వచ్చి నిన్నడిగి తెల్సుకుందామనుకున్నాను.

"మొదట గుర్ఖా నన్ను లోపలకి పంపటానికి తడబడ్డాడు. కొద్దిగా అనుమానం వేసింది. బలవంతంగా ప్రవేశించాను. తలవాకిలి వద్ద నీ భీమ్‌సింగ్ నన్ను ప్రతిఘటించి మూర్ఛపోయాడు. ఈ గూడుపుఠాని అంతా నీవద్దే వుందని గ్రహించాను. చాటున నిలబడి విన్నాను. ఆ స్త్రీ అంతా దేవాలయాలకి పోతే నిలువ నీడలేదేనని బెంగపడకు. నువ్వుండదగిచోటు నీ కోసం ఎదురుచూస్తోంది. కమాన్...."

తల వంచుకున్నాడు విశ్వపతి.

"అమృతా!!" గంభీరంగా అన్నాడు జలంధర్. "కన్నెపిల్లకి కోరిక లుండటం సహజమే! కాని ప్రియుడి మనస్తత్వం తెలుసుకోకుండా కాలేజీ మారటం వగైరాలు చేస్తే యెంత ప్రమాదమో తెల్సుకున్నావా! చూడు.... మనోజ్‌ని చంపేశావు. అఫ్‌కోర్స్.. నీ మాన సంరక్షణ విషయంలో జరిగింది కాబట్టి నీ విషయంలో నేను హెల్ప్ చెయ్యగలను.

"కాని....ఓ హత్యను సమర్థించి మసి పూసి మారేడు కాయ చేసి కేసుని తప్పుదారి పట్టించినందుకు .... అఫ్ కోర్స్ అతడు మానవతాదృష్ట్యా మంచే చేసివుండొచ్చు. కాని చట్టం దృష్టిలో రూమ్‌బోయ్ గోపాల్ స్వల్పంగా శిక్ష అనుభవించక తప్పదు ..." అన్నాడు జలంధర్ జేబులోంచి రెడ్‌విల్స్ పేకెట్ తీస్తూ. □

లింగమూర్తి టైం చూశాడు.

ఉదయం ఏడుగంటలైంది.

'ఈ పాటికి సదాశివం నిద్రలేచి వుంటాడు....పాపం! ఇదే అతనికి ఆఖరి ఉదయం అని తెలీదు.'

లింగమూర్తి నవ్వుకున్నాడు.

సిగరెట్టు ముట్టించి ఒకసారి గట్టిగా దమ్ము పీల్చి ఫోను

దగ్గరికి లాక్కుని నెంబరు త్రిప్పాడు.

అవతల రింగు అవుతుంది. కానీ ఎవరూ యెత్తడం లేదు.

"డామిట్!" రిసీవర్ క్రెడిల్ మీదకు కొట్టాడు.

ఈవేళ ఎట్టి పరిస్థితుల్లోనూ తన పథకం అమలు పర్చాలి. కానీ అవతల మనిషి వున్నాడో లేడు!....

అసహనంగా కుర్చీలో కదిలాడు లింగమూర్తి.

సిగరెట్ దమ్ములు రెండు గట్టిగా పీల్చి యాష్ట్రేలో నొక్కేశాడు.

అయిదు నిముషాలు గడిచాయి.

మళ్ళీ నెంబర్ డయల్ చేశాడు.

అవతల రింగ్ అవడం వినిపిస్తూంది. లింగమూర్తి కనుబొమలు చిట్లించాడు.

"బ్లడీ బాష్టర్డ్!....ఎక్కడికి వెళ్ళాడో."

ఫోను పెట్టేద్దామని అనుకుంటుండగా అవతల రిసీవరు ఎవరో ఎత్తారు.

లింగమూర్తి ఉత్సాహంగా ముందుకు వంగాడు.

"హలో...."

అవతలినుండి సదాశివం గొంతు వినిపించింది.

"హలో....నేను లింగమూర్తిని. అయిదు నిముషాల క్రితం నేను ఫోను చేశాను."

"ఫోను రింగవడం వినిపించింది. అయితే నువ్వేనన్న మాట, నేను బాత్రూములో వున్నాను. ప్రొద్దున్నే ఫోను చేశావ్ ఏమిటి విశేషం?"

"ఈవేళ నీతో కొన్ని ముఖ్యమైన విషయాలు మాట్లాడాలి .."

"దేని గురించి?"

"మన బిజినెస్ విషయాలే...."

"అలాగైతే వచ్చెయ్...."

"ఊహూ .... ఇప్పుడు కాదు. రాత్రి పదిగంటలకి వస్తాను."

"అంత ఆలస్యంగానా?"

"మనం కూర్చుని చాలరోజులైంది కదా....మాట్లాడిన తరువాత కాస్సేపు కూర్చుందామని" నవ్వాడు లింగమూర్తి.

కూర్చోవడం అంటే మందు కొట్టడం అని వాళ్ళ భాషలో అర్థం.

అవతలనుండి సన్నగా నవ్వు వినబడింది.

"అలాగే....డిన్నర్ ఏర్పాట్లన్నీ చేయిస్తాను."

లింగమూర్తి కంగారుపడ్డాడు.

"వద్దు వద్దు....డిన్నర్ ఏర్పాట్లవీ ఏమీ చెయ్యకు. అలా అయితే నువ్వు పనివాళ్ళని వుంచుతావ్. వాళ్ళందరూ వుండడం నాకు యిష్టంలేదు."

"ఏం....అమ్మాయి నెవరినైనా తీసుకొస్తున్నావా?" శివం నవ్వాడు.

"అదేం కాదు....నీతో ఒంటరిగా కొన్ని విషయాలు మాట్లాడాలి. అన్నట్టు నువ్వు ఒక్కడివే వుంటున్నావ్ కదూ?"

"అవును....ఆవిడ వాళ్ళూరికి వెళ్ళింది. మా అత్త గారికి ఒంట్లో బాలేదని ఉత్తరం వచ్చింది...."

"సరే....అలాగయితే రాత్రి పదిగంటల ప్రాంతంలో వస్తాను....నువ్వు ఎక్కడికైనా బయటికి వెళ్తున్నావా?"

"లేదు....ఈ వేళ ఎక్కడికీ కదలదలుచుకోలేదు. ఏం ఎందుకు?"

"ఏం లేదు .... వీలుంటే ఇంకా ముందు వచ్చి కలుద్దా

మని."

"సరే .... నువ్వు ఏ టైములో వచ్చినా నేను వుంటాను."

"ఉంటా మరి"

"అలాగే ..."

లింగమూర్తి ఫోన్ డిస్కనెక్ట్ చేసి మరో నెంబరు త్రిప్పాడు.

"హలో .... హోటల్ శ్రీదేవా? .... హలో.... నేను హైదరాబాద్ నుండి మాట్లాడుతున్నాను. మీ హోటల్‌లో ఒక డబుల్ రూమ్ కావాలి. లింగమూర్తి పేరుతో బుక్ చెయ్యండి. నేను మరో అయిదారు గంటలకల్లా విజయవాడలో వుంటాను."

మరో నెంబర్ త్రిప్పాడు లింగమూర్తి.

"హలో మురారీ .... నేను లింగమూర్తిని....ఏంలేదు నిన్న మన మూర్తి పెళ్ళికి విజయవాడ వెళ్దామని నువ్వు అంటే నాకు పని వుందని, రానని అన్నానుకదూ....కానీ ఆ పని కాన్సిల్ చేసుకున్నాను....మూర్తి పెళ్ళికి వెళ్ళక పోతే ఎలా అనిపించింది....ఇంతకీ పెళ్ళి ఎన్ని గంటలకి? మధ్యాహ్నం రెండు గంటలకా? .. సరే....నేను మరో అర గంటలో కారు తీసుకుని వస్తాను.... రెడీగా వుండు."

లింగమూర్తి ఫోన్ పెట్టేసి టైం చూసుకున్నాడు.

ఏడున్నర గంటలైంది.

ఎనిమిది గంటలకల్లా తాను మురారి యింటిదగ్గర వుంటాడు. అక్కడ వెంటనే బయలుదేరితే ఒంటి గంటకల్లా విజయవాడ చేరుకుంటారు. హోటలు గదిలో కాస్సేపు విశ్రాంతి తీసుకుని రెండు గంటలకి మూర్తి పెళ్ళికి వెళ్తారు. అక్కడ అందరి దృష్టిలో పడేలా

చూసుకోవాలి.

నాలుగు గంటలకి ఏదో కారణం చెప్పి బయటికి వెళ్తున్నానని హైదరాబాదుకి రావాలి. తొమ్మిదీ, పది మధ్యన తను సదాశివం ఇంటిదగ్గర వుండవచ్చు. సదాశివం తన యిల్లు ఊరికి చివరగా రాజేంద్ర నగర్‌లో ద్రాక్షతోటల మధ్య కట్టుకున్నాడు.

అక్కడ ఏడు దాటితే జన సంచారం వుండదు. ఏం జరిగినా ఎవరికీ తెలీదు. తను అక్కడికి వెళ్ళడం ఎవరూ గమనించరు. తన పని పూర్తి చేసుకుని మళ్ళీ విజయవాడ వెళ్ళిపోతాడు.

లింగమూర్తి తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు.

2

గోడ గడియారం తొమ్మిది గంటలు కొట్టింది.

సదాశివం 'కుర్చీలోంచి లేచి వంటింట్లోకి వెళ్ళి చిన్న గిన్నెలో నీళ్ళలో నానబెట్టిన శనగలు వేసుకుని వచ్చాడు.

పంజరంలోని మైనా ఆకలికి గోలగా అరుస్తుంది.

సదాశివం పంజరం తలుపులు తెరిచి శనగల గిన్నె మైనా ముందు పెట్టాడు. మైనా ఇంకా అరుస్తూనే వుంది.

"అరుపులు ఆపి శనగలు తినవే ముండా" పంజరం తలుపు మూసేస్తూ అన్నాడు.

"తినవే ముండా....తినవే ముండా....తినవే ముండా" పంజరంలోని మైనా రెక్కలు ఆడిస్తూ అంది.

సదాశివం నవ్వుకున్నాడు.

పక్షుల్లో మైనాకి ఒక వింతగుణం వుంది. అది శబ్దాలని సూక్ష్మంగా గ్రహించి అనుకరించగలదు. మనం ఏమైనా అంటే అవి మనల్ని అనుకరిస్తూ వెంటనే ఆ మాట అనగల శక్తి దానికి వుంది.

మైనా శనగలు తినసాగింది.

పనివాడు రంగయ్య సదాశివం ఎదురుగా వచ్చి నిలుచు న్నాడు.

"నువ్వెళ్ళిపో. రేపు ప్రొద్దునే రా"

రంగయ్య వెళ్ళిపోయాడు.

సదాశివం పీధి తలుపు వేసొచ్చి ఈజీఛైర్‌లో కూర్చు న్నాడు.

లింగమూర్తి వచ్చే టైం అయింది అనుకున్నాడు గోడ గడియారం చూస్తూ.

"బ్లడీ బాస్టర్డ్...." లింగమూర్తి గురించి ఆలోచిస్తున్న అతని పెదాలవెంట అనుకోకుండా వచ్చాయి ఆ మాటలు.

"బ్లడీ బాస్టర్డ్....బ్లడీ బాస్టర్డ్....బ్లడీ బాస్టర్డ్"

మైనాకూడా అంది పంజరంలోంచి.

"యూ ఆర్ ట్రూ మైడియర్ స్వీటీ...."

"స్వీటీ....స్వీటీ....స్వీటీ...."

చికాకులో కూడా నవ్వొచ్చింది సదాశివానికి.

ఇంతలో డోర్ బెల్ మ్రోగింది.

సదాశివం లేచివెళ్ళి తలుపు తీశాడు.

ఎదురుగా లింగమూర్తి.

అతని ముఖం వడిలిపోయి వుంది. చాల అలిసిపోయి నట్టు కనిపిస్తున్నాడు.

"లోపలికి రా....ఏమిటి చెప్పిన టైంకంటే ముందు గానే వచ్చేశావే!"

"అవును....నేనొచ్చిన పని అలాంటిది"

ఇద్దరూ గదిలో సోఫాల్లో ఎదురెదురుగా కూర్చున్నారు.

"అన్నట్టు ఏమిటంత అత్యవసర విషయం?....వుండు- మందు పుచ్చుకుంటూ మాట్లాడదాం."

సదాశివం ఫ్రిజ్‌లోంచి సీసాలూ, గ్లాసులూ తెచ్చి ఇద్దరి మధ్యా వున్న టీపాయ్‌మీద పెట్టాడు.

లింగమూర్తి సీసా ఓపెన్‌చేసి విస్కీ రెండు సీసాల్లోకి వేసి సోడాలు కలిపాడు.

"ఛీర్స్...."

ఇద్దరి గ్లాసులూ కలిశాయ్.

"ఛీర్స్....ఛీర్స్....ఛీర్స్...."

మైనాకూడా అంది.

"ఊఁ చెప్పు...."

లింగమూర్తి మాట్లాడలేదు. గ్లాసులోది గటగటా త్రాగేసి మరికాస్త విస్కీ ఒంపుకుని, సోడా కలిపాడు.

లింగమూర్తి ఎప్పటిలా చలాకీగా, సరదాగా లేడు. అతనిలో మార్పు కనిపించింది సదాశివానికి.

"ఏమిటో మాట్లాడాలని అన్నావ్?"

మరోసారి గుర్తుచేశాడు.

లింగమూర్తి సూటిగా సదాశివం ముఖంలోకి చూస్తూ అన్నాడు "ఇప్పటిదాకా ఎంత డబ్బు మింగావ్?"

సదాశివం గొంతులోని విస్కీ గుటక పడక దగ్గు వచ్చేసింది.

"ఏమిటి నువ్వంటున్నది?"

గొంతు రుద్దుకుంటూ ఆశ్చర్యంగా లింగమూర్తి వంక చూస్తూ అన్నాడు.

"మన బిజినెస్‌లో దొంగలెక్కలవీ చూపించి ఇప్పటిదాకా నువ్వు ఎన్ని లక్షలు వెనకేశావ్ అని అడుగుతున్నా. నిన్ను నమ్మి బిజినెస్‌లోని లావాదేవీలన్నీ నిన్ను చూడమంటే నన్నే మోసం చేస్తావా? నీ విషయం నాకు ఏనాడో తెలిసింది. ఇన్నాళ్ళూ నేను ఊరుకున్నానంటే

కేవలం మీ ఆవిడ సుజాత ముఖం చూసే...."

సదాశివం ముఖం జేవురించింది.

"సుజాత!....బ్లడీ బిచ్!!....దానికీ నీకూ మధ్య జరుగుతున్న వ్యవహారం నాకు ఈ మధ్యనే తెలిపింది. అందుకే దాన్ని పుట్టింటికి తరిమేశాను. నువ్వు ఈ బిజినెస్ వ్యవహారాలన్నీ నాకు ఊరికే అప్పజెప్పలేదు. నన్ను బిజినెస్ టూర్లంటూ ఊళ్ళకి పంపించి నువ్వూ....అదీ ..."

సదాశివం పిడికిళ్ళు బిగుసుకున్నాయ్.

లింగమూర్తి తెల్లబోయాడు.

అయితే నీకు మా విషయం తెలుసన్నమాట."

"ఆ కులటకి త్వరలోనే విడాకులు ఇచ్చేస్తాను. అంతే కాదు. మనం విడిపోయి ఎవరి బిజినెస్‌లు వాళ్ళు చూసుకోవడం మంచిది...."

"నీకు అంత శ్రమేం అక్కరలేదు సదాశివం."

లింగమూర్తి వక్రంగా నవ్వాడు.

కోటుజేబులోకి వెళ్ళిన అతని చేయి నల్లగా మెరుస్తున్న పిస్తోలుతో బయటికి వచ్చింది.

"ఇదే నీకు ఆఖరి రోజు...."

సదాశివం ముఖం పాలిపోయింది.

"నాకు ఏమైనా జరుగుతే పోలీసులు నిన్నే అనుమానిస్తారు."

"దాని గురించి నువ్వేమీ బాధపడకు. ప్రస్తుతం నేను విజయవాడలో వున్నాను. అక్కడ బలమైన ఎలిబీ సృష్టించుకున్నాను. నిన్ను చంపి విజయవాడ వెళ్ళిపోయి రేపు ఉదయం ఏమీ ఎరగనివాడిలా హైదరాబాదుకి వస్తాను. కొన్నాళ్ళు ఎవరికీ అనుమానం కలగని విధంగా సుజాతకి దూరంగా వుంటాను. తరువాత సుజాతని పెళ్ళిచేసుకుని

సుజాతకీ, తద్వారా నీ ఆస్థికీ స్వంతదారుని అవుతాను...."

"వద్దు....వద్దు....నన్ను చంపొద్దు."

లింగమూర్తి కళ్ళలోని క్రౌర్యం చూసి వణికిపోసా గాడు సదాశివం.

"ఢాం...."

తుపాకీ గుండు సదాశివం కుడి జబ్బలోంచి దూసుకు పోయింది. బాధగా మూలిగాడు సదాశివం.

రెండోసారి పేలింది పిస్తోలు.

ఈసారి తుపాకీ గుండు అతని ఎడమ జబ్బని రుచి చూపింది.

"ఢాం ... ఢాం ...."

రెండు గుళ్లూ కాలి రెండు తొడలలోంచీ దూసుకు పోయాయి.

"అబ్బా...."

హృదయవిదారకంగా అరుస్తూ నేలమీద పడిపోయాడు సదాశివం.

"ఇంతటితో నీ చరిత్ర క్లోజ్."

తుపాకీ పొట్టకి గురిపెట్టి రెండుసార్లు కాల్చాడు.

రెండు బుల్లెట్లూ పొట్టలోంచి దూసుకుపోయాయి.

సదాశివం నేలకి ఒరిగాడు. అతని చుట్టూ రక్తం మడుగు ఏర్పడసాగింది.

లింగమూర్తి ఒంగి సదాశివం వంక చూశాడు. అతను కొన ఊపిరితో మూలుగుతున్నాడు.

లింగమూర్తి అతన్ని కాలుతో ఒక్క తాపు తన్ని పిస్తోలుని జేబులో వేసుకున్నాడు.

విస్కీ సీసాలమీదా గ్లాసులమీదా తన వేలిముద్రలు చెరి

పేపి సదాశివం దగ్గరికి వెళ్ళాడు.

"సుజాతతో నా పెళ్ళి కార్డు నీకు స్వర్గం అడ్రసుకు పంపిస్తాను....గుడ్ బై !!"

సదాశివం కంటి చివర్లనుండి నీళ్ళు కారుతున్నాయ్.

లింగమూర్తి సదాశివాన్ని మరోసారి కాలుతో తన్నేసి అక్కడినుండి వెళ్ళిపోయాడు.

వీధిలో కారు స్టార్ట్ అయిన శబ్దం వినిపించింది సదాశివానికి.

పిస్తోలు మోతకి హడలిపోయిన మైనా పంజరంలో రెక్కలు టపటప కొట్టుకుంటూ గోలగోలగా అరుస్తుంది.

సదాశివం కన్నీటి పొరల్లోంచి మసక మసకగా కనిపించింది మైనా.

3

లింగమూర్తి విజయవాడ వెళ్ళేసరికి రాత్రి రెండున్నర గంటలయింది.

"ఎక్కడికెళ్ళిపోయావ్ ఇంతసేపూ?"

రూము తలుపు తీసి కళ్ళు నులుముకుంటూ అడిగాడు మురారి.

"బ్రాంచ్ ఆఫీసుకి...."

లింగమూర్తి కన్నుగీటాడు.

"అదేనోయ్....నీలవేణి యింటికి — నీకు చెప్పాననుకుంటా కదూ అప్పుడెప్పుడో...."

"అదృష్టవంతుడివి....ఊరుకో బ్రాంచాఫీసుంది నీకు" నవ్వుతూ అన్నాడు మురారి.

తెల్లవారి ఏడుగంటలకు ఇద్దరూ హైదరాబాదు బయలుదేరారు.

హైదరాబాదులో మురారిని చిక్కడపల్లిలోని అతని ఇంటి దగ్గర డ్రాప్‌చేసి ఖైరతాబాద్‌లోని తన యింటివైపు కారు మళ్ళించాడు లింగమూర్తి.

ఇల్లు చేరేసరికి మధ్యాహ్నం ఒంటిగంట అయింది.

కారు దిగి గేటు తెరుచుకుని లోపలికి వెళ్ళిన లింగమూర్తికి గుమ్మంలో పోలీసులు ఎదురయ్యారు.

"యూ ఆర్ అండర్ అరెస్ట్ మిస్టర్ లింగమూర్తీ."

ఇన్‌స్పెక్టర్ హాండ్ కఫ్స్‌తో ముందుకు వచ్చాడు.

లింగమూర్తి ముఖం పాలిపోయింది.

"ఎందుకూ?"

"సదాశివాన్ని హత్యచేసినందుకు."

"నేను చెయ్యలేదు....నాకేం తెలీదు....నేను విజయ వాడనుండి యిప్పుడే వస్తున్నాను...."

"ఎందుకు మిస్టర్ వృధా ప్రయాస. మేము పెట్టే బాధ లన్నీ భరించి అప్పుడు నిజం చెప్పేకంటే ఇప్పుడు చెప్ప డమే మంచిది. నువ్వే ఈ హత్య చేశావని మాకు రుజువు అయింది...."

లింగమూర్తి తల వొంచుకున్నాడు. ఇన్‌స్పెక్టర్ అతని చేతికి బేడీలు వేశాడు.

అందరూ పోలీసు జీపులోనికి ఎక్కారు.

లింగమూర్తికి అంతా అయోమయంగా వుంది. తను ఏ విధమైన ఆధారాలు లేకుండా ఈ హత్య చేశాడు. సాక్ష్యంకూడా ఏమీ వుండదు....మరి .. మరి....వీళ్ళు తను ఈ హత్య చేసినట్టు ఇంత త్వరగా ఎలా కనుక్కున్నారు.

ఆ విషయాన్నే అడిగాడు లింగమూర్తి ఇన్‌స్పెక్టర్ని.

ఇన్‌స్పెక్టర్ నవ్వాడు.

"మీరే స్వయంగా చూద్దురుగాని...."

జీపు రాజేంద్రనగర్ వైపుకి మళ్ళింది.

సదాశివం యిల్లు వచ్చింది. అందరూ జీపులోంచి దిగి లోపలికి వెళ్ళారు.

గదిలోని శవాన్ని తీసేశారు. ఇంకా ఫింగర్ ప్రింట్ ఎక్స్‌పర్ట్సు కొందరు పోలీసులూ వున్నారు అక్కడ.

"అటు చూడండి" లింగమూర్తికి చూపించాడు ఇన్‌స్పెక్టర్.

పంజరంలోని మైనా పాటపాడుతున్నట్టు అంటూంది.

నన్ను లింగమూర్తి చంపాడు....నన్ను లింగమూర్తి చంపాడు....నన్ను లింగమూర్తి చంపాడు...."

చనిపోతూ సదాశివం దానికి నేర్పిన చివరిమాటలు అవి!! □

"వీడెవడబ్బా?"



విషవాయువు

అజీజ్



"డాక్టర్ సత్యానంద్ స్పీకింగ్!"

"గుడ్ మార్నింగ్ డాక్టర్! నేను యిన్ స్పెక్టర్ యుగంధర రెడ్డిని మాట్లాడుతున్నాను."

"హలో యిన్ స్పెక్టర్! ఏమిటి, ఉదయాన్నే ఫోన్ చేశారు? హత్యకేసా?"

"నో, ఆత్మహత్య కేసు! మరణించింది ఎవరో తెలిస్తే

బహుశా, మీరు తట్టుకోలేరేమోనని భయంగా వుంది."

"ఇన్‌స్పెక్టర్! నేను పోలీసు డాక్టర్ని! మీరు కేవలం మీ డ్యూటీలో, మీ పరిధిలోకి వచ్చే శవాలనే చూస్తారు. నేను మీలాటి ఎందరో ఆఫీసర్ల విచారణలోకి వచ్చే శవాలని చూడడమేకాదు, వాటిని కోసి ముక్కలుచేసి, మరీ పరీక్షిస్తాను. ఆ విధంగా నా రొటీన్ లైఫ్‌లో మరణమన్నా, శవాలన్నా చాలా మామూలు విషయమైపోయింది. ఆ లెక్కన మీరు చెప్పదలుచుకున్నది చాలా నిర్భయంగా చెప్పవచ్చు. ఎవరు చంపబడ్డారు?"

"మీ చిరకాల మిత్రుడు, ప్రఖ్యాత సైంటిస్టు ప్రొఫెసర్ మల్లికార్జునరావుగారు!"

ఆ పేరు వినగానే చేతిలోంచి జారి పడబోతున్న రిసీవర్ని గట్టిగా అదిమి పట్టుకున్నాడు డాక్టర్. అదివరకు యిన్‌స్పెక్టర్‌తో ఆయన పలికిన ప్రగల్భాలన్నీ ఒక్కసారి వమ్మైపోయాయి. దిగ్భ్రాంతితో రెండు కళ్లూ పెద్ద వయ్యాయి. మాటలు పెగలక అచేతనుడైపోయాడు క్షణం పాటు.

అతి కష్టంమీద గొంతు పెగిల్చుకుని, "ఏమన్నారూ?" అడిగాడు ఇంకా నమ్మకం కుదరనట్టు.

"ఔను డాక్టర్! మరణించింది మీ మిత్రులు మల్లికార్జున రావుగారే! ఆయనింటినించే నేను ఫోన్‌చేస్తున్నాను. అంబులెన్స్‌లో త్వరగా వచ్చేయండిక్కడికి" వినిపించింది అవతలినించి యిన్‌స్పెక్టర్ కంఠం.

"అలాగే....అలాగే ఇప్పుడే వస్తున్నాను. శవాన్ని ఎవ్వరూ తాకకుండా చూడండి. అంతేకాదు. ఆ పరిసరాలకెవ్వరినీ వెళ్ళనివ్వకండి."

"ఆల్‌రైట్! శవం ఆయన లేబొరేటరీలోనే యథా

తథంగా వుంది.”

“ఐసీ, వస్తున్నాను. కొద్ది నిమిషాల్లో” అంటూ రిసీవర్ని క్రెడిల్ మీదుంచి, అప్పుడు గమనించాడు డాక్టర్ వణుకుతున్న తన చేతిని.

అందుక్కారణం లేకపోలేదు. ప్రొఫెసర్ మల్లికార్జున రావుతో ఆయన అనుబంధం ఈనాటిది కాదు. పాతికేళ్ళ పురాతన సాంగత్యం! ఇద్దరూ ఒకే యూనివర్సిటీలో మెడిసన్ చదివారు. మెడిసన్ పూర్తయ్యాక తను పోలీస్ శాఖలో డాక్టర్‌గా చేరితే, ఆయన అంతటితో తృప్తిపడక ఆర్గానిక్ కెమిస్ట్రీలో మాస్టర్ డిగ్రీ తీసుకుని, విడిగా స్వంత లేబొరేటరీలో వివిధ విషయాలపై ప్రయోగాలు చేస్తూ, కొంగ్రొత్త మందులు కనిపెడుతూ, ఆ ఫార్ములా హక్కుల్ని దేశంలోని ప్రముఖ మందులకంపెనీల కమ్ముతూ రెండు చేతులా ఆర్జించసాగాడు.

ఆయన జీవితాశయమూ, మానసిక తృప్తీ ఆ ప్రయోగాల పరిధికే పరిమితం కావడంవల్ల వివాహంపట్ల ఆయనకు మొదటినించీ ఆసక్తి లేకపోయింది. అందుకే ఏభై ఏళ్ళు నిండుతున్నా యింతవరకూ ఆయన అవివాహితుడుగానే వుండిపోయాడు.

ఐతే, సంతానంలేని లోటు తీర్చుకోడానికి మరణించిన తన అన్నకొడుకును దత్తత తీసుకుని, పెంచుకుంటున్నాడు. ఆ కుర్రాడి ఆలనాపాలనా చూసుకోడానికి వితంతువైన తన సవతి చెల్లెల్ని తనవద్దే వుంచుకుని పోషిస్తున్నాడు.

ఐతే, ఆ పెంపుడు కొడుకు ప్రశాంత్ అటు అత్త కట్టుబాట్లను లెక్కచెయ్యక సర్వస్వతంత్రుడిగా పెరుగుతూ సరిగా చదువు అబ్బక, చెడు సావాసాలు మరిగి, యిప్పుడు యవ్వన ప్రాంగణంలో అడుగిడి తండ్రినే ఖాతరు చెయ్యని

స్థాయికి ఎదిగాడు.

ఓ పోరంబోకి క్రిస్టియన్ అమ్మాయి మాయలోపడి, ఆ పిల్లనే పెళ్ళి చేసుకుంటానంటూ తరుచూ తండ్రితో వాగ్వివాదానికి దిగుతుంటాడట....

జీవన భృతులు వేరైనా, మిత్రులిద్దరూ ఒకే నగరంలో వుంటున్నారు గనక, ప్రతి ఆదివారం డాక్టర్ సత్యానంద్ క్రమం తప్పకుండా ప్రొఫెసర్ యింటికెళ్ళి, చదరంగం ఆడుతూ కాలక్షేపం చెయ్యడం ఆనవాయితీగా వస్తోంది. ఇప్పటికీ, ప్రొఫెసర్ తన పెంపుడు కొడుకు విషయంలో తప్ప మరే విషయంలోనూ ఎటువంటి చీకూ చింతా వ్యక్తం చేసేవాడు కాదు.

అలాంటి వ్యక్తి ఆత్మహత్య వంటి తీవ్రమైన నిర్ణయం తీసుకున్నాడంటే, ఎలా నమ్మాలో ఆలోచిస్తూ అంబులెన్స్‌లో హుటాహుటిన ప్రొఫెసర్ ఇంటికి చేరుకున్నాడు డాక్టర్. ఆయనకోసమే ఎదురుచూస్తూ పోర్టికోలో పచార్లు చేస్తున్నాడు యిన్‌స్పెక్టర్ యుగంధర రెడ్డి.

డాక్టర్ అంబులెన్స్‌లోంచి దిగి, వరండా మెట్లెక్కుతూ వుండగా లోపలి నించి ప్రొఫెసర్ చెల్లెలు వచ్చి, "అన్నయ్యా!" అంటూ బావురుమంది.

సుమారు నలభై ఏళ్ళుంటాయామెకు. ముప్పైఏళ్ళ ప్రాయంలోనే భర్తృహీనగామారి, తెల్ల వస్త్రాలకు పరిమితమై వితంతు జీవితానికలవాటు పడిపోయింది. ఆమె వెనకే ప్రశాంత్ తప్పుచేసిన వాడిలా తలవంచుకుని వచ్చి గుడ్లనీరు కుక్కుకున్నాడు.

వాళ్ళతో మాట్లాడుతూ కాలయాపన చెయ్యడం ఇష్టం లేక, "ముందు శవాన్ని చూడాలి. పదండి" అన్నాడు డాక్టర్ ఇన్‌స్పెక్టర్‌తో.

ఆయన్ని వెంటబెట్టుకుని, లాబొరేటరీవైపు తీసికెళ్ళాడు ఇన్‌స్పెక్టర్.

లేబొరేటరీ తలుపు పగిలివుండడం చూసి, "ఇదేమిటి?" అడిగాడు డాక్టర్ ఆశ్చర్యంగా. "మేము వచ్చినప్పుడు తలుపు మూసి వుంది. లోపల తాళం వేసివుంది. పిడిమీద ఈ చీటీ అంటించి వుంది" అంటూ జేబులోంచి ఓ కాగితం తీసి ఆయన కందించాడు ఇన్‌స్పెక్టర్.

టైప్‌రైటర్‌తో రెండేరెండు లైన్లు టైప్ చెయ్యబడు న్నాయి దానిమీద.

'తలుపు తెరిచేముందు జాగ్రత్త!

లోపల విష వాయువు వుంది!!'

"ఈ చీటీ చూడగానే నేను బాగా ఆలోచించి, ముందు ఇంటి చుట్టూ ఓ ప్రదక్షిణం చేశాను. లేబొరేటరీ అవతలి వైపు ఓ అద్దాల కిటికీ వుంది. దాని రెక్కలు మూసి వున్నాయి. రాయితో దాని అద్దాలు పగలగొట్టాను. ఆ విధంగా గాలి లోపలికెళ్ళి, లోపలున్న విష వాయువును పల్చబరుస్తుందని నా ఆలోచన.

ఆ పనయ్యాక తిరిగి ఇక్కడికి వచ్చి, గొడ్డలి తెప్పించి, తలుపుమీద మూసి వున్న వెంటిలేటర్, రెక్క అద్దాలని కూడా పగలగొట్టించాను. తరవాత తలుపును పగలగొట్టించి, వెంటనే లోపలికెళ్ళకుండా పావుగంట బైటే వుండి, విష ప్రభావం పూర్తిగా పోయాక, నెమ్మదిగా లోని కెళ్ళాను" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

సాలోచనగా తలూపుతూ విరిగిన తలుపును పరిశీ లించాడు డాక్టర్. అది డోర్ లాక్ సిస్టం తలుపు. అంటే, తలుపు లోపలే తాళం బిగించి వుంటుంది. తాళం తియ్యా డానికి దానిమధ్య రంధ్రం వుంటుంది. ప్రొఫెసర్ లోపల

ప్రయోగాల్లో మునిగి తేలుతున్నప్పుడు ఎవ్వరూ తనని డిస్టర్బ్ చెయ్యకుండా తలుపుమూసి. లాక్ చేసేవాడు.

"ఆయన లోపల ఆత్మహత్య చేసుకున్నాడని ఎవరు ఫోన్ చేశారు మీకు?"

"ఆయన చెల్లెలు. ఉదయం ఎనిమిది గంటలైనా ప్రొఫెసర్ ఇంట్లో యెక్కడా కనిపించకపోయేసరికి, ముందాయన పడగ్గదికెళ్ళి చూసిందిట. పడగ్గది తలుపులు బార్లా తెరిచి వుండటం లేబొరేటరీలో వున్నాడేమోనని ఈ వైపు వచ్చిందట.

తలుపు పిడికంటించి వున్న ఈ చీటీ చూడగానే అనుమానం వచ్చి, కీ హోల్లో కన్నుపెట్టి లోపలికి చూసిందట. లోన చలనం లేకుండా కూర్చున్న ప్రొఫెసర్ కనిపించేసరికి, గట్టిగా పిలిచిందట. యెంత పిలిచినా ఆయన జవాబివ్వక పోవడంతో ఖంగారుపడి. మాకు ఫోన్ చేసింది!" చెప్పాడు ఇన్స్పెక్టర్.

"అప్పుడు ప్రశాంత్ యెక్కడున్నాడు?"

"రాత్రి ప్రొఫెసర్‌తో ఘర్షణపడి, భోంచెయ్యకుండా వెళ్ళి తన గదిలో పడుకున్నాడట. ఉదయం వెళ్ళి ఆమె లేపేవరకూ లేవలేదట."

"అది ఆత్మ హత్య అని యెలా నిర్ణయించారు మీరు?"

"లోపల విషవాయువు వుందని హెచ్చరిస్తూ బైట చీటీ అంటించిన వ్యక్తి తలుపులు మూసుకుని లోపల కూర్చున్నాడంటే ఏమనుకోవాలి మరి?"

"ఐసీ. రండి. చూద్దాం!" అంటూ లేబొరేటరీలో అడుగుపెట్టాడు డాక్టర్.

అది విశాలమైన హాలు. హాలు మధ్య పదడుగుల పొడవూ, నాలుగడుగుల వెడల్పూ వున్న భారీ టేకు బల్ల

వుంది. బల్లనిండా రకరకాల ఆకృతుల్లో గాజు ట్యూబులూ, జార్‌లూ, దిమ్మెలూ, కూజాలూ నిండివున్నాయి. వాటిలో అంతో యింతో రంగురంగుల ద్రవాలు కనిపిస్తున్నాయి. గోడలనిండా సైన్సుకు సంబంధించిన మ్యాపులూ, చిత్రపటాలు వేలాడుతున్నాయి.

ఆ బల్ల మొదటి కోడుకు ఆనించి ఉన్న కుర్చీలో ఇటు తిరిగి కూర్చునున్నాడు ప్రొఫెసర్. అంటే, బల్ల కోడుకు కుర్చీ వీపు ఆనించి ఉందన్నమాట. ఆయన చేతులు రెండూ ఆకుకూర కాడల్లా కిందికి వేలాడుతున్నాయి. అస్తవ్యస్తంగా పెరిగిన తెల్లని చింపిరి జుత్తు ఫ్రెంచి కట్ గెడ్డం మీసాలు, గుంటకళ్ళు. తల గుండెమీదకి వాలివుంది. అలా వాలడంవల్ల ఆయన కళ్ళజోడు ముక్కు చివరి వరకూ జారి, కిందపడకుండా అలాగే ఉండిపోయింది.

కుర్చీలో కూర్చుని మరణించే ముందు కాళ్ళ బూట్సూ, సాక్సూ విప్పినట్టున్నాడు. అవి అస్తవ్యస్తంగా ఆయన కాళ్ళ దగ్గర పడున్నాయి. యెడంకాలు మడిచి, ఆ పాదాన్ని సమతలంగా నెలమీద ఆనించి, కుడికాలు మాత్రం పొడుగ్గా బారా చాపి, మడమ నెలకానించి, పాదం నిటారుగా నిలబెట్టాడు.

కుర్చీకి కాస్త దూరంలో నెలమీద పొడవాటి తాళం చెవి పడుంది. బహుశా అది విరిగిపడున్న తలుపు తాళం చెవే అయుంటుంది. ఓ పక్క గోడవారగా, ప్రొఫెసర్ రైటింగ్ టేబిల్, దానిమీద ఓ టైప్‌రైటర్, టేబిల్ కిరుపక్కలా రెండు కుర్చీలూ ఉన్నాయి. ఆ టైప్‌రైటర్ మీదే ఆ హెచ్చరిక చీటీ టైపు చెయ్యబడుంటుంది.

సాలోచనగా తలూపుతూ శవాన్ని సమీపించి, వేళ్ళాడుతున్న చేతులు, ఒళ్ళోపెట్టి, అరచేతి మణికట్ల దగ్గర

కోటును వెనక్కి జరిపి, పరీక్షగా చూశాడు డాక్టర్. మణి కట్లమీద చర్మం బాగా వత్తుకుపోయినట్టు సన్నని గీతలా కనిపిస్తోంది. ఏమిటది?

తీవ్రాలోచనల్లో మునిగిపోయాడు డాక్టర్. రెండు నిమిషాల తర్వాత ఏదో స్ఫురించినట్లు చటుక్కున తలతిప్పి, తలుపుమీది వెంటిలేటర్ని చూస్తూ రైటింగ్ టేబిల్ పక్కనున్న కుర్చీని అక్కడికి జరిపి, దానిమీది కెక్కాడు.

అవసరం లేనప్పుడు వెంటిలేటర్ని మూసెయ్యడానికి దాని మధ్య అడ్డంగా చిన్న రెక్కకూడా వుంది. ఆ రెక్కను పైకెత్తి, చెక్కఫ్రేం క్రిందిభాగాన్ని జాగ్రత్తగా పరిశీలించాడు. అక్కడ బాగా దుమ్ము పేరుకునుంది. కాసేపు ఆ దుమ్మును సూక్ష్మంగా పరిశీలించి, కుర్చీ దిగి, తిరిగి యిన్స్పెక్టర్ని సమీపించాడు.

"విషయం కొద్ది కొద్దిగా అర్థమౌతోంది. ఇప్పుడు ప్రొఫెసర్ మరణానికి కారణమైన ఆ గ్యాస్ ఎక్కణ్ణించి, ఎలా వాడబడిందో ఆరాతియ్యాలి" అంటూ ఎక్స్పెరిమెంట్ బల్లమీదికి దృష్టిని సారించాడు డాక్టర్.

అసంఖ్యాకంగా అమర్చి వున్న ఆ పరికరాలను ఐదు నిమిషాలు జాగ్రత్తగా పరిశీలించాక కనిపించింది పగిలిన ఓ గ్లాస్ ట్యూబ్! బల్లను సమీపించి, వంగి దాన్ని నిశితంగా పరీక్షించాడు. సరిగ్గా ఒక అడుగు పొడవూ, ఆరంగుళాల మందం గల ట్యూబ్ అది.

దానిమీద కనీ కనిపించని విధంగా మనిషి పుర్రె, దాని కింద ఎక్స్గుర్తులో రెండు ఎముకలూ చిత్రించి వున్నాయి.

"ఆ విషవాయువు ఖచ్చితంగా ఇందులోనిదే అయుండాలి. ట్యూబ్ పగలగొట్టడంవల్ల గ్యాస్ గదిలో వ్యాపించి ప్రొఫెసర్ ప్రాణాలు తీసింది. ఈ ట్యూబ్ ముక్కల్ని

మన లాబొరేటరీకి తీసికెళ్ళి పరీక్షి స్తే అది ఏ విషవాయువో తెలిసిపోతుంది.

శవం రిగర్‌మార్టిస్ని బట్టి, ప్రొఫెసర్ మరణం రాత్రి పన్నెండూ ఒంటిగంట మధ్య జరిగి వుంటుందని నా అభి ప్రాయం। అది సరే, ముందు ప్రొఫెసర్ సోదరినీ, కొడుకునూ ఇలా పిలవండి. కొన్ని వివరాలు అడిగి తెలుసుకుందాం।" అన్నాడు డాక్టర్.

ఇన్‌స్పెక్టర్ బైటికెళ్ళి ఆమెనూ, ప్రశాంత్‌నూ పిల్చుకొచ్చాడు. ప్రొఫెసర్ సోదరి పేరు విజయలక్ష్మి.

"రాత్రి ఇంట్లో ఏం జరిగింది వివరంగా చెప్పండి" అడిగాడు డాక్టర్ ఆమెని.

ప్రొఫెసర్ శవాన్ని చూడగానే ఆవిడ మళ్ళీ బావురుమంది. "ఈ లోకంలో నాకంటూ మిగిలిన ఒక్కగానొక్క సోదరుడు నన్ను ఏకాకిని చేసిపోయాడు. ఇక నాకెవరు దిక్కు? ఏం చూసుకుని బ్రతకను?" అంటూ ప్రశాంత్ వైపు తిరిగి,

"అంతా ఈ అప్రాచ్యుడివల్లే జరిగింది. ఆ కిరిస్తానీపిల్ల గురించి రాత్రి వీడు అన్నయ్యతో మళ్ళీ ఘర్షణపడ్డాడు. తన కంఠంలో ప్రాణం వుండగా ఆ పిల్లను తన కోడలిగా అంగీకరించనని అన్నయ్య ఖచ్చితంగా చెప్పేశాడు.

దాంతో వీడు తన బొందిలో ప్రాణం వుండగా ఆ పిల్లను తప్ప మరొకర్ని చేసుకోనని కుండ బద్దలు కొట్టినట్టు చెప్పేశాడు. తల్లీ, తండ్రిని పోగొట్టుకున్న జానెడు బుడతణ్ణి తెచ్చి ప్రాణప్రదంగా పెంచి పెద్దవాణ్ని చేసినందుకు ఈ విధంగా వీడాయన ఋణం తీర్చుకున్నాడు.

అన్నయ్యకు కులమతాల పట్టింపు అసలు లేనేలేవు. ఐతే, ఒకటి రెండుసార్లు వీడివెంట ఆ పిల్ల యిక్కడికి

వచ్చినప్పుడు ఆ అమ్మాయి హావభావాలు ఎందుకో అన్న య్యకు నచ్చలేదు. అందుకే ఆయన అంతగా ఆ పిల్లను వ్యతిరేకించేవాడు.

రాత్రి జరిగిన ఘర్షణతో అన్నయ్య మనసు బాగా వికల మైనట్టుంది. అందుకే వీడు తన గదిలో కెళ్ళిపోగానే, లాయర్ గురుపాదంగారికి ఫోన్‌జేసి, పిలిపించాడు. ఆయన రాగానే యిక్కడికి తీసుకొచ్చి, తలుపుమూసి, చాలాసేపు ఏదో మాట్లాడుతూ కూర్చున్నారు.

నేను నా గదిలోకెళ్ళి, నడుం వాల్చి పరిపరివిధాల ఆలో చిస్తూ ఊరికే అలా పడుకున్నాను. బాగా పొద్దుపోయాక, గురుపాదంగారు బైటినించి నన్ను కేకేస్తే లేచి బైటికి వచ్చాను. తలుపులు మూసుకోమని చెప్పి వెళ్ళిపోయా డాయన.

అన్నయ్య యింకా లాబొరేటరీలోంచి బైటికి రాలేదు. నేను యింటి తలుపులు మూసి, తిరిగి నా గదిలోకెళ్ళి పడు కున్నాను. ఉదయం లేచిచూస్తే ఈ దారుణం...." అంటూ మరి చెప్పలేక కొంగు నోటికడ్డం పెట్టుకుని వెక్కి వెక్కి ఏడవసాగింది విజయలక్ష్మి.

"మీరు పడుకునేటప్పుడు టైం ఎంతై వుంటుంది?" అడిగాడు డాక్టర్.

"ఒంటిగంట!"

"అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలుగుతున్నారు?"

"అప్పుడే గోడగడియారం ఒంటిగంట కొట్టింది."

"గోడ గడియారం అరగంటనుకూడా ఒకేసారి కొడు తుంది. గడియారంవైపు చూశారా మీరు?"

"లేదు. ఒంటిగంటయి వుంటుందని ఊహించానంతే!"

"ప్రొఫెసర్ అంతసేపు లాయర్‌తో మాట్లాడాడంటే,

ఏదో ముఖ్య విషయమే చర్చించి వుండాలి. గురుపాదం గార్ని పిలిపించి కనుక్కోడం మంచిది" అంటూ ప్రశాంత్ వైపు తిరిగి, "మీ నాన్నతో వాగ్వివాదం జరిగాక నువ్వెక్కడికెళ్ళావ్?" అడిగాడు డాక్టర్.

"తిన్నగా నా గదిలోకెళ్ళి తలుపేసుకున్నాను.... గ్లోరీ విషయంలో మా మధ్య ఇదివరకు అనేకసార్లు మాటా మాటా పెరిగిన సంగతి నిజమే! అంతమాత్రానికే నాన్న చేజేతులా తన ప్రాణాలు తీసుకుంటాడని నేను కల్లోకూడా ఊహించలేదు" అన్నాడు ప్రశాంత్ దించిన తల యెత్తకుండా.

"మీ నాన్న తనకు తానుగా తన ప్రాణాలు తీసుకోలేదు. బలవంతంగా తియ్యబడ్డాయి. మీరనుకుంటున్నట్టు ఆయన ఆత్మహత్య చేసుకోలేదు. కిరాతకంగా హత్యచెయ్యబడ్డాడు!" అన్న డాక్టర్ మాటలు విని, ఇన్‌స్పెక్టర్‌తోబాటు విజయలక్ష్మి, ప్రశాంత్‌లు ఉలిక్కిపడి, "హత్యా!" అన్నారు ముక్తకంఠంతో.

తలూపాడు డాక్టర్.

"ఆత్మహత్య అని ఇంత స్పష్టంగా తెలుస్తుంటే, దీన్ని హత్యగా చిత్రించడంలోని ఔచిత్యమేమిటో నా కర్థం కావడంలేదు డాక్టర్.... ఇది మీ లైన్ కాదు. హత్యో ఆత్మహత్యో తేల్చుకోవలసింది మేము" అన్నాడు యిన్‌స్పెక్టర్ నిర్మొహమాటంగా.

డాక్టర్ మొహం జేవురించింది. "ఇది నూటికి నూరుపాళ్ళు హత్యేనని నిరూపించడానికి నా వద్ద అనేక ఆధారాలున్నాయి. అవి తరవాత నిరూపిస్తాను. ముందు లాయర్ గురుపాదంగార్ని పిలిపించి, రాత్రి మల్లికార్జున్ ఆయనతో ఏం మాట్లాడాడో కనుక్కోవాలి" అంటూ రైటింగ్ టేబిల్

మీదున్న టెలిఫోన్‌వైపు నడిచి, లాయర్ యింటికి రింగ్ చేసి, ప్రొఫెసర్ మరణంగురించి చెప్పి, సాధ్యమైనంత త్వరగా అక్కడికి చేరుకోమని కోరాడు.

అరగంటలో హుటాహుటిన వచ్చేశాడు లాయర్. సుమారు నలభై, నలభై ఐదేళ్ళుంటాయతనికి. సన్నగా, పొడుగ్గా వున్నాడు కళ్ళకి అద్దాలు. లేత నీలిరంగు ఫుల్ సూటు. మెడలో చారల టై.

లాబొరేటరీలోకి అడుగుపెట్టి, ప్రొఫెసర్ శవాన్ని చూడగానే మాట పెగలక రెండు నిమిషాలు స్థాణువై పోయాడు నిల్చున్నచోటే. తరవాత గొంతు పెగిల్చుకుని, రాత్రి నిక్షేపంగా నాతో మాట్లాడిన వ్యక్తి ఇప్పుడీ లోకాన్నే శాశ్వతంగా విడిచిపెట్టాడంటే నమ్మలేకపోతున్నాను....” అనగలిగాడు అతికష్టంమీద.

“ఔను. కొన్ని సంఘటనలు మన ఊహకందకుండా, హఠాత్తుగా జరిగిపోతుంటాయి. జరిగిందానికి విచారిస్తూ కూర్చునేబదులు జరగబోయేదాని గురించి యోచించడం మంచిది. ప్రొఫెసర్ చావు సహజమైనది కాదు. అతను హత్యజెయ్యబడ్డాడని నా అనుమానం!”

“హత్యా!” లాయర్ కళ్ళు విప్పారి, అప్రయత్నంగా ప్రశాంత్ వైపు మళ్ళాయి.

డాక్టర్ తలూపి, “ఇప్పుడు చెప్పండి. రాత్రి ప్రొఫెసర్ మిమ్మల్ని పిలిపించి ఏం మాట్లాడాడు?” అడిగాడు.

“తాను జీవితంలో రెండే రెండు తీవ్రమైన తప్పులు చేశాననీ. మొదటి తప్పు తగిన వయసులో పెళ్ళి జేసుకోక పోవడం, రెండోది ప్రశాంత్‌ని దత్తత తీసుకోవడమనీ, తన ఆశయాలను, ఆశలను వమ్ము జేశాడనీ, ఈ రోజుతో అతనిపట్ల తనకున్న ప్రేమానురాగాలు పూర్తిగా తుడిచి

పెట్టుకుపోయి, మనసు విరిగిపోయిందనీ,

తన మరణానంతరం తన యావదాస్తినీ అతను దుర్వినియోగం చెయ్యకుండా, ఇప్పుడే సద్వినియోగం చెందే ఏర్పాట్లు చెయ్యదలచాననీ చెప్పి, విల్లు తయారు చెయ్యవలసిందిగా కోరారు.

అందులో, ఇన్నాళ్ళూ తనని కనిపెట్టుకునుండి, సేవలు చేసిన సవతి చెల్లెలు విజయలక్ష్మికి ఆమె జీవితాంతం జీవన భృతిగా ప్రతినెలా వెయ్యిరూపాయలు అందడమేగాక, ఆమె నివాసం నిమిత్తం యీ యిల్లు కూడా ఆమె పేరే వుండాలనీ,

ఇన్నాళ్ళూ మానసికంగా తనను కష్టపెట్టిన ప్రశాంత్‌కు అతని తండ్రికి సంబంధించిన ఆస్తి తప్ప తన ఆస్తిలో చిల్లికానీ లభించకూడదనీ చెప్పి, తను కష్టపడి సంపాదించిన స్థిర, చరాస్తుల్నీ నగదునూ నాలుగు భాగాలు జేసి, ఓ అనాథ శరణాలయానికీ, అవిటి పిల్లల సంక్షేమ సంస్థకూ, మూడోభాగం వితంతువులైన మాజీభారత సైనికుల భార్యల సంక్షేమ సంస్థకూ, నాలుగో భాగం ప్రపంచ దీన జనబంధు మదర్ థెరెసా సంస్థకూ చెందేలా విల్లు తయారుజేసి ఈ ఉదయం పదకొండు గంటలకు తెచ్చి, తనకు చూపితే యిద్దరు సాక్షుల సమక్షంలో సంతకం పెడతాననీ చెప్పారు.

అలాగే చేసుకువస్తానని చెప్పి, రాత్రి సుమారు పన్నెండున్నర ప్రాంతంలో సెలవు తీసుకుని వెళ్ళిపోయాను" అంటూ ముగించాడు లాయర్.

"ప్రొఫెసర్ హత్య చెయ్యబడ్డారని ఏ ఆధారాలతో మీరు చెప్పగలుగుతున్నారో కాస్త వివరించండి డాక్టర్.

వినాలని మాకు చాలా కుతూహలంగా వుంది” అన్నాడు ఇన్‌స్పెక్టర్ యుగంధర రెడ్డి వ్యంగ్యంగా.

డాక్టర్ సత్యానంద్ నవ్వి “చెబుతాను” అంటూ జేబు లోంచి సిగరెట్ కేస్‌తీసి, సిగరెట్ నోట్లో పెట్టుకుని, పక్కనే వున్న లాయర్‌కు కేసందించాడు. లాయర్ కేసు లోంచి ఓ సిగరెట్ అందుకోగానే లైటర్‌తో రెండు సిగ రెట్లూ అంటించి చెప్పసాగాడు.

“మొదటి ఆధారం రైటింగ్ టేబిల్ దగ్గరుండవలసిన కుర్చీ, ఎక్స్‌పెరిమెంట్ బల్ల దగ్గరుండటం! అదీ, కుర్చీ వీపు బల్లకోడు కానించి వుండటం! ఎవరైనా పని చేసే టప్పుడు బల్ల కభిముఖంగా కుర్చీ వేసుక్కూర్చుంటారు గానీ, అలా కోడుకు వీపానించి కూర్చోరు.

రెండో ఆధారం, ప్రొఫెసర్ మణికట్టు చుట్టూ చర్మం గాటువేసినట్టు బాగా ఒత్తుకుపోయివుంది. దీన్నిబట్టి ఎవ్వరో రైటింగ్ టేబిల్ దగ్గరున్న కుర్చీని బల్లకోడుకానించి, ఆయన్ని బలవంతంగా కుర్చీలో కుదేసి, చేతులు వెనక్కి విరిచి, పొడవాటి తాడుతో బల్లకోడుకు చేతులు బిగించి కట్టి, తాడు రెండో కొనను తలుపుమీది వెంటిలేటర్ గుండా బైటికి జేర్చి,

వెంటిలేటర్ రెక్కను కొద్దిగా మూతవేసి, తరవాత గదిలోని కిటికీ రెక్కలు మూసేసి, ఎక్స్‌పెరిమెంట్ బల్ల మీదున్న విషవాయువు ట్యూబ్‌ను పగలగొట్టి, మెరుపులా గదిలోంచి బైటికి పరిగెత్తి, తలుపు మూసివుండాలి.

అప్పటికే విషవాయువు ప్రభావంతో ప్రొఫెసర్‌కు మైకం కమ్ముకునుంటుంది. అప్పుడే హంతకుడు వెంటి లేటర్‌లోంచి బైటికి జేర్చిన తాడు కొనను పట్టి గట్టిగా లాగివుంటాడు.

అలా లాగగానే కట్టు విడిపోయేలా ముందే ప్రొఫెసర్ చేతులకు ప్రత్యేకంగా తాడు ముడివేసి వుండటంవల్ల లాగిన మరుక్షణం తాడు విడిపోయింది. దాన్ని అలాగే వెంటి లేటర్‌గుండా బైటికి లాగి, తనవెంట తీసుకెళ్ళాడు హంతకుడు.”

“ఇంతవరకూ బాగానేవుంది. ఐతే, మేము వచ్చినప్పుడు తలుపు లోపలినించి లాక్‌జేసి వుంది. అదుగో, దాని తాళం చెవి కూడా నేలమీద యిక్కడే పడుంది. హంతకుడు బైట వుండగా, ప్రొఫెసర్ చేతులు కట్టి వుండగా తలుపు లోపలినించి ఎవరు లాక్‌జేశారు? అదెలా సంభవం? అడిగాడు ఇన్‌స్పెక్టర్.

“అదీ చెబుతాను....” అంటూ సిగరెట్ పొగ దట్టంగా లాగి, వదిలి, చెప్పసాగాడు డాక్టర్. “తలుపు మూసే ముందు హంతకుడు తలుపు కీ హోల్లో తాళం వుంచి, దాని పిడికి పొడవాటి సన్నని వైర్‌కట్టి, దాని రెండో కొనను తలుపు కింద సందుగుండా బైటికి లాగివుంటాడు.

ఈ పనంతా అతను ప్రొఫెసర్ని బంధించాక, విష వాయువు ట్యూబ్ పగలగొట్టకముందే చేసివుండాలి. తలుపు మూయగానే ఆటోమెటిక్‌గా తాళం చెవి ట్విస్ట్ అయి, తలుపు తాళం లాక్ అవుతుంది గనక, తరవాత బైటి నించి వైర్ నెమ్మదిగా కదుల్చుతూ తాళం చెవిని కీ హోల్లోంచి కింద పడగొట్టి, తలుపు కింద సందుగుండా బైటికిలాగి, తలుపు పైని వెంటిలేటర్లోంచి తిరిగి తాళం చెవిని గదిలోకి,అంటే ప్రొఫెసర్ కూర్చున్న చోటికి విసిరి ఉంటాడు.

తనను బల్లకోడుకు బంధించినప్పుడు ప్రొఫెసర్ హంతకుడితో ఏ మాత్రం కలియబడ్డట్టుగానీ, పెనుగులాడి

నట్టుగానీ ఆధారాలు కనిపించటంలేదు. దీన్నిబట్టి హంతకుడు ఆయనకన్నా వయసులో చిన్నవాడూ, బలవంతుడూ అయుండాలని స్పష్టమౌతోంది."

"మీ థియరీ, లాయర్‌గారు చెప్పిందీ నిజమైతే, ప్రొఫెసర్ని హత్యజెయ్యడానికి బలీయమైన కారణాలు ప్రశాంత్‌కు తప్ప మరెవ్వరికీ కనిపించడంలేదు. రాత్రి లాయర్‌గారి మధ్యా, ప్రొఫెసర్‌గారి మధ్యా జరిగిన సంభాషణంతా అతను గది బైటవుండి వినివుండాలి.

ఆ స్థితిలో తనకు చిల్లికానీ దక్కకుండా ప్రొఫెసర్ వీలునామా తయారు చెయ్యమని లాయర్ని కోరడంతో అది అమల్లోకి రాకముందే ఆయన్ని తుదముట్టిస్తే చట్టంప్రకారం ఆయన యావదాస్తీ తనకే చెందుతుందని తలచి, లాయర్ వెళ్ళిపోయాక మీరు చెప్పినట్టు తన పథకాన్ని అమలుపర్చి వుంటాడు" అన్నాడు ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ వైపుచూస్తూ.

అంతవరకూ నేలచూపులు చూస్తూ నిల్చున్న ప్రశాంత్ ఒక్కసారి తలెత్తాడు. భయంతో అతని కళ్ళు విప్పారాయి. "ఇది అన్యాయం! అక్రమం! నేనే పాపం ఎరగను అంకుల్! మీరైనా చెప్పండి ఇన్‌స్పెక్టర్‌కు" అన్నాడు వణికే కంఠంతో.

పెదవి విరిచాడు డాక్టర్. "అయామ్ సారీ ప్రశాంత్! పరిస్థితులు నీకు వ్యతిరేకంగా వున్నాయి. నేనేం చెయ్యలేను" అంటూ విజయిలక్ష్మి వైపు తిరిగి, "రాత్రి ప్రశాంత్ ఏ దుస్తులు తొడుక్కున్నాడు?" అడిగాడు.

ఆమె క్షణం ఆలోచించి, "నీలిరంగు పాంటూ, దాని మీద ఎరుపు రంగు ఫుల్ స్వెట్టర్ తొడుకున్నాడు," అంది.

"ఇప్పుడవి అతని గదిలోనే వున్నాయా?"

"ఉండేవుంటాయి."

తలూపుతూ, తన కర్తవ్యాన్ని నిర్వర్తించమన్నట్టు ఇన్‌స్పెక్టర్‌కు సైగజేశాడు డాక్టరు.

బైట నిల్చున్న సార్జంట్‌నూ, ఇద్దరు కానిస్టేబుళ్ళనూ పిల్చి ప్రశాంత్‌ను కస్టడీలోకి తీసుకోవలసిందిగా ఆదేశించాడు యుగంధరరెడ్డి. ప్రశాంత్ జుత్తు పీక్కుంటూ ఉన్మాదిలా ఏమేమో వాగసాగాడు. ఐనా, కానిస్టేబుళ్ళు అతని రెక్కలుపట్టి బైటికి లాక్కెళ్ళారు.

ఎక్స్‌పెరిమెంట్ బల్లమీది పగిలిన గాజు ట్యూబ్ ముక్కల్ని ఓ దళసరి కాగితంలోకి తీసి, పొట్లంకట్టి, తన వెంట అంబులెన్స్‌లో వచ్చిన అసిస్టెంటుకిచ్చి, "నా సర్వీసులో యిదివరకు అసంఖ్యాకమైన శవాలను పోస్టుమార్టం జేశాను. ఐతే, ఇప్పుడు చేజేతులా నా ప్రాణమిత్రుడి శరీరాన్ని చీల్చడానికి యెందుకో మనసంగీకరించడంలేదు. సైకలాజికల్‌గా చాలా సర్వీస్‌నెస్ ఆవహించి వుంది నన్ను. అందుకే ఆ పనేదో నీ అజమాయిషీలో పూర్తిజేసి, రిపోర్ట్ తయారుజెయ్యి. హెడ్‌క్వార్టర్స్‌కు వచ్చాక సంతకం పెడతాను. ఇక శవాన్ని తీసికెళ్ళు" అన్నాడు.

అంబులెన్స్ సిబ్బంది శవాన్ని స్ట్రెచ్చర్‌మీద పడుకోబెట్టి బైటికి తరలించారు. ఆ దృశ్యం చూడగానే ప్రొఫెసర్ సోదరి మళ్ళీ గొల్లుమంది.

"ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్‌తో మీరు హెడ్‌క్వార్టర్స్ వెళ్ళిపోండి. లాయర్‌గారూ! అవసరం వస్తే మళ్ళీ మిమ్మల్ని కలుసుకుంటాను. ప్రస్తుతానికి మీరు వెళ్ళొచ్చు. నా పని యింకా కొద్దిగా మిగిలివుంది కూడా" అన్నాడు డాక్టర్.

ఒకరి వెనుక ఒకరు అందరూ వెళ్ళిపోతోంటే ఫింగర్‌ప్రింట్ ఎక్స్‌పర్ట్‌ని అక్కడే వుండమన్నట్టు సైగజేశాడు డాక్టర్.

అంతా వెళ్ళాక, ఓ కుర్చీని తిరిగి తలుపు దగ్గరికి జరిపి, దీనిమీద నిల్చుని, ముందుగా వెంటిలేటర్ ఫ్రేం కిందిభాగం మీది ఫింగర్ ప్రింట్స్ ఫోటోలు తియ్యి. తరవాత అదిగో ప్రొఫెసర్ రైటింగ్ టేబిల్ మీదున్న టైప్‌రైటర్‌మీది ప్రింట్స్ కూడా తియ్యాలి. ఆలోగా నా పని ముగించు కుంటాను" అంటూ రైటింగ్ టేబిల్ని సమీపించాడు డాక్టర్.

దానిమీదున్న ఒక్కో కాగితాన్ని ఎత్తి, జాగ్రత్తగా పరిశీలించసాగాడు. అన్నీ ఎక్స్‌పెరిమెంట్స్‌కు సంబంధించిన రఫ్‌స్కెచ్‌లు. అవి చూశాక, టేబిల్ అవతలివైపు తొంగిచూశాడు. మూసివున్న మూడు అరలు కనిపించాయి.

ఒక్కో అర తెరుస్తూ లోపలి వస్తువుల్నీ, కాగితాలనీ పరీక్షించసాగాడు. కింది అరలో కొన్ని రసీదులు కనిపించాయి. కరెంట్, వాటర్, వంటగ్యాస్ మొదలైన వాటి మధ్యవున్న ఓ బిల్‌మీద డాక్టర్ దృష్టి కేంద్రీకృతమైంది.

అది నగరంలోని ఓ రిజిస్టర్డ్ పబ్లిక్ అకౌంట్స్ ఆఫీసు నుంచి వచ్చిన బిల్లు. దాన్ని చూడగానే సడన్‌గా యేదో స్ఫురణకు వచ్చి, నోట్‌బుక్‌లో ఆ ఆఫీసు అడ్రస్ రాసుకున్నాడు. ఆలోగా, ఫింగర్‌ప్రింట్స్ ఎక్స్‌పర్ట్ తన పని ముగించుకున్నాడు.

"హెడ్‌క్వార్టర్స్ కెళ్ళి, ఆ ప్రింట్సు డెవలప్‌జేసి రెడీగా వుంచండి. నేను వచ్చి చూస్తాను" అంటూ బిల్స్ తిరిగి టేబిల్ సొరుగులో పెట్టేశాడు డాక్టర్.

అతను తలూపి, బ్యాగ్ భుజాన తగిలించుకుని వెళ్ళిపోయాడు.

డాక్టర్ టేబిల్ కింద చెత్తబుట్టలోంచి ఓ వేస్ట్ పేపరందుకుని, తలుపు దగ్గరున్న కుర్చీ ఎక్కాడు. ఆ పేపరో

వెంటిలేటర్ ఫ్రేంపై పేరుకున్న కొంత ధూళి సేకరించి, పొట్లంకట్టి జేబులో వేసుకుంటూ కుర్చీ దిగాడు.

అక్కడే శోకదేవతలా నిల్చున్న విజయలక్ష్మిని సంబో ధించి, "ప్రశాంత్ గది ఎక్కడుందో కాస్త చూపించండి" అన్నాడు బైటికి నడుస్తూ.

ఆమె ఆయన్ని తీసికెళ్ళి ప్రశాంత్ గది చూపించింది.

అరగంట తరవాత ఓ ఎరుపురంగు పుల్ స్వెట్టర్‌తో బైటికి వచ్చాడు డాక్టర్, "రాత్రి ఇదేకదూ ప్రశాంత్ తొడుక్కుంది?" అడిగాడామెను.

"ఔను. ఇదే!"

"ఇక నే వస్తాను, మీరు ధైర్యంగా వుండండి. చావు పుట్టుకలు అతిసహజమైన ప్రకృతి క్రమాలు. మానవ మాత్రులం కనక దుఃఖం తప్పదు. సర్దుకుపోవాలి. మీరు నా స్నేహితుని సోదరి. ఆ లెక్క నాకూ సోదరితోనే సమానం! నేనూ, నా భార్యా పిల్లలూ వుండగా యీ లోకంలో ఏకాకినన్న భావన మీ మనసులో జనించకూడదు! మళ్ళీ వస్తాను" అంటూ ఆ స్వెట్టర్ని వెడల్పాటి న్యూస్ పేపర్లో చుట్టి, ఆమెవద్ద సెలవు తీసుకుని బైటికి నడిచాడు డాక్టర్.

2

టాక్సీ యెక్కి తిన్నగా ప్రొఫెసర్ మల్లికార్జునరావు అకౌంట్ వున్న నేషనల్ బ్యాంక్ హెడ్డాఫీసు చేరుకున్నాడు. ఆ బ్యాంకు డైరెక్టర్‌తో ముందే పరిచయం వుండడంవల్ల తనక్కావలసిన వివరాలు తెలుసుకోడానికి డాక్టర్‌కు ఎలాటి యిబ్బందీ కలగలేదు.

డైరెక్టర్‌కు ధన్యవాదాలు తెల్పుకుని, తిరిగి టాక్సీ యెక్కి ప్రొఫెసర్ టేబిల్ సొరుగులో దొరికిన బిల్లు

తాలూకు పబ్లిక్ అకౌంట్స్ ఆఫీసుకెళ్ళి తనని పరిచయం జేసుకుని, కావలసిన వివరాలు సేకరించగలిగాడు.

ఆ వివరాలనుబట్టి, ప్రొఫెసర్ ఆ అకౌంట్స్ ఆఫీసు నిపుణుల ద్వారా తన ఫార్ములాలతో మందులు తయారు జేసిన ఫ్యాక్టరీల లెక్కలు తనిఖీజేయించి, తనకు రావలసిన రాయల్టీల వివరాలు తెలుసుకున్నాడు.

ఆ నిపుణుల నివేదిక ప్రకారం ఆయన ఫార్ములాల ద్వారా ఆ యా ఫ్యాక్టరీలు తయారుచేసిన మందులు మార్కెట్లో విపరీతంగా అమ్ముడుపోయి బాగా లాభాలు ఆర్జించిపెట్టాయి. ఒప్పందం ప్రకారం ఆ లాభాల్లో ప్రొఫెసర్‌కు రావలసిన రాయల్టీలు కూడా పెద్ద సంఖ్యలోనే ముట్టజెప్పబడ్డాయి!

ఆ వివరాలు తెలుసుకుని, ఆ ఆఫీసువారికి కృతజ్ఞతలు చెప్పుకుని, బైటపడ్డాడు. దొరికిన టాక్సీ ఎక్కి తిన్నగా లాయర్ గురుపాదం యింటికి జేరుకున్నాడు. ఆయన్ని చూడగానే లాయర్ సాదరంగా ఆహ్వానించి, తన ఆఫీసు గదిలోకి తీసికెళ్ళి కూర్చోబెట్టాడు.

"ఇంత త్వరగా వచ్చి మళ్ళీ మీకు యిబ్బంది కలిగిస్తాననుకోలేదు. మీతో మరికొన్ని విషయాలు చర్చించాలి" అన్నాడు డాక్టర్.

"చెప్పండి, మీతో అన్నివిధాలా సహకరించాలనే నా తాపత్రయం!" అన్నాడు లాయర్ టేబిల్‌మీద డన్‌హిల్ సిగరెట్ డబ్బా ముందుకు తోస్తూ.

"ప్రొఫెసర్ ఎప్పుడైనా తను బ్లాక్‌మెయిల్ చెయ్యబడుతున్నానన్న సంగతి కదిపాడా మీ ముందు?" డబ్బాలోంచి సిగరెట్ అందుకుంటూ డాక్టర్ అడిగిన ప్రశ్నకు నిర్ఘాంతబోయాడు లాయర్.

"బ్లాక్ మెయిలింగా? ప్రొఫెసర్నా? ఎప్పుడూ నాతో చూచాయగానైగా చెప్పలేదే ఆయన! మీకెలా తెలిసింది?"

"నేనిప్పుడే నేషనల్ బ్యాంక్ హెడ్డాఫీసు కెళ్ళి డైరెక్టర్‌తో మాట్లాడి వస్తున్నాను. ఈ మధ్య ప్రొఫెసర్ తరుచూ తన అకౌట్లోంచి పెద్దమొత్తాల్లో డబ్బు డ్రాజేసినట్టు తెలిపింది. దాన్నిబట్టి ఎవ్వరో ఆయన్ని ఏ విషయంలోనో బ్లాక్ మెయిల్ చెయ్యసాగారనీ, అందుకే వ్యక్తిగతంగా తన కవసరం లేకున్నా పెద్దమొత్తాల్లో బ్యాంకు నించి డబ్బు డ్రాజేసేవాడని తెలుస్తోంది."

లాయర్ పెదవి విరిచి; "నో, ఈ సంగతి బొత్తిగా నాకు తెలీదు....ఇంతకీ ప్రశాంత్ మీద కోర్టులో హత్యానేరం మోపడానికి సాక్ష్యాధారాలు దొరికాయా?" అడిగాడు.

"హత్య కుపయోగించిన తాడు దొరికితే కేసు దాదాపు పూర్తయినట్టే భావించాలి. హెడ్‌క్వార్టర్స్ వెళ్ళి, ప్రొఫెసర్ ఇంట్లో దాన్ని వెతకడానికి సిబ్బందిని పంపిస్తాను. వీలైతే సాయంత్రం ఓ సారి హెడ్‌క్వార్టర్స్‌కు రండి. ప్రశాంత్ నోటితో తన నేరాన్ని ఎలా వెళ్ళగక్కిస్తానో చూద్దురుగాని" అంటూ లేచి చేతిగడియారం చూసుకున్నాడు డాక్టర్.

మధ్యాహ్నం మూడు గంటలు.

"తప్పకుండా వస్తాను" అంటూ డాక్టర్ని బైటివరకూ సాగనంపాడు లాయర్.

3

క్రయింబ్రాంచి హెడ్‌క్వార్టర్స్ చేరుకోగానే, ఇన్‌స్పెక్టర్ యుగంధరరెడ్డికి తను కనుగొన్న విషయాలన్నీ వివ

రించి, తక్షణం కొంత సిబ్బందిని ప్రొఫెసర్ యింటికి పంపి, తాడు వెదికే ఏర్పాటు చెయ్యమనీ, అలాగే, ప్రొఫెసర్ సోదరి విజయలక్ష్మిని వెంటబెట్టుకు రావలసిందిగా చెప్పమనీ కోరాడు.

ఇన్స్పెక్టర్ అందుకు సమ్మతించి, సార్జంట్నూ, యిద్దరు కానిస్టేబుళ్ళనూ ప్రొఫెసర్ యింటికి తరలించాడు. ఆలోగా డాక్టర్ లేబొరేటరీలో కెళ్ళి, ఫింగర్ప్రింట్స్ రిపోర్టూ, పోస్ట్మార్టం రిపోర్టూ పరిశీలించి, ఓ అవగాహనకి వచ్చాడు.

రెండు గంటల తరవాత, అంటే సూర్యాస్తమయంవేళ ప్రొఫెసర్ యింటికి వెళ్ళిన సార్జంటూ, కానిస్టేబుళ్ళూ తిరిగి వచ్చారు.

తాడు దొరికింది!

"ఎక్కడ దొరికింది?" అడిగాడు డాక్టర్.

"ప్రశాంత్ పరుపు కింద మడతబెట్టి వుంది" చెప్పాడు సార్జంట్.

వారి వెంట ప్రొఫెసర్ సోదరికూడా వుంది. భయంతో ఆమె మొహం పాలిపోయి వుంది.

"ఎందుకు పిలిపించారు నన్ను?" అడిగింది వణికే కంఠంతో.

డాక్టర్ ఆమెను యిన్స్పెక్టర్ ఆఫీసులోకి తీసికెళ్ళి, కూర్చోబెట్టి కొన్ని ప్రశ్నలడిగి తెలుసుకున్నాడు.

"మీ ధోరణి నాకు అంతుబట్టడం లేదు డాక్టర్! మీ పరిశోధనా తీరుకూ, మా పద్ధతికీ ఎక్కడా పొంతన కుదరడం లేదు. మీ హడావుడి చూస్తోంటే నిజంగా ఇది హత్యకేసేనా అన్న అనుమానం కలుగుతోంది నాకు"

అన్నాడు యిన్‌స్పెక్టర్ యుగంధరరెడ్డి మొహం చిట్లిస్తూ.

డాక్టర్ నవ్వి — "కేసు పతాక సన్నివేశంలో వుంది యిన్‌స్పెక్టర్. కొద్దిసేపు ఓపికపడితే అంతా బోధపడు తుంది మీకు" అన్నాడు.

అదే సమయంలో లాయర్ గురుపాదం తలుపుముందు ఆగి, "మే ఐ కమిన్ యిన్‌స్పెక్టర్?" అడిగాడు.

"వెల్‌కమ్ సర్! వెల్‌కమ్" అన్నాడు యిన్‌స్పెక్టర్ సాదరంగా.

లాయర్ లోనికి రాగానే, "కూర్చోండి" అంటూ కుర్చీ చూపాడు డాక్టర్ సత్యానంద్. అతను కూర్చున్నాక, సార్జంట్‌ని చూస్తూ, "ప్రశాంత్‌ను తీసుకురండిక్కడికి" అన్నాడు.

ఐదు నిమిషాల తరవాత, యిద్దరు కానిస్టేబుళ్ళ నడుమ నడుస్తూ వచ్చాడు ప్రశాంత్. పదిగంటల్లోనే అతని మొహం బాగా పీక్కుపోయి, లంఖణాలు పట్టిన రోగిలా తయారైనాడు.

డాక్టర్ తన అసిస్టెంట్ ద్వారా అతని స్వెట్టర్‌నూ, అతని పరుపుకింద దొరికిన నైలాన్ తాడునూ తెప్పించి, యిన్‌స్పెక్టర్ బల్లమీద పెట్టించాడు. అందరి దృష్టీ వాటిమీదే నిలిచింది. చెవులన్నీ డాక్టర్ చెప్పబోయే విషయాలు వినడానికి నిక్కబొడుచుకున్నాయి.

"ఈ తాడుతో ప్రొఫెసర్ చేతులు బంధించాక, హంతకుడు విషవాయువు ట్యూబ్ పగలగొట్టి, వెంటనే లాబ్ లోంచి బైటపడి, తలుపు మూసేసి, వెంటిలేటర్ గుండా బైటికి జారవిడిచిన తాడు రెండో కొసను పట్టి గట్టిగా లాగాడు. దాంతో లోపల ప్రొఫెసర్ చేతులకు వేసినముడి

విడిపోయింది.

తరవాత హంతకుడు ఆ తాడును వెంటిలేటర్ గుండా బైటికి లాగాడు. ఆ లాగడంలో వెంటిలేటర్ ఫ్రేం రాపిడికి, దానిమీద పేరుకున్న ధూళితోబాటు, చిన్న చిన్న తాడు దారం రేణువులుకూడా రాలి అతని బట్టలపై పడ్డాయి.

రాత్రి ప్రశాంత్ శరీరంమీద ఈ స్వెట్టరే వుండడం వల్ల ఆ రేణువులు దీనిమీద తప్పక వుండి వుంటాయని తలచి, పరీక్ష నిమిత్తం ఇక్కడికి తీసుకొచ్చాను. అలాగే, ఆ వెంటిలేటర్ ఫ్రేంమీది ధూళి నమూనానుకూడా పొట్లం కట్టి తెచ్చాను.

వాక్యూమ్ క్లీనర్లో ఈ స్వెట్టర్ని శుభ్రపరిస్తే దీంట్లో యిరుక్కున్న రేణువులన్నీ రాలిపోతాయి. ఆ రేణువుల్నీ, నేను తెచ్చిన రేణువుల్ని మైక్రోస్కోప్ ద్వారా పరీక్షిస్తే రెంటికీ వున్న పోలిక స్పష్టంగా తేలిపోతుంది.

ఇది ఎలా సంభవమో తెలుసుకోవాలని మీరు కుతూహలపడుతున్నారు కదూ? ఐతే. మీకు ప్రత్యక్షంగా చూపిస్తాను చూడండి" అంటూ తను తొడుక్కున్న షర్టు చూసుకుని, "ఇది పాలియస్టర్ బట్ట. దీనిమీద ధూళిరేణువులు పడ్డా, బట్టపై నిలవకుండా జారిపోతాయి" అంటూ అక్కడున్న వాళ్ళందరి దుస్తులూ పరికించి,

"ఇన్‌స్పెక్టర్, ఆయన సిబ్బందీ యూనిఫారాల్లో వున్నారే....ఆఁ, లాయర్‌గారూ! మీరు టెరిఊల్ కోటు తొడుక్కున్నారు కదూ? దాన్నొకసారిలా యివ్వండి" అన్నాడు డాక్టర్.

లాయర్ వెంటనే కోటువిప్పి ఆయన కందించాడు.

దాన్ని తన అసిస్టెంట్‌కిస్తూ, "దీనిపై రోడ్డుమీది ధూళి

పడుండాలి. వాక్యూమ్ క్లీనర్లో శుభ్రంచేసి, రాలిన రేణువుల్ని ఈ స్వెట్టర్‌మీద లభించిన రేణువులతోనూ, నేను తెచ్చిన రేణువులతోనూ పోల్చిచూసి వీరికి చెప్పు!" అన్నాడు డాక్టర్.

అసిస్టెంట్ ఆ కోటునూ, బల్లమీది స్వెట్టర్ని, తాడునూ లాబ్‌లోకి తీసికెళ్ళాడు.

"హత్యా ప్రదేశంలో హంతకుడితో మరో పెద్ద పొరపాటు జరిగిపోయింది....వెంటిలేటర్ ఫ్రేంమీద పడ్డ తన వేలిముద్రలు తుడవడం ఆ హడావుడిలో అతను మర్చిపోయాడు. అంతేకాదు, ప్రొఫెసర్ని బంధించాక, రైటింగ్ టేబిల్‌మీదున్న టైప్‌రైటర్‌మీద విషవాయువుందని హెచ్చరిస్తూ అతను టైప్‌చేసిన ఉత్తరంవల్ల, అతని వేలిముద్రలు టైప్‌రైటర్‌మీద వుండిపోయాయి.

నిజానికీ, లోహంమీదా, ప్లాస్టిక్ పూతమీదా వేలిముద్రలు చాలా నీట్‌గా, స్పష్టంగా పడతాయి. చూపించమంటారా?" అంటూ జేబులు తడుముకుని, "ఇందాక నా సిగరెట్ కేస్‌ను లాబొరేటరీలోనే మర్చిపోయినట్టున్నాను. ఇన్‌స్పెక్టర్! మీ రివాల్వర్ ఒకసారిలా యివ్వండి" అన్నాడు డాక్టర్.

అయిష్టంగానే అయినా గత్యంతరం లేక బల్ల సొరుగు లాగి, రివాల్వర్ తీసిచ్చాడు యిన్‌స్పెక్టర్. డాక్టర్ దాన్ని కిటికీలోంచి గదిలో పడుతున్న వెలుతురువైపు తిప్పి, "చూడండి, వేలిముద్రలు ఎంత స్పష్టంగా కనిపిస్తున్నాయో!" అంటూ రివాల్వర్ని లాయర్ కందించాడు.

లాయర్ దాన్నందుకుని, పరీక్షగా చూసి, "ఔను. అచ్చువేసినట్టు కనిపిస్తున్నాయి" అన్నాడు.

"టైప్‌రైటర్‌మీదా, వెంటిలేటర్‌మీదా దొరికిన వేలి

ముద్రల్ని, ప్రశాంత్ వేలిముద్రలతో పోల్చి చూశాక మాకో విషయం అర్థమైంది?"

"ఏమిటది?" అడిగాడు లాయర్.

"హంతకుడు ప్రశాంత్ కాదని!"

"అదెలా?"

"ఆ వేలి ముద్రలు అతనివి కావు!"

"మరెవరివి?"

"మీవే!"

డాక్టర్ తప్ప, అక్కడున్న వాళ్ళంతా దిగ్భ్రాంతితో నోళ్ళు తెరిచారు ఒక్కసారి.

"నావా? మీకు మతిగానీ పోయిందా?" అరిచాడు లాయర్.

"నాకు మతిపోయిందో, లేదో తెలీదుగానీ, ఎప్పుడైతే నీ కంఠానికి ఉరితాడు బిగుసుకుంటుందో అప్పుడు నీ మతి తప్పకుండా పోతుంది లాయర్ గురుపాదం! ఉదయం నువ్వు ప్రొఫెసర్ యింటికి వచ్చినప్పుడు సిగిరెట్ ఆఫర్ చేసే నెపంతో నా సిగిరెట్ కేస్ నీకెందు కిచ్చానో తెలుసా? నీ వేలిముద్రలు సేకరించడానికి.

అంతేకాదు, ఇందాక నీ కోటు విప్పించి, లాబొరేటరీకి ఎందుకు పంపించాననుకుంటున్నావు? దానిమీది రేణువుల్ని సేకరించడానికి. ఈపాటికి నా అసిస్టెంట్ తన పని ముగించుకునుంటాడు...." డాక్టర్ మాట పూర్తికాక ముందే అతని అసిస్టెంట్ లోనికి వచ్చి,

"మీ అంచనా కరెక్టే సార్! లాయర్ కోటుమీది రేణువులూ మీరు తెచ్చిన వెంటిలేటర్ మీది రేణువులూ ఒక్కటే!" అన్నాడు.

అది వినగానే పకపక నవ్వాడు లాయర్. "నీకు నువ్వు చాలా తెలివిగలవాణ్ణనుకుంటున్నావా డాక్టర్ సత్యానంద్! హంతకుణ్ణి నేనేనని తెలిసికూడా ఈ రివాల్వర్ నాచేతికిచ్చినప్పుడే నీ తెలివితేటలేమిటో తెలిసిపోయింది" అంటూ రివాల్వర్‌ని వాళ్ళవైపు గురిపెట్టి, "నిలుచున్న చోటినించి యెవ్వరు కదలకండి. నిర్దయగా కాల్చిపారేస్తాను" అంటూ తలుపువైపు జరగసాగాడు.

ఆ హెచ్చరికను లెక్కచెయ్యకుండా మెరుపులా లేచి అతనివైపు పురికాడు ఇన్‌స్పెక్టర్ యుగంధరరెడ్డి. అంతే! ట్రిగ్గర్ వత్తేశాడు లాయర్!

"క్లిక్!" మంది రివాల్వర్.

"అందులో గుళ్ళులేవు గురుపాదం! పిచ్చికూతలు కట్టిపెట్టి బుద్ధిగా లొంగిపో!" అన్నాడు డాక్టర్ చాలా నింపాదిగా.

భయంతో లాయర్ కళ్ళు పెద్దవయ్యాయి.

అప్పటికే యిన్‌స్పెక్టర్ పిడికిలి దెబ్బ అతని దవడ కింద పడింది పిడుగుపాటులా! గురుపాదం కళ్ళు బైర్లుకమ్మాయి. అతను కిందపడకముందే వచ్చి, చెరో రెక్కపుచ్చుకున్నారు కానిస్టేబుళ్ళు.

"హంతకుడితడేనని ఎలా అనుమానించారు మీరు?" అడిగాడు యిన్‌స్పెక్టర్ ఆశ్చర్యంగా. డాక్టర్ నవ్వి— "నా మిత్రుడి శవమే ఆ క్లూ అందించింది నాకు!" అన్నాడు.

"శవమా! అదెలా?"

"నా మిత్రుడు మేధావి! మేధావుల మస్తిష్కం మరణిస్తూకూడా అమోఘంగా పనిచేస్తుంది. శవం కాళ్ళదగ్గర బూట్సూ, సాక్సూ విప్పి పడివుండడం, కుడికాలి మడమ

నేలకానించి, పాదం నిటారుగా ఎత్తి వుండడం గమనించారు కదా మీరు?

మల్లికార్జునరావు పాదాల్లో అనేకచోట్ల ఆనెలున్నాయి. పాదరక్షలు లేకుండా నడిస్తే అవి చాలా బాధ కలిగిస్తాయి గనక, అతను పడుకునేటప్పుడు తప్ప ఎల్లవేళలా కాళ్ళకు చెప్పులో, బూట్సు వేసుకునే గడిపేవాడు.

అటువంటి వ్యక్తి మరణిస్తూ కావాలని బూట్స్ విప్పడం, ఒక పాదాన్ని నిటారుగా నిలబెట్టి వుంచడంలోని అంతరార్థమేమిటని చాలా తీవ్రంగా యోచించాను. ఎప్పుడైతే విజయలక్ష్మి రాత్రి లాయర్ గురుపాదం వచ్చి, ప్రొఫెసర్ని కలిపివెళ్ళిందని చెప్పిందో, అప్పుడు మెరిపింది మెరుపు నా బుర్రలో!

మనం నడవాలనుకున్నప్పుడు మొదటి అడుగు కుడికాలుతోనే ప్రారంభిస్తామన్నది కాదనలేని సత్యం! అంటే, కుడికాలు, యెడమకాలు మార్గదర్శి అన్నమాట. మార్గదర్శులు గురువుతో సమానం గనక, ఆ లెక్కన యెడమకాలుకు కుడికాలు గురువే అవుతుంది కదా? ప్రొఫెసర్ కుడికాలు పాదాన్నే నిలబెట్టి వుంచడం ఇక్కడ గమనార్హం! అంటే దానికి అర్థం గురుపాదం!

బ్యాంకు డైరెక్టర్తో మాట్లాడాక అతనిమీద అనుమానం మరింత బలపడింది కారణం ప్రొఫెసర్ ఎల్లవేళలా తన పరిశోధన గొడవలోనే మునిగి తేలేవాడు గనక, యితర పనులూ, ఆర్థిక లావాదేవీలూ లాయరే చూసుకునేలా అతనికి సంపూర్ణాధికారాలిచ్చాడు.

ప్రొఫెసర్ అతనిపట్ల ఏర్పరచుకున్న ఆ నమ్మకాన్ని తన స్వలాభానికి సద్వినియోగం చేసుకుంటూ చాలా దుర్విని

యోగం చేశాడు లాయర్. వివిధ మందుల ఫాక్టరీలవారు అడపాదడపా పంపే ప్రొఫెసర్‌కు రావలసిన రాయల్టీ మొత్తాలను తన ఖాతాలోకి మళ్ళిస్తూ, చిన్న చిన్న మొత్తాలను ఆయన ఖాతాలో జమ చెయ్యసాగాడు.

అక్రమం ఎన్నాళ్ళు అందరిమెక్కుతుంది? ప్రొఫెసర్ కెందుకో అనుమానంవేసి, నిజానిజాలు తెలుసుకుందామని పబ్లిక్ అకౌంట్స్ వారిద్వారా ఆయామందుల ఫ్యాక్టరీల లాభనష్టాలను చెక్‌చేయించాడు. అప్పుడు బైటపడింది అసలు సంగతి!

దాంతో ప్రొఫెసర్‌కు భరించరాని కోపం వచ్చుంటుంది. నిన్న లాయిర్‌కు ఫోన్‌చేసి, రాత్రి ఫలానా వేళకి వచ్చి తనని కలుసుకోమని చెప్పివుంటాడు. యాదృచ్ఛికంగా, లాయర్ రావడానికి ముందే ప్రశాంత్‌కూ, ప్రొఫెసర్‌కూ మధ్య వాగ్వివాదం జరిగింది. అది జరిగిన తరవాతే లాయర్ అక్కడికెళ్ళాడు.

ప్రొఫెసర్ అతన్ని మొహంవాచేలా చీవాట్లుపెట్టి, కాజేసిన డబ్బు మర్యాదగా తిరిగి తన అకౌంట్లో చేర్చకుంటే క్రిమినల్ చర్య తీసుకుంటానని హెచ్చరించి వుంటాడు. దాంతో లాయర్ భయపడి, అప్పటికప్పుడు పథకం అల్లి ప్రొఫెసర్ని అంతమొందించాడు....తరవాత మన అనుమానం ప్రశాంత్‌మీద మళ్ళించడానికి వీలునామా కట్టుకథ అల్లి వినిపించాడు!"

"మరి హత్యకుపయోగించిన తాడు ప్రశాంత్ పరుపు కింద దొరికిందే! ఆ మిష్టరీ ఏమిటి?" అడిగాడు ఇన్‌స్పెక్టర్ ఆశ్చర్యంగా.

డాక్టర్ నవ్వి—"ప్రొఫెసర్ యింటినించి మీరంతా

వెళ్ళిపోయాక, నేను ప్రశాంత్ గదిలోకెళ్ళి, పరుపుతో సహా, అంగుళం వదలకుండా గదంతా గాలించాను. అలాంటిదేమీ కనిపించలేదు. మరి మీ సిబ్బందిని పంపాక ఎలా దొరికింది?

చెబుతాను వినండి. బ్యాంకు డైరెక్టర్‌తో మాట్లాడాక, లాయర్ యింటికెళ్ళి, నా రాకకు ఏదో కారణం చూపాలి గనక ఊరికే బ్లాక్‌మెయిల్ కథ సృష్టించి, తాడు సంగతి కదిపి, ఇక్కడికి వచ్చి, మీ సిబ్బందిని ప్రొఫెసర్ ఇంటికి పంపించాను.

వాళ్ళక్కడికి చేరేలోపలే లాయర్ అక్కడికెళ్ళి ప్రశాంత్ గదిలో ఆ తాడు పడేస్తాడని నాకు తెలుసు. అక్షరాలా అదే జరిగింది కూడా! పోలీసులకన్నా ముందే లాయర్ అక్కడికి చేరాడట.

ఇంట్లో ఒంటరిగా వున్న విజయలక్ష్మిమీద సానుభూతి కురిపిస్తూ, ఆమె భావి జీవితం గురించి సలహాలిస్తూ మంచినీళ్ళు అడిగాడట. ఆమె నీళ్ళు తేవడానికి లోని కెళ్ళిందట. ఆ లోపలే తన పని ముగించుకున్నాడతను. అతనలా వెళ్ళగానే పోలీసులు తాడు వెదకడానికి వచ్చారట. ఈ విషయాలు తెలుసుకోడానికే విజయలక్ష్మి నిక్కడికి పిలిపించాను...."

"మొత్తానికి మీరు జూనియర్ డాక్టర్! నేరపరిశోధనలో మమ్మల్ని మించిపోయారు. మీరు కలగజేసుకుని వుండకుండా వుంటే, ప్రొఫెసర్ మరణాన్ని మేము ఆత్మహత్యగానే భావించి, కేసు క్లోజ్ చేసేవాళ్ళం! హంతకుడు నిశ్చింతగా, ఘరానా మనిషిలా సమాజంలో చలామణీ అయ్యేవాడు" యిన్‌స్పెక్టర్ కంఠంలో కృతజ్ఞత ధ్వనించింది. □



ఉదయం పదిగంటలు.

ఆ ఇంట్లోని పొయ్యిలో పిల్లి ఇంకా లేవలేదు....

ఆ ఇంటి యజమాని పరంధామయ్యగారు మాస్ రిటైర్ మెంటులో రిటైర్ అయ్యి — ఆ షాక్‌కు తట్టుకోలేక వారం రోజుల్లోనే పక్షవాతం వచ్చి కాలంచేసారు.

పెన్షనరీ బెనిఫిట్స్ కొన్ని వస్తే పరువుగల ఆ

కుటుంబము తమకున్న అప్పులన్నీ తీర్చి తాము పస్తులు పడుకుంటున్నారు.

పరంధామయ్యగారికి భార్య నలుగురు ఆడపిల్లలున్నారు.

పెద్దమ్మాయి సుగుణ బి.ఏ. పాసయ్యి పైపు షార్టు హాండు నేర్చుకొని ఉద్యోగంలేక ఖాళీగా ఇంట్లో కూర్చుంది.

మిగతా ముగ్గురు ఇంటర్, యస్.యస్.సి. ఏడోతరగతి వరుసగా చదువుతున్నారు.

ఆ యింటికి పెద్ద దిక్కు అయిన పరంధామయ్యగారు పోవడంతో—ఆ కుటుంబం బజారున పడ్డట్లయింది.

అమ్మాయిలంతా చదువు మానేశారు.

సుగుణ ఉద్యోగాన్వేషణకు బయలుదేరింది.

ఎన్నో కంపెనీల మెట్లు ఎక్కింది....కాని లాభం లేక పోయింది....

'పోస్టు' అన్న కేకతో ఇంట్లో కూర్చుని 'కాంపిటీషన్ సక్సెస్' చదువుకుంటున్న సుగుణ వులిక్కిపడింది.

పుస్తకం పక్కన పడేసి — ఒక్క వుదుటున వెళ్ళి రిజిష్టరు పోస్టులో వచ్చిన ఆ ఉత్తరం ఎక్నాలెడ్జిమెంటు మీద సంతకంచేసి తీసుకున్నది.

వుత్తరాన్ని ఆతృతగా విప్పింది. తను యిచ్చిన అనేక యింటర్వ్యూల్లో ఏదైనా ఫలించిందేమోనన్న ఆశతో.

ఆమె అనుకున్నట్లుగా అవి అపాయింట్‌మెంట్ ఆర్డర్సు కావు.

ఒక గ్యాస్ కంపెనీవాళ్ళు స్టెనో వుద్యోగానికి ఇంటర్వ్యూకు హాజరుకమ్మని వ్రాసిన ఇంటర్వ్యూ లేఖ.

ఎప్పుడో రెండు నెలలక్రితం ఆ గ్యాస్ కంపెనీలో ఒక స్టెనో వేకన్సీ వుందని ఎవరో చెప్పితే అప్లయి చేసింది తను. యిన్నాళ్ళకు యింటర్వ్యూకు రమ్మని

ఆహ్వానం పంపారు.

అప్పటికే అనేక యింటర్వ్యూలకు అటెండయి వున్న సుగుణకు ఆ యింటర్వ్యూ లేఖ పెద్ద సంతోషాన్ని యివ్వ లేకపోయింది.

రేపే యింటర్వ్యూ వుందని తెలుపుతోంది లేఖ.

ఈ యింటర్వ్యూకు కూడా వెళ్ళి తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని నిర్ణయించుకుంది సుగుణ.

2

"లక్ష్మి గ్యాస్ కంపెనీ" అని యింగ్లీషులోను తెలుగు లోను తాటికాయంత లావు అక్షరాలతో వ్రాసి వున్న ఆ బోర్డుముందు ఆటో దిగింది.

సుగుణ ఆటోవాడికి డబ్బులిచ్చి—సర్టిఫికెట్లన్నీ సర్దు కొని— తనకు వచ్చిన కాల్ లెటర్‌ను పైకితీసి చేతిలో పట్టుకొని గేటు తోసుకొని లోనికి వెళ్ళింది.

వరండాలో నిల్చొని సిగరెట్ త్రాగుతున్న ఒక ఉద్యోగికి తనకు వచ్చిన కాల్ లెటర్‌ను చూపించి— మేనేజరుగారు ఎక్కడుంటారు అని అడిగింది.

అతను వెకిలిగా నవ్వుతూ—యెదురుగా వున్న ఒక గదిని చూపించాడు.

సుగుణ ఆ గదివైపు నడిచింది.

ప్యూన్‌ద్వారా కబురు పంపితే—ఆయన లోనికి రమ్మని ఆర్డర్ చేశాడు.

సుగుణ లోనికి వెళ్ళింది.

మేనేజరు చింపాంజీలా కనిపించాడు.

బట్టతల, బానంత పొట్ట, పొట్టిగా, నల్లగా వున్నాడు. వయస్సు నలభై ఏళ్ళకు పైనే వుంటుంది.

"టేక్ యువర్ సీట్" అన్నాడు మేనేజరు హుందాగా.

"ఫర్వాలేదు సార్, నా పేరు సుగుణ, స్టెనో ఉద్యోగానికి అప్లికేషన్ పెట్టుకుంటే కాల్ లెటర్ పంపించారు" అంటూ కాల్ లెటర్‌ను అందించింది.

"ఓహో! సుగుణ అంటే మీరేనా?" అన్నాడు కాల్ లెటర్ అందుకుంటూ.

"ఔనండి!"

"సుగుణ అనే పేరంటే నాకు చాలా యిష్టం. బై దిబై మీరెంతవరకు చదువుకున్నారు?"

"బి.ఏ. పాసయ్యి—టైపూ షార్టుహాండు హయ్యర్ పాసయ్యానండీ!" వినయంగా చెప్పింది.

"అనుభవం ఏమైనా వుందా?" ద్వందర్థం స్ఫురించేట్టు మాట్లాడాడు. "అనుభవం" అనే పదాన్ని ఒత్తిపలుకుతూ.

"ఎక్కడా ఉద్యోగం చేయలేదండి!"

"అది నిన్ను చూస్తూనే తెలుస్తోంది. అనుభవం ఏమీ లేనట్టు! కానీ మాకు అనుభవమున్న క్యాండిడేట్ కావాలి. మీరిక వెళ్ళవచ్చు! సారీ ఫర్ ది ట్రబుల్" అని ఆయన తన పనిలో నిమగ్నమయ్యాడు—

"సార్....సార్...! మీరిలా అనకండి! మా కుటుంబం చాలా కష్టాల్లో వుంది. మా నాన్నగారు పోయారు. యింటికి పెద్ద దిక్కును నేనే! ముగ్గురు చెల్లాయిలు అమ్మ వున్నారు. వాళ్ళందర్నీ పోషించాల్సిన బాధ్యత నాపైనే వుంది. మీరు ఈ బీదరాలిమీద దయ వుంచాలి సార్!" అని వేడుకున్నది.

"అయ్యయ్యో! పాపం నువ్వు చాలా కష్టాల్లో వున్నావమ్మా! నిన్నుచూస్తే వుద్యోగం యివ్వాలనే వుంది. నీకు వుద్యోగమిస్తే మరి నాకేమిస్తావు" అంటూ వెకిలిగానవ్వాడు.

"నా దగ్గర ఏముందని యివ్వగలను సార్!"

"అబ్బో నీ దగ్గర లేకపోవడమేమిటి? చాలా ఉన్నాయి."

తన దగ్గరేముందో సుగుణకు అర్థంకాక వెర్రి చూపులు చూస్తూ నిల్చుంది. తేరుకొని—

"సార్! మీకు అంతగా కావాలంటే నా మొదటి నెల జీతం తీసుకోండి! అంతకన్నా నేనేమివ్వగలను చెప్పండి!"

"ఇదిగో! ఈ జీతాలు బత్యాలు నాకేమి వద్దు! కావాలంటే నేనే నీకు రెండు నెలల జీతం ఎడ్వాన్స్‌గా ఒకేసారి ఇప్పించగలను. కానీ నువ్వు నా కోరిక తీర్చాలి!"

ఆయన కోరిక ఏమిటో సుగుణకు అర్థంకాలేదు.

"చెప్పండి! సార్! నాకు చేతనైతే మీ కోరిక తప్పకుండా తీరుస్తాను" అన్నది.

"నాకు నువ్వుకావాలి!" అన్నాడు ఆ కంపెనీ మేనేజరు ధైర్యం తెచ్చుకొని.

ఆయన ఆ మాటనగానే సుగుణ గుండెల్లో భగ్గున మంటలు చెలరేగాయి.

ఆవేశంతో ఒళ్ళంతా కంపించింది. ఇష్టం వచ్చినట్లు తిట్టి బయటికి వెళ్దామనుకుంది. అంతలోనే—

"ఫర్వాలేదు, నీకొక అయిదు నిముషాల టైమిస్తాను ఆలోచించుకో!" అన్నాడా మేనేజరు.

సుగుణకు ఇంటి పరిస్థితి గుర్తొచ్చింది. ఇంట్లో అంతా రెండు రోజులకు ఒకసారైనా పస్తులుండవలసిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇటువంటి క్లిష్టపరిస్థితిలో తాను శీలం, సాంప్రదాయం, అని మడిగట్టుకొని కూర్చుంటే—తను కుటుంబం యావత్తు ఆకలి చావులు చావాల్సొస్తుంది. లేదా కట్టగట్టుకొని విషం త్రాగి ఆత్మహత్య చేసుకోవాల్సివస్తుంది.

ఈ బాధలన్నింటికంటే, ఈ ముసలి పీనుగ కోరికను తీర్చి—తాను ఉద్యోగంలో చేరి తన కుటుంబాన్ని ఆకలి కేకల బారినుండి తీర్చడమే వివేకమైనపని అని నిర్ణయించు

కుంది.

అంతలోనే ఆమె నిర్ణయాన్ని అంతరాత్మ వ్యతిరేకించింది. "ఛీ! నీదీ ఒక బ్రతుకేనా! ప్రాణం కన్నా శీలం వేలరెట్లు గొప్పది. శీలం కోసం ప్రాణాలనే పణంగా పెట్టిన అనేక మంది వనితలు నీకు చరిత్రలో కన్పిస్తారు. వారిని నువ్వు ఆదర్శంగా పెట్టుకోవాలి. అంతేగానీ—ముష్ఠి ఉద్యోగంకోసం నీ శీలాన్ని బలిచేయకు!" అంటూ అంతరాత్మ ప్రబోధం.

సుగుణ మనస్సులో అంతరంగ మథనం ప్రారంభమైంది. ఆమె ఏ నిర్ణయానికీ రాకముందే "ఏమాలోచించుకున్నావు. త్వరగా చెప్పెయ్! అవతల నాకు బోలెడు పనులున్నాయి! ఇంకొక క్యాండిడెట్నైనా సెలక్టు చేసుకుంటాను" అని రుసరుస లాడాడు.

"అంతపని చేయకండి! నేను మీ కోరిక తీరుస్తాను! కానీ నాకు ఆ ఉద్యోగం వచ్చేట్టు చూడండి!"

"నిజంగానా? నువ్వు ఆ మాటన్నావు చాలు! ఇదిగో ఈ మేటరు నీ చేతుల్తోనే టైపు చేసుకొని తీసుకొనిరా, ఇదే నీ అపాయింట్మెంట్ ఆర్డర్!" అంతకు ముందే రాపి వుంచిన అపాయింట్మెంటు ఆర్డర్లో అభ్యర్థి పేరు వుండవల్సిన చోట సుగుణ పేరు వ్రాపి చేతికందించాడు డ్రాఫ్టు కాగితాన్ని.

"థ్యాంక్యూ సార్! థ్యాంక్యూ వెరిమచ్!" అంటూ అపాయింట్మెంట్ ఆర్డర్ పట్టుకొని టైపురైటర్వైపు నడిచింది.

3

"లక్ష్మీ గ్యాస్ కంపెనీ"లో సుగుణ టైపిస్టుగా చేరింది. జీతం నెలకు 800/- ఆమె ఉద్యోగ కాలంలో రెండు

రోజులు చాలా చక్కగా గడిచాయి. మూడవనాడు మేనేజరు భుజంగం సుగుణను తన గదిలోకి పిలిచాడు.

సుగుణ మేటర్ ఏదైనా డిక్టేట్ చేస్తాడేమోనని ఎప్పటి లాగే పెన్సిలు, నోట్ బుక్ పట్టుకొని స్ప్రింగ్‌డోర్ తెరుచుకొని లోనికి వెళ్ళింది.

"గుడ్ మార్నింగ్ సార్!"

"వెరివెరి గుడ్ మార్నింగ్!"

"ఆఁ ఏమిటి మరి! ఉద్యోగంలో చేరిపోయావు. చక్కగా ఉద్యోగం చేసుకుంటున్నావు. నెలకు 800/- రూపాయలు జీతం బోనసు అదీ వుంటుంది. ఇంతమంచి పనికి కారకుడిని నేనే! ఇక నువ్వు నా కోరిక తీర్చవల్సిన బాధ్యత నీపై వున్నది. మరి మీ యింటికి నన్ను ఎప్పుడు ఆహ్వానిస్తున్నావో చెప్పనేలేదు."

"సార్....సార్....! నాకింకా పెళ్ళికాలేదు. నన్ను దయచేసి ఒదిలేయండిసార్. పెళ్ళి కావల్సిన దాన్ని."

"పెళ్ళికాని కన్నెపిల్లననే కదా నీమీద మోజు పడుతున్నాను."

"నేను తీర్చకపోతే...."

"నీ డిస్‌మిసల్ ఆర్డర్ నువ్వే టైపు చేసుకోవాల్సి వస్తుంది."

"అలా మాత్రం చేయకండి సార్! మీరు కోరినట్లుగా మీ కోరిక ఒకే ఒకసారి తీరుస్తాను. ఇది అదనుగా తీసుకొని నన్ను బ్లాక్ మెయిల్ చెయ్యరని హామీ యిస్తారా?"

"ఓ తప్పకుండా! ఒక్కసారి నాతో గడిపితే చాలు. నిన్ను మర్చిపోతాను" సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అవుతూ అన్నాడు.

"అయితే ఈ రాత్రికి మీరు మా ఇంటికి రండి! సరిగ్గా

11 గంటలకు."

"ఓ.కె. ఇక నువ్వెళ్ళు. ఇవ్వాళ సాయంత్రం 5 గం॥ లకు నేనే మీ యింటివరకు డ్రాప్ చేస్తాను."

4

అన్న మాట ప్రకారం సుగుణ అధికారి భుజంగం కోరిక తీర్చింది. భుజంగం ఆనందానికి హద్దుల్లేవు.

పెళ్ళికాని ఒక అమ్మాయి తన భర్తకు అందివ్వవలసిన సుఖాలు అని మొదటిసారిగా తనకే అందించింది. "రియల్లీ ఐయామ్ లక్కీ ఫెల్లో!" అనుకున్నాడు వందోసారి.

వారంరోజులు బాగానే గడిచాయి.

ఆ తర్వాత మొదలయింది బాధ.

భుజంగం ఆఫీసుకు సెలవుపెట్టి తనకు తగిలిన సుఖా రోగాన్ని బాగుచేయించుకోవడానికి రోజూ డాక్టర్ దగ్గరికి వెళ్ళి వస్తున్నాడు. అసలే తనకు ఆ రోగం తగిలినందుకు సిగ్గుతో సగం చచ్చిపోతున్నాడు. గోరుచుట్టుమీద రోకటి పోటు అన్నట్టు తనకు తగిలిన సుఖరోగం తన భార్యకు కూడా తగిలింది.

ఇది సుఖరోగం కాదు. ఇంకేదో జబ్బు అని ఆమెకు ఏదో కాకమ్మకథ చెప్పి నమ్మించడానికి తాతలు దిగివచ్చారు. చివరికి డాక్టరుతో కూడా చెప్పించాడు తమకు వచ్చింది సుఖరోగం కాదని.

వారంరోజులు ట్రీట్ మెంటు తీసుకున్న తర్వాత మేనే జరు భుజంగానికి తగిలిన సిఫిలిస్ వ్యాధి తగ్గింది.

5

ఉదయం పదిన్నర.

వారం రోజుల సెలవు తర్వాత భుజంగం ఆరోజే డ్యూటీలో జాయిన్ అయ్యాడు.

మేనేజర్ రూములో గంట మ్రోగింది.

ఫ్యూన్ వచ్చాడు.

"స్టెనోను యిటు పిలువు!"

ఫ్యూన్ స్టెనో దగ్గరికి వచ్చి — "అయ్యగారు పిలుస్తున్నారు" అని చెప్పి వెళ్ళిపోయాడు.

సుగుణ గబగబా నోట్‌బుక్, పెన్సిలు తీసుకొని మేనేజరు రూములోనికి దారితీపింది.

మేనేజర్ అవతారం చూడగానే సుగుణకు భయమేసింది. మేనేజర్‌ను ఆ స్థితిలో తను యెప్పుడూ చూడలేదు. అతని ముఖం అవమానాగ్నితో దహించుకుపోతోంది.

తను గదిలోకి వచ్చినట్టు సూచనగా చిన్నగా దగ్గింది సుగుణ.

భుజంగం తల ఎత్తి చూశాడు.

"ఛీ! ఛీ!! నీ మొహం చూడటం కూడా పాపమే! ముందే చెప్పొచ్చుగా! ఏ బ్రోతల్ హౌస్‌నుంచి తప్పించుకొచ్చావు. రోగాలమారి పుట్ట. మొహం చూడు మొహం. ఇక నువ్వు ఈ ఆఫీసులో పనిచెయ్యనక్కర్లేదు. యూ ప్లీజ్ టెండర్ యువర్ రిసిగ్నేషన్. అదర్‌వైజ్ ఐ విల్ సెంటెడ్ అవుట్ యూ!" అని అరిచాడు.

"ఏమిటి సార్! ఇంతకీ జరిగిందేమిటి? కారణం చెప్పకుండానే యెందుకలా మాటలంటున్నారు. నేను చేసిన తప్పేమిటి?"

"తప్పు ఏం చేశావా? నీకున్న సిఫిలిస్ రోగం నాకు తగిలింది. ఆ రోగం వుందని ముందే చెప్పొచ్చుగా! లేకపోతే ట్రీట్‌మెంటు తీసుకొని తగలడవచ్చు కదా! అనవసరంగా ఏమీ ఎరుగని నాలాంటి అమాయకులను చంపడమెందుకు?"

సుగుణ తల దించుకుంది.

"మర్యాదగా రిసిగ్నేషన్ ఇచ్చేసి వెళ్ళు! రేపు ఈ సమయానికి రిసిగ్నేషన్ లెటర్ నా చేతిలో వుండాలి. ఇక నువ్వు వెళ్ళవచ్చు!"

"మీరలా అనకూడదు సార్! మన అగ్రిమెంటు ప్రకారం నేను మీ దగ్గర ఒకసారి పడుకోవాలి. అన్నమాట ప్రకారం పడుకున్నాను. ఇప్పుడు మీరు నన్ను రిసిగ్నేషన్ యివ్వమనడం భావ్యంకాదు."

"నువ్వు నాకు రోగం తగిలించడం మాత్రం భావ్యమా? నన్ను నువ్వు మోసం చేసినందుకు యిదే శిక్ష" అని ఫైల్లో తల దూర్చాడు.

సుగుణ చేసేదిలేక ఆయన గదిలోనుంచి బయటపడింది.

6

ఉదయం పదిన్నర!

మేనేజరుగారు పిలవకముందే సుగుణ ఆయన గదిలోకి దారితీసింది.

మేనేజరు భుజంగం సుగుణను చూడగానే-"ఏమిటి రిసిగ్నేషన్ వ్రాసుకొచ్చావా?" అన్నాడు క్రూరంగా నవ్వుతూ.

"అప్పుడే అంత తొందరపడకండి! ఈ ఫోటోలను ఒకసారి తీరిగ్గా పరిశీలించండి!" అంటూ అతని ముందు కొన్ని పోస్టుకార్డు సైజుకు డెవలప్ చేసిన ఫోటోలను ఉంచింది.

భుజంగం ఆ ఫోటోలను ఆతృతగా అందుకొని చూసాడు. వాటిని చూడగానే ఇవెక్కడివో మ్యాడ్ ఫోటోలనుకున్నాడు. రెండు మూడు ఫోటోలను పరిశీలించిన తర్వాత విషయం అతనికి అర్థమై ముచ్చెమటలు పోసాయి. మనిషి నిలువునా వణకసాగాడు.

ఆ ఫోటోలో వున్నది భుజంగం. అతనితోపాటు ఎవరో తను యెన్నడూ చూడని ఒక అపరిచిత వ్యక్తి. ఇద్దరూ శృంగార క్రీడలో, పాల్గొంటున్నారు. రకరకాల భంగిమలు డజనుకు పైగా వున్నాయి ఫోటోలు.

ఆ ఫోటోలను చూసిన భుజంగం మళ్ళీ మామూలు మనిషి కావడానికి అరగంట పట్టింది.

"సుగుణ, నువ్వు నన్ను యెంత మోసం చేశావు!" అని మాత్రం గొణుక్కున్నాడు ఒకసారి.

"మిస్టర్ భుజంగం! మీరు నన్ను రిపిగ్నేషన్ పెట్టమని మళ్ళీ బెదిరిస్తే-ఆ ఫోటోలు మీ ఆవిడకు ఒకసెట్టు, మన మేనేజింగు డైరెక్టరుకు ఒకసెట్టు, స్థానిక దినపత్రికకు ఒక సెట్టు, పోలీసు డిపార్ట్‌మెంటుకు ఒకసెట్టు పంపిస్తాను. తర్వాత మీ ఇష్టం" అన్నది సుగుణ.

"ప్లీజ్ సుగుణ, నువ్వు నా పరువు కాపాడాలి. ఈ రహస్యం యెక్కడా పొక్కనివ్వకు-ఇక నిన్నెప్పుడు రిపిగ్నేషన్ పెట్టమని అడగను."

"ఓ.కే. అలా అన్నారు బావుంది!" అని తన సీటు వైపు దారితీసింది సుగుణ.

వెళ్ళి సీట్లో కూర్చున్న తర్వాత—

సుగుణకు సీత గుర్తొచ్చింది.

మేనేజర్ భుజంగం కోరిక తీరుస్తానని ఫాల్స్ ప్రామిస్ చేసి ఉద్యోగంలో జాయిన్ అవ్వగలిగింది. అతని కోరిక తీర్చకపోతే-తనను ఉద్యోగంలోంచి తీసివేయడం ఖాయం. తను ఈ విషయమై తీవ్రంగా ఒక రోజంతా ఆలోచించింది.

అంతే!

సుగుణ తనకు డూప్‌గా మరో ప్రొఫెషనల్ అమ్మాయి

నటిస్తే యెలా వుంటుంది అనే విషయమై బాగా ఆలో చించి ఒక నిర్ణయానికి వచ్చింది.

ఆ రోజు తను ఉద్యోగంలో జాయినైన రెండవరోజు. తమ వీధిలో సీత అనే ఒక అమ్మాయి కాల్‌గర్ల్‌గా పని చేస్తున్న సంగతి సుగుణకు తెలుసు. ఆ రోజు సీతను తమ ఇంటికి పిలిపించి విషయమంతా చెప్పింది.

"చూడు సీతా! నాకు ఎడ్వాన్స్‌గా ఒక నెల జీతం యిచ్చారు. ఇదిగో ఈ 400/-రూపాయలు నువ్వే తీసుకో. కానీ-నువ్వు నాకు డూప్‌గా నటించి పెట్టాలి!" అని చెప్పింది.

"అమ్మబాబోయ్ 400/- రూపాయలే! ఇంత డబ్బెందుకు ఒక యాభై రూపాయలు చాలు!" అని అడిగింది.

"ఫర్వాలేదు తీసుకో!" అన్నది సుగుణ.

"సరే ఇటు యివ్వు!" అని డబ్బు తీసుకొని—

"ఫోటోలు కూడా తీయిస్తాను" అన్నది సీత.

తను అమాయకంగా— "ఫోటోలెందుకు?" అని అడి గింది.

"చూడు, నీకు వాటి అవసరం తప్పకుండా వొస్తుంది" అని సీత వెళ్ళిపోయింది.

ఆమె ఊహించినట్లుగానే సుగుణ ఉద్యోగంలో చేరిన మూడవ రోజు ఉదయం మేనేజరు సుగుణను కోరిక తీర్చమని అడిగాడు.

ఆ రోజు సాయంత్రం 5 గంటలకు మేనేజరు కారులో సుగుణను యింటివరకు డ్రాప్ చేశాడు.

"ఇదేనా మీ యిల్లు" అడిగాడు మేనేజరు.

"ఔను సార్! రండి, టీ త్రాగివెళ్దురుగాని! అన్నది

సుగుణ.

"ఫర్వాలేదు. మళ్ళీ యెప్పుడైనా త్రాగుతాను. మీ యింట్లో చాలామంది ఉన్నట్లున్నారు. ఎలా కుదురుతుంది."

"మేడమీద గది ఖాళీగా వుందిలేండి!" అక్కడే అరేంజ్ చేస్తాను ప్రోగ్రామంతా.

"ఏమో బాబు నాకు కొద్దిగా భయంగానే వుంది."

"మీకెందుకు భయం. నాకుండాలిగానీ, ఒక పని చేయండి! బాగా మందుకొట్టేసి రండి. ధైర్యంగా వుంటుంది.

"నిజమే, అలాగే చేస్తాను. ఓ.కే! రాత్రి పదకొండుకు వస్తాను."

కారు వెళ్ళిపోయింది.

సరిగ్గా పదకొండుగంటలకు అతను వచ్చేశాడు.

సుగుణ ఎదురువెళ్ళి అతన్ని మేడమీదకి ఆహ్వానించింది. భుజంగం బాగా తాగి వున్నాడు. పైన మేడమీద గదిలో అప్పటికే సీత, ఆమె వెంట ఫోటోగ్రాఫరు ఈ అపరిచిత వ్యక్తి నిరీక్షణలో వున్నారు.

సుగుణ, భుజంగం మేడమీద గదిలోకి వచ్చారు. భుజంగాన్ని మంచంమీద కూర్చోబెట్టి సుగుణ లైటు ఆర్పేసి బ్యాక్ డోర్ తెరుచుకొని సీతకు చెప్పి బయట పడింది.

తర్వాత జరగవల్సిన తతంగమంతా కాల్ గర్ల్ సీత ఆ చీకటిలో చాకచక్యంగా నిర్వహించింది.

సీత చెప్పినట్లుఫోటోల అవసర మొచ్చింది.

"థాంక్యూ సీతా! థాంక్యూ వెరీమచ్!!" అనుకున్నది సుగుణ. □

సాగరలోయ

సీరియల్

బొమ్మిడి అచ్యుతరావు

(గత సంచిక తరువాయి)

తీరం దగ్గిర పడుతోంది. హెలికాప్టర్ కనిపిస్తోంది. అర్చన, ఆనంద్ పక్కపక్కన నడుస్తున్నారు. రాజేష్ తొందరగా నడవలేకపోతున్నాడు. కొద్ది గజాలు వెనక పడిపోయాడు.

అర్చన వెనుతిరిగి చూసింది. రాజేష్ మెల్లిగా నడుస్తున్నాడు. అతని వెనక్కాలే అరవకుండా పరుగెత్తుకొస్తున్న వేటకుక్కల్ని చూడగానే ఆమె గుండె జల్లుమంది. అవి యిదివరకు దెబ్బతిని పారిపోయిన వేటకుక్కలు! పగబట్టినట్టు నిశ్శబ్దంగా దాడి చేయబోతున్నాయి!

"రాజేష్! వేటకుక్కలు!" అని అరిచింది.

రాజేష్ త్రుళ్ళిపడి చూశాడు. అప్పటికే వేటకుక్కలు అతన్ని చుట్టుముట్టాయి.

"ఆనంద్, వాటిని కాల్చెయ్యి!" అన్నది అర్చన.

ఆనంద్ రివాల్వర్ గురిచూశాడు. "సారీ అర్చనా, యిందులో గుళ్ళు అయిపోయాయి! రౌండ్స్ అన్నీ ఖాళీ! ఎలా మరి?" అన్నాడు నిస్పృహాయంగా చూస్తూ.

అర్చన గుండె బేజారెత్తిపోయింది. కాని అంతలోనే గుర్తొచ్చింది. రివాల్వర్ లోడ్ చేశాక ఆనంద్ మూడు గుళ్ళే పేల్చాడు. తక్కిన మూడు బుల్లెట్సు యేమయ్యాయి?

అర్చన ఊహించని వేగంతో ఆనంద్ చేతిలోని రివాల్వర్ లాక్కుని వేటకుక్కలకి గురిచూపి కాల్చింది.

గుండు సరాసరిపోయి ఓ వేటకుక్కను నేలకూల్చింది. వెంటనే మరోగుండు పేల్చింది. మరో వేటకుక్క గిలగిల కొట్టుకు చచ్చింది. అంతే! తక్కిన కుక్కలు మళ్ళీ పలాయనం చిత్తగించాయి!

క్షణంలో ఘోరమైన ప్రమాదం తప్పిపోయింది రాజేష్‌కు. అతను వాటిని ఎదురుకోగల స్థితిలో లేడుకూడా.

తన ఉద్దేశం అర్చనకు తెలిసిపోవడంతో చటుక్కున ఆమె చేతిలోని రివాల్వర్ అందుకోబోయాడు ఆనంద్. అర్చన తక్కిన గుళ్ళు గాల్లోకి పేల్చేసింది.

రివాల్వర్‌లో బుల్లెట్సు అయిపోయాయి. దాన్ని

దూరంగా విసిరేసింది అర్చన.

ఆనంద్ కోపం పట్టలేక ఆమె రెండు చెంపలూ ఛెళ్లున చరిచాడు.

అర్చన కోపంతోను, ఉక్రోషంతోను అరిచింది. "దుర్మార్గుడా! నీ నిజస్వరూపం తెలిసిపోయింది. రివాల్వర్‌లో గుళ్ళుండి కూడా లేవని అబద్ధమాడతావా? వేట కుక్కలు యీపాటికి రాజేష్‌ని పొట్టన పెట్టుకునేవి. రాజేష్ పట్ల యెందుకు నీ కింత కక్ష? ఎందుకు అతన్ని చంపాలనుకున్నావు?" ఆనంద్ వికటంగా నవ్వాడు.

"నేను నిన్ను ప్రేమించాను. నీ కోసం ఖర్చుకి, కష్టనష్టాలకి వెనకాడకుండా బయల్దేరి వచ్చాను. కాని ఇక్కడ నేను చూసిందేమిటి? నువ్వు రాజేష్‌తో కులుకుతున్నావు. అందుకే అడ్డు తొలగించుకోవటానికి ప్రయత్నించాను.

"ముందు ఊబిగుంటలోకి తోసెయ్యాలని చూశాను. వీలుకాలేదు. అవినాశ్ అడ్డుపడి వీడిని పక్కకు లాగేశాడు. రెండోసారి తొండ పురుగులున్న పుట్టల మీదికి తోసెయ్యబోయాను, కాలు అడ్డుపెట్టి. అప్పుడు కూడా వీడి ప్రాణం మీ యిద్దరు అడ్డుపడి కాపాడేశారు.

"మూడో ప్రయత్నంగా కత్తెరపురుగులున్న గుహలోకి తీసుకుపోయి అక్కడ వీడ్ని అంతం చెయ్యాలనుకున్నాను. కాని అప్పుడూ అవినాశ్ వాడ్ని పక్కకు పెట్టి తను నాతో బయల్దేరాడు.

"చిరుతపులులు చుట్టుముట్టినపుడు కావాలనే నేను రివాల్వర్‌తో వాటిని చంపలేదు. అవినాశ్ వాటికి బలయిపోయాడు. అప్పుడు పరిస్థితి చేజారిపోకుండా రివాల్వర్‌తో వీడ్ని కాల్చెయ్యబోయాను. అంతలో అవినాశ్ వీడ్ని కాలితో తన్నేసి మరోసారి రక్షించాడు.

"చివరగా వేటకుక్కలు దాడిచేసినపుడు నా ప్రయత్నం లేకుండానే వీడి అడ్డు తొలగిపోతున్నదని సంతోషించాను. కాని, వీడి ప్రాణం చాలా మొండిది, గట్టిది! ఇదంతా నీకు తెలీకుండా చెయ్యాలనుకున్నాను. నీకు తెలిసిపోయింది. నువ్వు చేజారిపోయాక నీతోనూ నాకు పనిలేదు. మీరిద్దరు యీ దీవిలోనే సజీవసమాధి అయిపోండి. నేను హెలికాప్టర్‌ను నడుపుకొని చక్కగా పోతాను...." అంటూనే వెనుతిరిగి మెరుపువేగంతో పారిపోయాడు ఆనంద్.

అతను చెప్పిన విషయాలువింటూ దిగ్భ్రాంతితో కాసేపు కర్తవ్య విమూఢులై వుండిపోయారు అర్చన, రాజేష్.

53

ముందుగా రాజేష్ తేరుకున్నాడు.

అప్పటికే ఆనంద్ చాలా దూరం పోయాడు. రాజేష్ అతని వెంటపడ్డాడు. అర్చన కూడా అరుస్తూ వాళ్ళ వెనుక పరుగెత్తింది.

ఆనంద్ కాళ్ళకు ఏదో అడ్డంపడినట్టుగా చటుక్కున బోర్లా పడిపోయాడు. అయితే వెంటనే లేవలేదు. అక్కడే దొర్లుతూ హృదయవిదారకంగా అరుస్తున్నాడు.

రాజేష్, అర్చన వెళ్ళేసరికి అక్కడి దృశ్యం గుండెలు కరిగించేలా వుంది.

ఆనంద్ పడినచోట తొండం పురుగుల పుట్టలు వున్నాయి. రేగిపోయిన పురుగులు వందల వేల సంఖ్యలో ఆనంద్ శరీరాన్ని ఆక్రమించుకొని రక్తమాంసాలు పీల్చేస్తున్నాయి!

ఆనంద్ హృదయ విదారకంగా అరుస్తున్నాడు. అర్చన రాజేష్‌ల వంక చూసి రెండు చేతులూ జోడించి దండం పెట్టాడు.

"నన్ను రక్షించండి. ఈ నరకయాతన భరించలేకుండా వున్నాను...." అతనింకా ఏదో అంటుండగానే అతని నోట్లోను, ముక్కుల్లోను పురుగులు దూరిపోయాయి.

ఆనంద్ శ్వాస శాశ్వతంగా ఆగిపోయింది.

ఏమీ చెయ్యలేని నిస్సహాయ స్థితిలో అతని వంక జాలిగా చూస్తుండిపోయారు చాలాసేపు అర్చన, రాజేష్.

క్రమంగా ఆనంద్ ఎముకలు బయటపడుతున్నాయి.

అర్చన ఆ దృశ్యం చూడలేక కళ్ళు మూసుకుంది.

రాజేష్‌కి కూడా ఆనంద్ దీనస్థితి, దయానీయమైన చావు హృదయాన్ని కదిలించింది. ఆ సమయంలో ఆనంద్ దుర్మార్గత్వం, అతని ద్రోహబుద్ధి గుర్తు రాలేదతనికి!

"అర్చన, కమాన్. మనం ఇంక ఒక్క క్షణం కూడా యీ దీవిలో వుండొద్దు. రక్షించుకోవటానికి మనచేతిలో ఆయుధాలేవీ లేవు పరుగెత్తు తీరానికి!" అన్నాడు రాజేష్.

ఇద్దరూ తీరానికి పరుగెత్తారు.

హెలికాప్టర్ చేరుకున్నారు.

హెలికాప్టర్ డోర్ తెరుచుకుని లోపలికి పోయి కూచున్నారు.

అప్పుడు గుర్తొచ్చింది రాజేష్‌కి-తమకి ఆ హెలికాప్టర్ ఏ విధంగానూ ఉపయోగపడదని. హతాశుడైపోయాడు రాజేష్. అర్చన ప్రశ్నార్ధకంగా చూసిందతని వంక.

"అయామ్ సారీ, అర్చనా! నాకు హెలికాప్టర్ నడపటం చేతకాదు" అన్నాడు రాజేష్.

అర్చన నిరాశపడిపోయింది.

54

"ఎంత పనయింది? ఎదురుగా తప్పించుకుని పోగల సాధనం వుండి కూడా ఉపయోగం లేకుండాపోయింది.

అపరాధ పరిశోధన పోటీ-180

[ఫలితాలు]

జూలై '83 నెల "అపరాధ పరిశోధన పోటీ—180"కి సరియైన సమాధానాలు:

1. ఇద్దరు.
2. గ్యాస్.
3. చాతక పక్షి.
4. పూలమొక్కలు.
5. గుంటూరు.

పై జవాబుల ప్రకారం నలుగురు పాఠకులు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వారిలో ఒకరు కూపన్ పై తమ పేరు, చిరునామా వ్రాయలేదు. మిగతా ముగ్గురికి వీరికి అక్టోబరు '83 నెల నుండి ఒక ఏడాదిపాటు "అపరాధ పరిశోధన" మాస పత్రిక లేదా సప్లిమెంట్ (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్) బహుమతిగా పంపబడుతుంది.

(1) శ్రీ వి. శ్రీనివాస్,
ఎల్. ఐ. సి. ఆఫ్ ఇండియా,
కొత్తగూడెం—507 101,
(ఖమ్మం జిల్లా.)

(2) శ్రీ బి. వెంకటేశ్వరరెడ్డి,
యునైటెడ్ మొజాయిక్స్,
26-9-1, రామారావు వీధి,
గాంధీనగరం,
విజయవాడ—520 003.

(3) శ్రీ డి. జగపతి రాజు,
38/960, అజిత్ నగర్,
విజయవాడ—520 015.

మరి, ఎలా యిప్పుడు?" అన్నది అర్చన.

రాజేష్ మౌనంగా కాబిన్‌లోని మెషీన్లవంక, మీటల చూస్తూ చాలాసేపు అలాగే వుండిపోయాడు.

బయట చీకట్లు ముసురుకుంటున్నాయి. ఆ దీవి భయంకర నిశ్శబ్దాన్ని తనలో నింపుకుంటూ మరింత భయంకరంగా కనిపిస్తోంది.

ఇద్దరు ఒకరితో ఒకరు మాట్లాడుకోవటానికే భయపడుతున్నట్టు మౌనంగా వుండిపోయారు.

"ఈ రాత్రికి యిందులోనే కాలక్షేపం చేద్దాం. ఏవైనా విమానాలు యీ వైపు ఎగుర్తూ వెళ్తే అదృష్టవంతులం. లేకుంటే ఆనంద్ శపించినట్టే యీ దీవిలో సజీవ సమాధి అయిపోవాలేమో! నాకు మరోదారి కనిపించటంలేదు" అన్నాడు.

అర్చన జాలిగా చూసిందతనివంక. రాజేష్ పిచ్చివాడిలా వున్నాడు. ఒళ్ళంతా అంగుళం జాగాలేకుండా గాయాలతో నిండిపోయింది. ఒంటిమీద పీలికలైపోయిన గుడ్డలు అతనికి ఆచ్ఛాదనలేకుండా చేశాయి. తన షర్టు కూడా అక్కడక్కడ చిరిగిపోయింది. లుంగీ పేరుకేగాని అది కూడా తూట్లు పడిపోయింది.

రాజేష్ తదేక దీక్షగా యంత్రాలను పరిశీలించటంలో మునిగిపోయాడు.

అప్పటికి పూర్తిగా చీకటిపడిపోయింది.

హెలికాప్టర్ లోపల కూడా చీకటి!

"రాజేష్, యీ రాత్రికి పూర్తిగా యిందులో రెస్టు తీసుకోండి! తెల్లవార్తూనే మళ్ళీ దీని విషయం చూడొచ్చు!" అన్నది అర్చన.

రాజేష్ బాగా అలిసిపోయాడు. అతనికి ఏరోనాటిక్స్‌లో

మీ తీర్పు ఏమిటి?

కేసు నెం. 60 : 'ఫాదర్ సీరియస్ స్టార్ట్ ఇమ్మీడియట్లీ' అని టెలిగ్రాం అందింది వెంకట్రావుకు. హడావుడిగా ఊరెళ్ళిన వెంకట్రావుకు మంచి ఆరోగ్యంతో ఉన్న తండ్రి కనిపించాడు. టెలిగ్రాం సంగతి తెలియదన్నాడు తండ్రి.

వెంకట్రావు టెలిగ్రాం పరిశీలించగా అది R. వెంకట్రావు పేర వుంది. అతని పేరు K. వెంకట్రావు. అతనిది వీధి నెంబరు 9 కాగా, అతని ఇంటి నెంబరు 9.

ఇవన్నీ చూసి కోపంతో చిందులు తొక్కాడు వెంకట్రావు. తనకు వూరెళ్ళి రావటానికి అయిన ఖర్చులు నష్టపరిహారం ఇప్పించమని, టెలికమ్యూనికేషన్స్ డిపార్టుమెంటుపై దావా వేశాడు.

న్యాయనిర్ణేతగా మీ తీర్పేమిటి?

[పై కేసులో - మీ తీర్పు ఏమిటో ఒక పోస్టుకార్డుపై వ్రాసి 5-9-'83 తేదీ లోపల మాకు చేరేటట్లు పంపండి. అత్యుత్తమమైన తీర్పుకు 6 నెలలపాటు పత్రికను బహుమతిగా పంపుతాము. ఫలితాలు నవంబరు '83 నెల సంచికలో చూడండి. —ఎడిటర్]

కేసు నెం. 58 (తీర్పు)

మధుమూర్తి వాదన చెల్లదు.

వస్తువులను అమ్మినప్పటికీ, అవి తన స్వాధీనంలోనే ఉన్న పక్షంలో తాకట్టుపెట్టే హక్కు అమ్మకందారుకు ఉంది అని Sale of Good Act సెక్షన్ 30 చెప్తూంది. కావున మోహన్‌కు మధుమూర్తి వస్తువులను తాకట్టుపెట్టే హక్కు ఉంది.

ఈ నెల న్యాయనిర్ణేత: 'అపన' మాత్రమే. సరియైన తీర్పు ఏ ఒక్కరూ వ్రాయలేదు.

బొత్తిగా ప్రవేశించలేకపోవటంవల్ల ఏ మీట నొక్కితే ఏమవుతుందోనని సంకోచించాడు. లేకుంటే ప్రయోగ పూర్వకంగా హెలికాప్టర్ ఆపరేట్ చేసి వుండేవాడు. తన నిస్సహాయతకు తనే జాలిపడ్డాడు.

అర్చన మరోసారి హెచ్చరించింది. "జంతువుల గాయాలతో బాగా నీరసపడిపోయారు, బాగా విశ్రాంతి తీసుకోండి!" అన్నది.

తాత్కాలికంగా తన ప్రయత్నాన్ని విరమించుకున్నాడు రాజేష్. కాని అతని మెదడుకు విశ్రాంతిలేదు. కళ్ళు మూసినా తెరిచినా హెలికాప్టర్ మీటలు కళ్ళముందు తిరుగుతున్నాయి.

ఎలా? దీన్ని ఆపరేట్ చేయటం, కంట్రోల్ చేయటం తనకి బొత్తిగా రాదు. ఒకవేళ గుడ్డిగా ఏదోక మీట నొక్కి మూవ్ చేయగలిగినా దాన్ని నడపటం, ఏంగిల్స్ మార్చటం, దిశలు మళ్ళించటం, ల్యాండ్ అవటం-యివన్నీ సమస్యలే? అలా అని మరొక్కరోజు కూడా యీ నిర్జన ప్రాంతంలో గడపడం కష్టం! తన గాయాలు బాగా నొప్పి పెడుతున్నాయి. సెప్టిక్ అయే ప్రమాదం లేకపోలేదు. వీలయినంత తొందర్లో ఫిజిషియన్‌ని సంప్రదించటం చాలా ముఖ్యం!

రాజేష్ అసహనంగా సీట్లో కదలడం అర్చన దృష్టినుంచి దాటిపోలేదు. ఆమె రాజేష్ చేతిని మృదువుగా నొక్కింది.

"నిద్రరావటం లేదుకదూ!" అన్నది.

రాజేష్ ఆమెవంక చూశాడు. చీకటిని పారద్రోలుతూ విరిసిన వెన్నెల ఆమె ముఖం మీద కీనీడగా దోబోచులాడుతోంది! ఆమె కళ్ళు ఆత్మవిశ్వాసంతో వెలిగిపోతున్నాయి.

ఆమె ఎంత ధైర్యంగా వున్నది? తనకే ఎందుకో

అపరాధ పరిశోధనపోటీ-182

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితంపై వ్రాసి, దానితో 75 పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ 75 పైసల పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హోం. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 5-9-83 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు నవంబరు '83 నెల సంచికలో ప్రచురిస్తాము. *

1. నేరస్థులకు యీ శిక్షను విధించటము రద్దుచేయాలని కొందరి వాదన—? (వురిశిక్ష, మరణశిక్ష)
2. దేశంలో యీ కొరత తీరేనా—? (ఆహారధాన్యాలు, విద్యుచ్ఛక్తి)
3. ఈ సంస్థకు ప్రత్యేకంగా ఆత్మాహుతి బృందాలంటూ వున్నాయి—? (ఆనందమార్గీయులు, ఆర్.ఎస్.ఎస్.)
4. వీటిలోని కల్తీ రైతులను ముంచేస్తున్నాయి—? (ఎరువుల, క్రిమిసంహారక మందులు)
5. జాతీయ బ్యాంకులన్నీ ఇకమీదట వీటినికూడా తీసుకుంటాయి—? (చినిగిన నోట్లు, చిల్లర నాణేలు)

తెలీని భీతి, అధైర్యం!

ఎప్పుడో అర్థరాత్రి దాటాక మగతగా నిద్రపట్టింది రాజేష్‌కు. తెల్లవారింది.

రాజేష్ మళ్ళీ మీటల పరీక్షలో మునిగిపోయాడు. ఓ పక్క ఆకలి, దాహంతో శోషవచ్చినట్టుంది! మరోపక్క గాయాల బాధ, సలుపు నరనరాన్నీ పిండేస్తుంటే ఏకాగ్రత కుదరక సతమతమవుతున్నాడు.

"బాగా ఆకలివేస్తోంది కదూ!" అన్నది అర్చన.

రాజేష్ శుష్కహాసం చేశాడు.

"నువ్వు కిందికి దిగి ఏదైనా విమానం ఎగుర్తుందేమో చూస్తావా?" అన్నాడు.

"విమానం హోరు వినిపిస్తుందిగా. గ్లాస్ డోర్ తెరిచే వుంచాను. కిందికి దిగాలంటేనే భయంపుడుతోంది! ప్రమాదాలను ఎదిరించి, ప్రాణాలు దక్కించుకున్నాక ప్రాణం మీద తీపి అంతకంతకు ఎక్కువవుతోంది! మనం క్షేమంగా విశాఖ చేరతామని నా సిక్త్‌సెన్స్ చెపుతోంది! నా మనస్సాక్షి చెప్పిన విషయాలు గతంలో నిజమయ్యాయి" అన్నది అర్చన.

రాజేష్ మౌనంగా తన పనిలో నిమగ్నమయ్యాడు. కొద్దికొద్దిగా మెకానిజం వంటపడుతోంది. ఆపరేటింగ్ ఛానెల్ పరీక్షగా చూస్తున్నాడు. ఫాలో అవటానికి ప్రయత్నిస్తున్నాడు.

"బాగా ఆకలిగా వుంది" అన్నది అర్చన.

ఆమె సాధారణంగా ఆకలి విషయంలో సీరుకారిపోదు. ఉపోషాలు వుండటం బాగా అలవాటైపోయిన అర్చన అలా అన్నదంటే ఆమెకి చాలా ఎక్కువగా, తట్టుకోలేనంతగా ఆకలి అవుతూ వుండాలి!

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, నెల నెలా పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 10-00లకే వి.పి.ద్వారా పంపబడతాయి. ఇందుకు అయ్యే పోస్టు ఖర్చులన్నీ మేమే భరిస్తాము.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 5/-లు పంపటమే. పైకం మనియార్డరుద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంప వచ్చును. సొమ్ము చేరగానె మీకు సభ్యత్వము కార్డు అందుతుంది.

3. 'హోమ్ డెలివరీ' వల్ల మీకు కాపీలు నెల నెలా గ్యారంటీగా, త్వరితంగా చేరుతాయి. మీ ఇంటిదగ్గరనే డబ్బు చెల్లించి కాపీలు పొందవచ్చును. కాపీలకోసం మీరు ఏజెంట్ చుట్టూ తిరుగనవసరంలేదు. కాపీలు దొరకలేదనే నిరాశ,పోస్టులో పోయే సమస్య, ఎంతమాత్రం వుండదు. పైగా సభ్యులు పోటీ లలో ఫ్రీగా పాల్గొనవచ్చును.

4. ఏ కారణంచేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, వాటి పైకం రు. 10/-లు వెంటనే M. O. చేయాలి. కాపీలు తిరిగి 'రికార్డెడ్ డెలివరీ'లో పంపుతాము. లేదా మీ సభ్యత్వము అంత టితో రద్దవుతుంది.

5. ఇండియాలో మీరు ఏ మారుమూలనున్నా కాపీలు ఖచ్చి తంగా అందజేయబడతాయి. మీ చిరునామా మారినప్పుడల్లా తగినంత ముందుగా మాకు తెలియజేయండి.

6. పాతకాపీలు కావలసిన వారికి వాటి అసలు ధరకే వి. పి. ద్వారా పంపగలము. ఎక్కువ కాపీలు తీసుకునేవారికి కొంత కన్సెషన్ కూడ లభిస్తుంది.

7. నెల నెలా వి. పి. తీసుకోవటం కష్టమనుకునేవారు, ఏడాది పైకము రు. 120/-లు ముందుగా పంపవచ్చును. దీని వల్ల మీకు ఖర్చులు కొంత తగ్గుతాయి.

నేడే మీరూ 'హోమ్ డెలివరీ' లో చేరండి!

రాజేష్ జాలిగా చూశాడామెవంక. "నా పరిస్థితీ అలాగే వుంది. కాని ఆహారం ఎలా వస్తూంది?....ఆ! ఆనంద్ మొన్న సాయంత్రం రొట్టెలు, జాం, వాటర్ ఇక్కడ్నించే తెచ్చి మనకు పెట్టాడు. ఓసారి హెలికాప్టరంతా పరిశీలించు. ఏమైనా మిగిలివుంటే కొంతైనా ఆకలి బాధ తీర్తుంది" అన్నాడు, తన పనిలో మునిగిపోతూ.

అర్చన లేచింది. హెలికాప్టరంతా ప్రతి సెంటిమీటరు వెతకసాగింది. ఖాళీ వాటర్ బాటిలు, జాంసీసా సగం ఖాళీ అయి కనిపించాయి.

"జాం కనిపించింది. ఓ రొట్టె వుంటే బావుణ్ను!" అన్నది పరిశోధన కొనసాగిస్తూ.

ఓ అయిదు నిమిషాల తర్వాత అర్చన ఆనందంగా అరిచింది. "యురేకా?" అని!

రాజేష్ దిగ్గున తలెత్తి చూశాడు.

"ఆహారం దొరికిందా?" అన్నాడు.

"అంతకన్న గొప్పది, ముఖ్యమైనది దొరికింది. గాడ్ యీజ్ గ్రేట్!" అన్నది అర్చన.

రాజేష్ సీట్లోంచి లేచి ఆమె దగ్గరగా వచ్చాడు.

అర్చన అతనికో పుస్తకం అందించింది.

అది హెలికాప్టర్ 'ఆపరేషన్‌కీ' దాంట్లో హెలికాప్టర్ ప్రతిభాగమూ వివరంగా బొమ్మగీచి, పేర్లు రాపి అది ఎలా పనిచేస్తూందో, చెడిపోతే ఎలా బాగుచెయ్యాలో అవన్నీ సవిస్తరంగా వర్ణింపబడి వున్నాయి!

రాజేష్ ముఖం ఆనందంతో వెలిగిపోయింది. పుస్తకాన్ని పక్కన పెట్టుకుని ఆపరేషన్ ఛానెల్ పరీక్షగా పరిశీలించి ఆకళింపు చేసుకున్నాడు.

సూర్యుడు నడినెత్తినకొచ్చేసరికి ప్రతి విషయంలోను

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీది బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి, పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్‌కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి. మీ నెంబరు ప్రతి నెలా వి. పి. ప్యాకెట్టు మీద వుంటుంది.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్‌ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 5-9-'83 తేదీలోపల మాకు చేరాలి. ఫలితాలు నవంబరు '83 నెల సంచికలో ప్రకటిస్తాము. ●

జూలై '83 పోటీ ఫలితాలు

(1) జూలై '83 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

పొంచి వున్న పులి!

మట్టుబెట్టే బెబ్బులి!!

పంపినవారు: శ్రీ పి. లక్ష్మీనారాయణశెట్టి, బి. ఎస్. సి., ప్రొద్దుటూరు, కడపజిల్లా.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

మరపురాదు నాటి ఘడియ!

మరలిరాదు నీదు చెలియ!!

పంపినవారు: శ్రీమతి గరిమెళ్ళ శ్రీదేవి, 1-4-879/55 ఎస్.బి.ఐ. ఆఫీసర్స్ కాలనీ, గాంధీనగర్ హైద్రాబాదు-500 380.

క్షుణ్ణంగా నాలెడ్జి సంపాదించాడు. టాంక్‌లో యింధనం వున్నదో లేదో పరీక్షచేసుకుని నిర్ధారణ చేసుకున్నాడు.

ప్రయోగాత్మకంగా ముందు హెలికాప్టర్ని గాల్లోకి లేపి, కొద్ది గజాలు ఎత్తు లేచాక టర్నింగ్‌చేసి మళ్ళీ ల్యాండ్ అయ్యాడు.

అతనిలో విజయగర్వం తొంగిచూసింది.

"ఫరవాలేదు, అర్చనా! వైజాగ్ వెళ్ళేవరకు సందేహం లేకుండా నడపగలను. ఫండమెంటల్స్ తెలిసిపోయాయి. ఏ ప్రమాదం లేకుండా వైజాగ్ చేర్చగలనన్న ఆత్మ విశ్వాసం కలిగింది" అన్నాడు.

అర్చన ప్రోత్సాహకరంగా చూసిందతనివంక.

"నాకా నమ్మకముంది. ఇక ఆలస్యం దేనికి, బయలు దేరుదామా?" అన్నది.

రాజేష్ మరోసారి "క్రీ" మనసులో మననం చేసుకున్నాడు. ఇంతలో మరో ధర్మసందేహం తలెత్తింది మనసులో. అర్చన ప్రశ్నార్థకంగా చూసిందతనివంక.

"వైజాగ్ ఏ దిశలో వుందో, ఎలా ప్రయాణించాలో తెలియదుకదా? ఎలా?" అన్నాడు రాజేష్.

అర్చన చూపు ఆపరేషన్ ఛానెల్‌కి కుడిపక్కనున్న మ్యాప్‌మీద పడింది.

"అదేమిటో చూడు, కాగితం అంటించినట్టున్నది గ్లాస్ మీద" అన్నది.

రాజేష్ మ్యాప్‌వంక చూసి ఆనందంగా అరిచాడు. "ఎస్. ఇది వైజాగ్‌నుంచి సాగరలోయమీదుగా సూచింపబడిన బంగాళాఖాతం మీదుగా పోయే విమాన మార్గాల వివరాలు సూచించే పటం. ఆనంద్ వివరంగా రాసి పెట్టుకున్నట్టున్నాడు" అన్నాడు.

శ్రీ మహాలక్ష్మివారి వెరైటీ నవలలు

వెలువడినవి!

1. రేపటి కొడుకు — మల్లాది వెంకట కృష్ణమూర్తి — 12-00

2. నత్తలొస్తున్నాయి జాగ్రత్త — ,, — 17-00
(విజయ సీరియల్)

3. కౌగిట్లో కృష్ణమ్మ — లల్లాదేవి — 16-00
(ఆంధ్రజ్యోతి సీరియల్)

4. మంచుబొమ్మలు — వేల్పూరి సుభద్రాదేవి — 18-00

5. అమానుషం — వసుంధర — 15-00
(ఆపన సీరియల్)

6. కైలాస నగరం — శ్యాంబాబు — 15-00
(అపన సీరియల్)

7. జీవనయాత్ర — మాదిరెడ్డి సులోచన — 17-00

కాపీలు అన్ని పుస్తకాల షాపులలోను

లభించును. లేదా మాకు వ్రాయండి.

ఫోన్ నెం: 63322

శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్ ప్రైజెస్
గవర్నరు పేట—విజయవాడ - 2.

ఓ అరగంట పరిశీలించినమీదట ఆ దీవినుంచి వైజాగ్ ఏ దిశలో పోవాలో పూర్తిగా అవగతమయింది రాజేష్‌కు.

"సందేహాలన్నీ తీరాయి. స్టార్టు చేస్తున్నాను" అన్నాడు రాజేష్. అర్చన సంతోషంగా తలూపింది.

మరుక్షణం హెలికాప్టర్ గాల్లోకి లేచింది.

ఓ గంట గడిచేసరికి వాళ్ళకు దూరంగా "సాగరలోయ గెస్ట్‌హౌస్" అన్న బోర్డు, సుందరమైన బిల్డింగ్సు, అందమైన దృశ్యాలు కనిపించాయి.

అర్చన ఆనందంతో కేరింతలు కొట్టింది.

"సాగరలోయ! మనం చూడలేకపోయినా సుందర స్వప్నం. ఆగుదామా?" అన్నది.

"ఓసారి నీ అవతారం, నా అవతారం ఎలా వున్నాయో చూశావా?" అన్నాడు రాజేష్ నవ్వుతూ.

అర్చన సిగ్గుపడింది.

హెలికాప్టర్ విశాఖపట్నంవైపు సాగిపోయింది.

—: సమాప్తం :—

అంకితం

నా ఆరాధ్య దైవం, కల్యాణ చక్రవర్తి శ్రీనివాసుని పాదపద్మములకు, భక్తి ప్రపత్తులతో.

—రచయిత

Edited and Published by S. DAMODAR REDDY
3-4-554 Narayanaguda, Hyderabad-500 029,
and Printed at Kranti Press, Madras-600 001.

Blank Page

Regd.no: H/HD-48
'PRABHAKAR'